# బృహదారణ్యకోపనిషత్తు

## ఖిలకాండము అధ్యాయము - 6

## ఉపోద్ఘాతము

అధ్యాయములు 5, 6 లను కలిపి ఉపాసనా కాండము అంటారని చూశాము. ఈ అధ్యాయములో కూడా కొన్ని ఉపాసనలను చూస్తాము. ఇందులోని మొదటి మూడు బ్రాహ్మణములూ ఇంచుమించుగా ఛాందోగ్యోపనిషత్తులోని ఐదవ అధ్యాయంలోని మొదటి మూడు ఖండాలలాగానే ఉంటాయి.

## 6.1 - ప్రాణ సంవాద బ్రాహ్మణము

ఇది కూడా హిరణ్యగర్భ ఉపాసన. హిరణ్యగర్భను ప్రాణరూపంలో చూస్తాము. అందువల్ల ఈ ఉపాసనను **ప్రాణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన** అంటారు. ప్రాణంయొక్క ఏడు గుణాలను వివరిస్తుంది ఉపనిషత్తు. ఉపాసన చేసేటప్పుడు ఈ ఏడు గుణాలను గుర్తు తెచ్చుకోవాలి. అందువల్ల ఈ ఉపాసనను **సప్తగుణ విశిష్ట ప్రాణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన** అనికూడా అంటారు.

మంత్రం 6.1.1

**ఓం యో హ వై జ్యేష్ఠం చ శ్రేష్ఠం చ వేద జ్యేష్ఠశ్చ శ్రేష్ఠశ్చ స్వానాం భవతి ప్రాణో వై జ్యేష్ఠశ్చ శ్రేష్ఠశ్చ జ్యేష్ఠశ్చ శ్రేష్ఠశ్చ స్వానాం భవత్యపి చ యేషాం బుభూషతి య ఏవం వేద ॥**

ఈ మంత్రంలో ప్రాణంయొక్క రెండు గుణాలను స్తుతించటం జరుగుతున్నది.

**యో హ వై జ్యేష్ఠం చ శ్రేష్ఠం చ** – ప్రాణమే జ్యేష్ఠం, శ్రేష్ఠం. జ్యేష్ఠం అంటే మొదట పుట్టిన వ్యక్తి. శరీరంలోని అన్ని అంగాలలోకీ ప్రాణం మొదట పుట్టింది. తల్లిగర్భంలో రూపుదిద్దుకునే శిశువులో ముందుగా ప్రాణం నెలకొన్న తర్వాతే; కన్ను, ముక్కు మొదలైన ఇంద్రియాలు రూపుదిద్దుకుంటాయని శంకరులవారు వివరిస్తారు. ఆ విధంగా ప్రాణం జ్యేష్ఠం అయింది.

జ్యేష్ఠమే కాదు శ్రేష్ఠం కూడా అంటున్నది ఉపనిషత్తు. ఎందుకంటే జ్యేష్ఠపుత్రుడే శ్రేష్ఠపుత్రుడవాలనే నియమమేమీ లేదు. కాని ప్రాణం విషయంలో మాత్రం అది జ్యేష్ఠం, శ్రేష్ఠం కూడా. ఎందుకు ప్రాణం శ్రేష్ఠం? ఈ బ్రాహ్మణములో రాబోయే కథే దానికి నిదర్శనం. ఈ కథద్వారా ఇంద్రియాలు లేకుండా ప్రాణం పని చెయ్యగలదు కాని, ప్రాణం లేకుండా ఇంద్రియాలు పనిచెయ్యలేవని తెలుస్తుంది. అందువల్ల ప్రాణం శ్రేష్ఠం. ఈ ఉపాసనకు ఫలం కూడా ఉంది అంటుంది ఉపనిషత్తు.

**జ్యేష్ఠశ్చ శ్రేష్ఠశ్చ స్వానాం భవతి** – ఎవరైతే ప్రాణంయొక్క జ్యేష్ఠగుణం, శ్రేష్ఠగుణంమీద ఉపాసన చేస్తాడో అతను అందరిలో జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడుగా కీర్తించబడతాడు. స్వానాం అంటే తన కుటుంబసభ్యులలో.

**యేషాం బుభూషతి** – అంతేకాదు, ఎవరిలో జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు కావాలనుకుంటే వారిలో కూడా జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు అవుతాడు. అంటే సంగీత విద్వాంసుడు కావాలనుకుంటే అందులో కీర్తిమంతుడు అవుతాడు; డాక్టరు కావాలనుకుంటే అందులో కీర్తిమంతుడు అవుతాడు.

అందువల్ల ఇది **జ్యేష్ఠత్వ శ్రేష్ఠత్వ గుణవిశిష్ట ప్రాణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన**

## మంత్రం 6.1.2

**యో హ వై వసిష్ఠాం వేద వసిష్ఠస్స్వానాం భవతి వాగ్వై వసిష్ఠా వసిష్ఠస్స్వానాం భవత్యపి చ యేషాం బుభూషతి య ఏవం వేద ॥**

రాబోయే ఐదు మంత్రాల్లో ఉపనిషత్తు ఐదు అంగాల గుణాలను స్తుతిస్తుంది. అవి రెండు కర్మేంద్రియాలు, రెండు జ్ఞానేంద్రియాలు, మనస్సు. ఇవి మన సూక్ష్మశరీరంలో ఉన్న 19 అంగాలకు ప్రతీకలు. మన సూక్ష్మశరీరంలో పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణలు ఉన్నాయి. నాలుగు అంతఃకరణలు అంటే మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం. అన్నింటినీ కలిపి మనస్సు అంది ఉపనిషత్తు ఇక్కడ. అలాగే పంచప్రాణాలనూ కలిపి ఒక ప్రాణంగా తీసుకుంది.

ముందు ఈ ఐదు అంగాల గొప్పతనాన్ని కీర్తించి, తర్వాత వాటి గురించిన కథ చెబుతుంది ఉపనిషత్తు. ఆ కథలో ఇంద్రియాలు వాటి గుణాలను ప్రాణానికి ధారపోసి, వాటి పేరును కూడా ధారపోస్తాయి. ఆ విధంగా చివర్లో ప్రాణానికి ఏడు గుణాలు ఉన్నట్టు చూస్తాము. అందువల్ల ప్రస్తుతం ఆయా ఇంద్రియాల గుణాలను స్తుతించినా, అవి వాటికి చెందవు. అవి వాటి గుణాలను ధారపోస్తాయి.

**వాగ్వై వసిష్ఠా** – వాగింద్రియం వసిష్ఠ. వాక్కును ఎందుకు వసిష్ఠ అంది ఉపనిషత్తు? ఇది కూడా ఇంచుమించు శ్రేష్ఠం పదంలాంటిదే. శంకరులవారు ఈ పదానికి రెండు అర్థాలు ఇస్తున్నారు.

**1. వసతి వాసయతి ఇతి వసుః –** తను ధనవంతుడై ఉండటమే కాక, ఇతరులను కూడా ఐశ్వర్యవంతులను చేస్తాడు. వాగింద్రియం బాగున్నవ్యక్తికి మంచి జ్ఞానం ఉంటుంది, మంచి వాక్కు ఉంటుంది. దానివల్ల అతను ఐశ్వర్యవంతుడవటమే కాక, తక్కినవారికి కూడా ధనసహాయం చేస్తాడు. ఆ విధంగా వాగింద్రియానికి వశిష్ఠగుణత్వం వచ్చింది.

**లక్ష్మీర్వసతి జిహ్వాగ్రే**

లక్ష్మీదేవి వాగింద్రియంలో ఉంటుంది.

**2. వాసయతి సర్వాన్ ఆచ్ఛాదయతి ఇతి వసిష్ఠః** – వస అచ్ఛాదనే అనే ధాతువునుంచి వసిష్ఠా అనే పదం ఉత్పన్నమైంది. ఆ విధంగా వాక్కు కప్పివేయునది అని అర్థం వస్తుంది. అంటే వాగింద్రియం బాగున్నవారు వారి

వాగ్ధాటివల్ల, వారి జ్ఞానంవల్ల, తక్కినవారిమీద ఆధిక్యత పొందుతారు. ఆ విధంగా వారి తేజస్సుచేత తక్కినవారు ఆచ్ఛాదింపబడినట్టు అవుతుంది.

ఇది **వసిష్ఠగుణ విశిష్టగుణ వాగింద్రియ రూపేణ హిరణ్యగర్భ ఉపాసన**

ఈ కథ అయ్యాక వాక్కు తన వసిష్ఠత్వగుణాన్ని ప్రాణానికి ధారపోస్తుంది. దీని ఫలమేమిటి?

**వసిష్ఠో భవతి** – అతను సంఘంలో మంచి పేరుప్రతిష్ఠలు తెచ్చుకుని, గొప్ప ఐశ్వర్యవంతుడవుతాడు. అంతేకాదు, తన వాక్పటిమతో తక్కినవారిని అధిగమిస్తాడు.

**వసిష్ఠస్స్వానాం భవత్యపి చ యేషాం బభూషతి** – తక్కినవారిలో మాత్రమే కాదు, తను ఎక్కడ కోరుకుంటే అక్కడ వసిష్ఠుడు అవుతాడు.

వాక్కు కర్మేంద్రియాలను సూచిస్తుంది.

## మంత్రం 6.1.3

**యో హ వై ప్రతిష్ఠాం వేద ప్రతితిష్ఠతి సమే ప్రతితిష్ఠతి దుర్గే చక్షుర్వై ప్రతిష్ఠా చక్షుషా హి సమే చ దుర్గే చ ప్రతితిష్ఠతి ప్రతితిష్ఠతి సమే ప్రతితిష్ఠతి దుర్గే య ఏవం వేద ॥**

ఇప్పుడు జ్ఞానేంద్రియాలను చూస్తాము. చక్షువు, అంటే కన్ను గొప్పతనం చూస్తాము.

**చక్షుర్వై ప్రతిష్ఠా** – కన్నుయొక్క గుణం ప్రతిష్ఠ. ఇక్కడ ప్రతిష్ఠ అంటే స్థిరత్వమును ఇచ్చేది. అంటే నడుస్తున్నప్పుడు ఎత్తుపల్లాలు ఉంటే చూపిస్తుంది. అందువల్లనే కంటిచూపు సరిగ్గా లేనివారు కర్ర పట్టుకుని నడుస్తారు. వారికి కర్ర ప్రతిష్ఠ అవుతుంది.

ఇది **ప్రతిష్ఠత్వ గుణవిశిష్ట చక్షురింద్రియ రూపేణ హిరణ్యగర్భ ఉపాసన**

ఈ కథ అయ్యాక కన్ను తన ప్రతిష్ఠత్వ గుణాన్ని ప్రాణానికి ధారపోస్తుంది. దీని ఫలమేమిటి?

**ప్రతితిష్ఠతి సమే ప్రతితిష్ఠతి దుర్గే చ** – ఎవరైతే ఈ విధంగా ఉపాసిస్తాడో, అతను జీవితమనే ప్రయాణాలలో ఒడిదుడుకులు లేకుండా సాఫీగా ప్రయాణిస్తాడు. జీవితం మామూలుగా సాఫీగా సాగదు. ఆరోగ్య సమస్య వస్తుంది, ధన సమస్య వస్తుంది, మానసిక ఒత్తిడి వస్తుంది కాని ఇతనికి మాత్రం జీవితం సాఫీగా సాగిపోతుంది. ఇతని జీవితం జ్ఞాని జీవితానికి దగ్గరగా ఉంటుంది. జ్ఞానిలాగా ఇతను సుఖదుఃఖాలలో సమతుల్యాన్ని పాటిస్తాడు. అంటే ఏవైనా సమస్యలు ఎదురైనా అతను నిశ్చలంగా, నిశ్చింతగా, ప్రశాంతంగా ఉంటాడు.

## మంత్రం 6.1.4

**యో హ వై సమ్పదం వేద సగ్ం హాస్మై పద్యతే యం కామం కామయతే శ్రోత్రం వై సమ్పచ్ఛ్రోత్రే హీమే సర్వే వేదా అభిసంపన్నాస్సగ్ం హాస్మై పద్యతే యం కామం కామయతే య ఏవం వేద ॥**

ఇప్పుడు ఇంకొక జ్ఞానేంద్రియాన్ని చూస్తాము. శ్రోత్రేంద్రియం, అంటే చెవియొక్క గొప్పతనం చూస్తాము.

**శ్రోత్రం వై సంపత్** – వినటమే సంపద. ఎందుకు?

**శ్రోత్రే హీమే సర్వే వేదా అభిసంపన్నాః** – చెవియొక్క వినికిడి శక్తివల్లనే వేదాలయొక్క సంపదను పొందుతాము. వేదాలను సంపద అని ఎందుకంది ఉపనిషత్తు?

దీనికి అనేక కారణాలు చెప్పవచ్చు. ముందుగా వేదపారాయణం చేస్తేనే గొప్ప ఫలం పొందుతాడు. అదే అంతులేని సంపద. అదికాక, వేదాలలో ఉన్న బోధను పాటించటంద్వారా అతను ధర్మార్థకామమోక్షాలనే నాలుగు పురుషార్థాలను కూడా పొందవచ్చు. ధర్మార్థకామాలు ప్రేయోరూపసంపద అయితే, మోక్షం శ్రేయోరూప సంపద అవుతుంది. సంపద పురుషార్థాలవల్ల వస్తే, పురుషార్థాలు వేదాన్ని వినటంవల్ల వస్తాయి; వేదాన్ని వినటానికి చెవులు తోడ్పడతాయి. ఆ విధంగా చెవియొక్క వినికిడి శక్తి సంపదను ఇస్తుంది.

ఇది **సంపత్ గుణవిశిష్ట శ్రోత్రేంద్రియరూపేణ హిరణ్యగర్భ ఉపాసన**

ఈ కథ అయ్యాక చెవి తన సంపదత్వగుణాన్ని ప్రాణానికి ధారపోస్తుంది. దీని ఫలమేమిటి?

**సర్వే వేదా అభిసంపన్నాస్సగ్ం హాస్మై పద్యతే యం కామం కామయతే** – ముందుగా వేదపండితుడు అవుతాడు. అంతేకాక అతను ఏ పురుషార్థం కోరుకుంటే దాన్ని పొందుతాడు.

## మంత్రం 6.1.5

**యో హ వా ఆయతనం వేదాయతనగ్ం స్వానాం భవత్యాయతనం జనానాం మనో వా ఆయతనమాయతనగ్ం స్వానాం భవత్యాయతనం జనానాం య ఏవం వేద ॥**

ఇప్పుడు మనస్సుయొక్క గొప్పతనాన్ని చూస్తాము.

**మనో వా ఆయతనమ్** – మనస్సే నిశ్చయంగా ఆయతనం. ఆయతనం అంటే ఆశ్రయం. మనస్సు ఆయతనం ఎందుకు అయిందంటే మనస్సు ఇంద్రియాలకు ఆయతనం. కన్ను చూసిన దానివెనక మనస్సు లేకపోతే కన్ను ఆ వస్తువుయొక్క అందాన్ని ఆస్వాదించలేదు. అలాగే ఏదైనా ప్రసంగానికి వెళ్ళినా, చెవి వెనుక మనస్సు లేకపోతే ఆ ప్రసంగం వినలేము.

అంతేకాదు, మనస్సు విషయవస్తువులకు కూడా ఆయతనం. ఎందుకంటే విషయవస్తువులను కాని, జగత్తును కాని మనం ప్రత్యక్షంగా అనుభవించలేము. మనస్సు దృష్టిలో పడిన వస్తువునే ఆస్వాదిస్తాము.

ఉపదేశ సాహస్రిలో శంకరాచార్యులు బుద్ధ్యరూప ప్రకరణంలో ఈ విషయాన్ని వివరంగా చర్చిస్తారు. ఇంద్రియాలద్వారా కొన్ని విషయాలను గ్రహించి వాటినే మనస్సుకు అందిస్తాము. అవి మనస్సులో చోటు చేసుకుంటాయి. వాటినే మనస్సు అనుభవిస్తుంది.

ఈ గదిలో ఏముంది అంటే కన్ను చూసిన వాటినే వివరిస్తాము. కొన్ని వస్తువులు అక్కడ ఉన్నా కూడా, అవి కంటి దృష్టిలో పడవు. వాటిని చూడము. అంతేకాదు, ఎదురుగా ఉన్నదాన్ని సరిగ్గా స్వీకరించలేకపోవచ్చు కూడా. ఎదురుగా ఉన్న తాడును సరిగ్గా చూడలేదు, దాన్ని చూసి పాము అనుకున్నాము. మనస్సులో పాము అనే ఆలోచన పడింది. అందువల్ల మనం చూసే ప్రపంచం తాడు ఉన్న ప్రపంచం కాదు; పాము ఉన్న ప్రపంచం. నిజానికి బాహ్యప్రపంచం ఉంది కాని దాన్ని మనకు ఇష్టమైనట్టుగా చూసాము. ఇది కూడా స్వప్నప్రపంచంలాగే ఉంటుంది. ఎందుకు?

నిజానికి జాగ్రత్ ప్రపంచం ఈశ్వరసృష్టి; స్వప్నప్రపంచం నేను సృష్టించిన సృష్టి. కాని ఈశ్వరసృష్టిని కూడా నా మనస్సు స్పందించినట్టుగా చూస్తాను. ఈశ్వరుడు మనుష్యులను సృష్టించాడు. నేను ఒకరిని చాలా అందంగా ఉన్నాడు అంటే, ఇంకొకరు అతనినే అస్సలు బాగోలేదు అంటారు. నాకు అందంగా ఉన్నది ఇంకొకరికి అందంగా ఉండి తీరాలని లేదు. అలాగే సంగీతం – నా చెవులకు వీనులవిందుగా ఉన్న సంగీతం, ఇంకొకరి చెవులకు కర్ణకఠోరంగా ఉంటుంది. ఈశ్వరుడు సంగీతాన్ని సృష్టించాడు – దానికి పేర్లు పెట్టింది మనమే. బాగుంది, బాగాలేదు అనే వివక్షత చూపిస్తున్నాము. ఆ విధంగా మనస్సు ప్రపంచానికి ఆయతనం అవుతుంది.

ఇది **ఆయతనత్వ గుణవిశిష్ట మనోరూపేణ హిరణ్యగర్భ ఉపాసన**

ఈ కథ అయ్యాక మనస్సు తన ఆయతనత్వ గుణాన్ని ప్రాణానికి ధారపోస్తుంది. దీని ఫలమేమిటి?

**ఆయతనం స్వానాం భవత్యాయతనం జనానామ్** – ఎవరైతే ఈ ఉపాసన చేస్తాడో, అతను తన వారికి, తక్కిన వారికి కూడా ఆశ్రయమవుతాడు. అందరికీ తన ఇంట్లోనైనా ఆశ్రయం ఇస్తాడు, లేదా ఇల్లు లేనివారికి ఇంటిని ఏర్పాటు చేస్తాడు. తనవారికే కాక తన ఊరిలో వారికి లేదా తన ఆఫీసులో వారికి ఆధారమవుతాడు. ఈ ఆశ్రయాన్ని మనస్సుకు కూడా అన్వయించవచ్చు. అంటే ఇతరులకు ఆత్మస్థైర్యాన్ని కూడా ఇస్తాడు. వారికి సలహా ఇవ్వటమో, ఓదార్చటమో చేస్తాడు.

## మంత్రం 6.1.6

**యో హ వై ప్రజాతిం వేద ప్రజాయతే హ ప్రజయా పశుభీ రేతో వై ప్రజాతిః ప్రజాయతే హ ప్రజయా పశుభిర్య ఏవం వేద ॥**

ఇప్పుడు మళ్ళీ కర్మేంద్రియాన్ని చూస్తాము. ఉపస్థ గొప్పతనం చూస్తాము.

**రేతో వై ప్రజాతిః** – రేతస్సు అంటే పురుషబీజం, కాని ఈ సందర్భంలో దీన్ని ఉపస్థ ఇంద్రియంగా చూస్తాము అంటే జననేంద్రియంగా చూస్తాము. రేతస్సే ప్రజాతి అంటే ఈ ఇంద్రియంవల్లనే పిల్లలు పుడతారు.

ఇది **ప్రజాతత్త్వ గుణవిశిష్ట ఉపస్థేంద్రియరూపేణ హిరణ్యగర్భ ఉపాసన**

ఈ కథ అయ్యాక ఉపస్థేంద్రియం తన ప్రజాతత్త్వగుణాన్ని ప్రాణానికి ధారపోస్తుంది. దీని ఫలమేమిటి?

**ప్రజయా పశుభిః** – ఎవరైతే ఈ ఉపాసన చేస్తాడో, అతను సంతానంతో, పశువులతో వర్ధిల్లుతాడు.

ఈ విధంగా ప్రాణానికి రెండు గుణాలు అంటే జ్యేష్ఠత్వం, శ్రేష్ఠత్వం ఉంటే; తక్కిన ఇంద్రియాలకు ఒక్కొక్క గుణమే ఉంది. అందువల్ల ఒకసారి వాటిలో వాటికి గొడవ వచ్చింది. ఏ అంగానికి ఆ అంగమే నేను గొప్ప అంటే నేను గొప్ప అని వాదించింది. దాని గురించిన కథను ఇప్పుడు చూడబోతున్నాము.

## మంత్రం 6.1.7

**తే హేమే ప్రాణా అహగ్ంశ్రేయసే వివదమానా బ్రహ్మ జగ్ముస్తద్ధోచుః కో నో వసిష్ఠ ఇతి తద్ధోవాచ యస్మిన్ వ ఉత్క్రాన్త ఇదగ్ం శరీరం పాపీయో మన్యతే స వో వసిష్ఠ ఇతి ॥**

**తే హేమే ప్రాణా** – ఇక్కడ అన్ని ఇంద్రియాలను కూడా కలిపి ప్రాణం అంటున్నది ఉపనిషత్తు. మామూలుగా వీటిని వివరించేటప్పుడు ప్రాణం అంటే పంచప్రాణాలు అని అర్థం. తక్కిన ఇంద్రియాలను పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలుగా వ్యవహరిస్తాము. మనస్సును చత్వారి అంతఃకరణం అంటాము. ఇప్పుడు ప్రాణం అనే పదంలో మనస్సును కూడా తీసుకోవాలి. వీటన్నిటినీ కూడా ప్రాణంగా వ్యవహరిస్తున్నది ఉపనిషత్తు. ఎందుకు? ఈ కథ చివర్లో చూస్తాము, ఇవన్నీ ప్రాణానికి వాటి గుణాలతో పాటు వాటి పేర్లను కూడా ధారపోస్తాయి. ఎందుకు? ప్రాణం లేకపోతే వాటికి విడిగా ఉనికి లేదు. ప్రతి ఒక్క ఇంద్రియం కూడా ఈ ప్రాణతత్త్వంవల్లనే పని చేస్తుంది. అందువల్ల ప్రాణమే గొప్పది. కాని ఈ విషయం స్వయంగా ఈ ఇంద్రియాలకు అర్థం కాలేదు.

వీటి మధ్య భేదం అర్థమవటానికి శాస్త్రంలో ముఖ్యప్రాణం, గౌణప్రాణం అని వస్తుంది. ముఖ్యప్రాణం అంటే పంచప్రాణాలు; గౌణప్రాణం అంటే సూక్ష్మశరీరంలో ఉన్న తక్కిన 14 అంగాలు. అవి పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, చత్వారి అంతఃకరణ అని చూశాము.

ఈ మొదటి పదంలో ఉపనిషత్తు ప్రాణం అని వాడింది. అంటే ముఖ్య ప్రాణాలూ, గౌణప్రాణాలూ వాదించుకున్నాయిట. ఏమని?

**అహగ్ంశ్రేయసే వివదమానా** – నేను గొప్పవాడిని అంటే నేను గొప్పవాడిని అంటూ వివాదంలో పడ్డాయి. వాటికి నిష్పక్షపాతంగా తీర్పుని ఇవ్వగలిగినది ప్రజాపతి. అందువల్ల అవి ప్రజాపతి లేదా బ్రహ్మ దగ్గరకు వెళ్ళాయి.

**కో నో వసిష్ఠ ఇతి** – మాలో ఎవరు వసిష్ఠుడో చెప్పండి అన్నాయి. అంటే మా మధ్యలో నివసిస్తూ, మమ్మల్ని నిలబెట్టేది ఎవరు?

వాక్కుకు వసిష్ఠగుణత్వం ఉందని చూశాము కదా, అందువల్ల బహుశ వాక్కు తన పేరే చెబుతాడు బ్రహ్మ అని ఆశించివుంటుంది. కాని బ్రహ్మ అలా తీర్పు చెప్పకుండా వారినే వారి గొప్పతనం ప్రత్యక్షంగా తెలుసుకోవటానికి ఒక ప్రయోగం చేసి చూడమన్నాడు. ఏమిటది?

**యస్మిన్ వ ఉత్క్రాంత ఇదగ్ం శరీరం పాపీయో మన్యతే స వో వసిష్ఠ ఇతి** – మీలో ఎవరైతే పైకి నిష్క్రమించినప్పుడు ఈ దేహాన్ని చాలా అపవిత్రంగా లోకం భావిస్తుందో, అది మీలో వసిష్ఠం అన్నాడు బ్రహ్మ.

అప్పుడు శరీరంలోంచి ఒక్కొక్క అంగం బయటకు వెళ్ళిరావటం మొదలు పెట్టాయి. ఒక ఏడాది బయట ఉండి తిరిగి వచ్చేవి. అలా ఇంద్రియాలు ఎలా బయటకు వెళ్ళాయి అని అడగకూడదు. ఇది ఒక కథ. కథను కథగా తీసుకుని, అందులోని సారాన్ని గ్రహించాలి. ఇది ప్రాణశక్తిని స్తుతించటానికి చెప్పబడిన కథ. దానికోసం ఉపనిషత్తు ఒక ఊహాజనితమైన కథను చెబుతున్నది.

## మంత్రం 6.1.8

**వాగ్ఘోచ్చక్రామ సా సంవత్సరం ప్రోష్యాగత్యోవాచ కథమశకత మదృతే జీవితుమితి తే హోచుర్యథాఽకలా అవదన్తో వాచా ప్రాణన్తః ప్రాణేన పశ్యన్తశ్చక్షుషా శృణ్వన్తశ్శ్రోత్రేణ విద్వాగ్ంసో మనసా ప్రజాయమానా రేతసైవమజీవిష్మేతి ప్రవివేశ హ వాక్ ॥**

ఇప్పుడు, ఇంతవరకూ చూసిన ఇంద్రియాలు ఒక్కొక్కటీ వరుసగా బయటకు వెళతాయి. అంటే ప్రాణం ముందు వెళ్ళదు. వాగింద్రియంతో మొదలవుతుంది ఆ ప్రయోగం. అవి వరుసగా వాక్కు, చక్షువు, శ్రోత్రం, మనస్సు, ఉపస్థ. ఈ మంత్రంలో వాగింద్రియాన్ని చూస్తాము.

**వాగ్ఘోచ్చక్రామ సా సంవత్సరం ప్రోష్య** – వాక్కు బయటకు వెళ్ళి ఒక సంవత్సరం పాటు బయటవుంది.

**ఆగత్యోవాచ కథమశకత మదృతే జీవితుమితి** – వెనక్కి తిరిగి వచ్చాక, నేను లేకుండా మీరు (ఈ శరీరంలో) ఎలా జీవించగలిగారు అని అడిగింది.

**తే హోచుః** – తక్కిన ఇంద్రియాలు ఇలా పలికాయి –

**యథాఽకలా అవదంతో వాచా** – ఎలా మూగవారు వాగింద్రియంతో మాటలు లేనివాడై,

**ప్రాణంతః ప్రాణేన పశ్యంత శ్చక్షుషా శృణ్వంతశ్శ్రోత్రేణ విద్వాగ్ంసో మనసా ప్రజాయమానా రేతసైవమజీవిష్మేతి** – ప్రాణంతో ప్రాణక్రియను చేస్తారో, కంటితో చూస్తారో, చెవితో వింటారో, మనస్సుతో తెలుసుకుంటారో, రేతస్సుతో సంతానాన్ని కంటారో, అదే విధంగా మేము కూడా జీవించాము.

**ప్రవివేశ హ వాక్** – మళ్ళీ వాగింద్రియం దేహంలోకి ప్రవేశించింది.

అంటే తక్కిన అన్ని పనులూ మామూలుగా జరిగిపోయాయి. ఒక్క మాటలు మాట్లాడలేకపోయారు అంతే. నిజానికి వాక్కు సమస్యలను కూడా తెచ్చిపెడుతుంది.

**జిహ్వాగ్రే మరణం ధృవమ్**

వాక్కు మరణాన్ని కూడా కొనితేగలదు. ఇంకోవిధంగా చెప్పాలంటే వాక్కు లేకపోయినా వారి జీవితం సాఫీగా సాగిపోయింది. అంటే వాక్కుయొక్క వసిష్ఠత్వం వాక్కువల్ల కాదని తెలిసిపోయింది.

నిజానికి మన పరిస్థితి కూడా అంతే. అంతా మనవల్లే జరుగుతోంది, మనం లేకపోతే మనవారు ఉండలేరని విర్రవీగుతాము. కాని మనం మరణించాక, ఒక సంవత్సరం తర్వాత ఒకవేళ స్వర్గంనుంచి నేను తిరిగివస్తున్నాను

అని మనవారికి ఉత్తరం రాయగలిగితే, మనవారు ఖంగారు పడిపోయి, నువ్వు లేకుండా బాగానే ఉన్నాము, నువ్వు రానవసరం లేదని అన్నా ఆశ్చర్యపోకూడదు, లేదా బాధపడకూడదు. ఆ విధంగా వాక్కుకి గర్వభంగం అయి, నిశ్శబ్దంగా తన స్థానంలోకి ప్రవేశించింది. ఇంక ఇంచుమించు ఇలాగే సాగుతుంది ప్రతి మంత్రం కూడా.

### మంత్రం 6.1.9

**చక్షుర్హోచ్చక్రామ తత్సంవత్సరం ప్రోష్యాగత్యోవాచ కథమశకత మదృతే జీవితుమితి తే హోచుర్యథాఽన్ధా అపశ్యన్తశ్చక్షుషా ప్రాణన్తః ప్రాణేన వదన్తో వాచా శృణ్వన్తశ్శ్రోత్రేణ విద్వాగ్ంసో మనసా ప్రజాయమానా రేతసైవమజీవిష్మేతి ప్రవివేశ హ చక్షుః ॥**

**చక్షుర్హోచ్చక్రామ తత్సంవత్సరం ప్రోష్య** – ఈసారి చక్షురింద్రియం ఒక సంవత్సరం పాటు బయటకు వెళ్ళి వచ్చింది. ఎలా ఉంది జీవితం అని వారిని అడిగింది.

**యథాఽంధా అపశ్యంతశ్చక్షుషా** – ఎలాగైతే గుడ్డివారు చూడలేకుండా ఉన్నారో మేమూ అలాగే చూడలేక పోయాము. కాని తక్కిన ఐదు అంగాలద్వారా, తక్కిన పనులన్నీ సాఫీగా సాగిపోయాయి అన్నాయి అవి. అంటే కన్నుయొక్క ప్రతిష్ఠత్వం కన్నువల్ల కాదని తెలుసుకుంది. ఆ విధంగా కన్ను లేకపోయినా మనిషి జీవితం కుంటుబడలేదని తెలుసుకుని గర్వభంగం అయి, తన స్థానంలో తిరిగి ప్రవేశించింది.

### మంత్రం 6.1.10

**శ్రోత్రగ్ం హోచ్చక్రామ తత్సంవత్సరం ప్రోష్యాగత్యోవాచ కథమశకత మదృతే జీవితుమితి తే హోచుర్యథా బధిరా అశృణ్వన్తశ్శ్రోత్రేణ ప్రాణన్తః ప్రాణేన వదన్తో వాచా పశ్యన్తశ్చక్షుషా విద్వాగ్ంసో మనసా ప్రజాయమానా రేతసైవమజీవిష్మేతి ప్రవివేశ హ శ్రోత్రమ్ ॥**

**శ్రోత్రగ్ం హోచ్చక్రామ తత్సంవత్సరం ప్రోష్య** – ఈసారి చెవి ఇంద్రియం ఒక సంవత్సరం పాటు బయటకు వెళ్ళివచ్చింది. ఎలా ఉంది జీవితం అని వారిని అడిగింది.

**యథా బధిరా అశృణ్వంతశ్శ్రోత్రేణ** – ఎలాగైతే చెవిటివారు వినలేకుండా ఉన్నారో, మేమూ అలాగే వినలేక పోయాము అన్నాయి. అంటే చెవియొక్క సంపదత్వం చెవివల్ల కాదని చెవి తెలుసుకుంది. దానితో గర్వభంగం అయిన చెవి, తన స్థానంలో తిరిగి ప్రవేశించింది.

### మంత్రం 6.1.11

**మనో హోచ్చక్రామ తత్సంవత్సరం ప్రోష్యాగత్యోవాచ కథమశకత మదృతే జీవితుమితి తే హోచుర్యథా ముగ్ధా అవిద్వాగ్ంసో మనసా ప్రాణన్తః ప్రాణేన వదన్తో వాచా పశ్యన్తశ్చక్షుషా శృణ్వన్తశ్శ్రోత్రేణ ప్రజాయమానా రేతసైవమజీవిష్మేతి ప్రవివేశ హ మనః ॥**

**మనో హోచ్చక్రామ తత్సంవత్సరం ప్రోష్య** – మనస్సు కూడా ఒక సంవత్సరంపాటు బయటకు వెళ్ళివచ్చింది. ఎలా ఉంది జీవితం అని వారిని అడిగింది.

**యథా ముగ్ధా అవిద్వాగ్ం సో మనసా** – ఎలాగైతే మూఢులు తెలివిలేనివారిగా ఉన్నారో, మేమూ అలాగే తెలివిలేకుండా ఉన్నాము అన్నాయి. అంటే మనస్సుయొక్క తెలివితేటలు లేకపోయినా, జీవితం సాఫీగా సాగిపోయింది అంటే మనస్సుయొక్క ఆయతనత్వం మనస్సుకు చెందినది కాదని మనస్సు తెలుసుకుంది. దానితో గర్వభంగం అయిన మనస్సు, తన స్థానంలో తిరిగి ప్రవేశించింది.

మన సుషుప్తి దీనికి నిదర్శనం. గాఢనిద్రలో కర్మేంద్రియాలు పనిచెయ్యవు, జ్ఞానేంద్రియాలు పనిచెయ్యవు. మనస్సు పనిచెయ్యదు కాని శరీరం జీవించివుంది అంటే దానికి కారణం ప్రాణం. మనను ఒక ఆటాడించే మనస్సు కూడా ప్రాణం చేతిలో కీలుబొమ్మే.

## మంత్రం 6.1.12

**రేతో హోచ్చక్రామ తత్సంవత్సరం ప్రోష్యాగత్యోవాచ కథమశకత మదృతే జీవితుమితి తే హోచుర్యథా క్లీబా అప్రజాయమానా రేతసా ప్రాణన్తః ప్రాణేన వదన్తో వాచా పశ్యన్తశ్చక్షుషా శృణ్వన్తశ్శ్రోత్రేణ విద్వాగ్ంసో మనసైవమజీవిష్మేతి ప్రవివేశ హ రేతః ॥**

**రేతో హోచ్చక్రామ తత్సంవత్సరం ప్రోష్య** – ఈసారి జననేంద్రియం ఒక సంవత్సరంపాటు బయటకు వెళ్ళి వచ్చింది. ఎలా ఉంది జీవితం అని వారిని అడిగింది.

**యథా క్లీబా అప్రజాయమానా రేతసా** – ఎలాగైతే పిల్లలు లేనివారు పిల్లలు లేకుండా జీవించారో, మేమూ అలాగే జీవించాము అన్నాయి. అంటే జననేంద్రియంయొక్క ఉత్పత్తి క్రియ జననేంద్రియంవల్ల కాదని జననేంద్రియం తెలుసుకుంది. దానితో గర్వభంగం అయిన జననేంద్రియం, తన స్థానంలో తిరిగి ప్రవేశించింది. నిజానికి పిల్లలు లేనివారు తక్కినవారికన్నా ఆనందంగా ఉండేవారు కూడా ఉన్నారు. వారు పిల్లలు లేకుండా, అన్ని పనులూ చేసుకుని, చివరకి మోక్షానికి కూడా ప్రయత్నించి మోక్షం కూడా పొందగలరు.

ఈ విధంగా తక్కిన అన్ని ఇంద్రియాలకూ గర్వభంగం అయింది.

## మంత్రం 6.1.13

**అథ హ ప్రాణ ఉత్క్రమిష్యన్ ॥ యథా మహాసుహయస్సైన్ధవః పడ్వీశశఙ్కూన్ సంవృహేదేవగ్ం హైవేమాన్ ప్రాణాన్ సంవవర్హ తే హోచుర్మా భగవ ఉత్క్రమీర్న వై శక్ష్యామస్త్వదృతే జీవితుమితి తస్యో మే బలిం కురుతేతి తథేతి ॥**

ఇప్పుడు ప్రాణంవంతు వచ్చింది. తక్కిన అంగాల విషయంలో అవి ఒక సంవత్సరం పాటు బయటకి వెళ్ళాయి అని చెప్పుకుంటూ వచ్చింది ఉపనిషత్తు. కాని ప్రాణం విషయం వచ్చేసరికి, ప్రాణం బయటకి వెళ్ళిందని చెప్పలేదు. నిజంగా బయటకి వెళితే, ఆ జీవి జీవితం ముగిసిపోతుంది.

**అథ హ ప్రాణ ఉత్క్రమిష్యన్** – తర్వాత ప్రాణం పైకి నిష్క్రమించబోయింది. ఇంతవరకూ ఉచ్చక్రామ అంది; ఇప్పుడు ఉత్క్రమిష్యన్ అంది.

**యథా మహాసుహయస్సైంధవః పడ్వీశశంకూన్ సంవృహేత్** – సింధుదేశానికి చెందిన పెద్ద మంచి గుర్రం కాళ్ళకు కట్టిన మోటులను ఏ విధంగా పెకిలించి వేస్తుందో,

**ఏవగ్ం హైవేమాన్ ప్రాణాన్ సంవవర్హ** – అదే విధంగా, ఈ ఇంద్రియాలను పెకిలించి వేసింది.

ప్రాణం పైకి లేవగానే, ఇంద్రియాలు కూడా శరీరంనుంచి బయటకు లాగబడినట్టు అయింది. సింధుదేశానికి చెందిన గుర్రం చాలా శక్తివంతమైనది. దాన్ని కట్టటం చాలా కష్టం. కట్టినా, అది పరిగెత్తాలంటే దాని బలానికి దాని కాళ్ళకు కట్టిన మోటులను కూడా పెకళించి వేస్తుంది. ప్రాణానికి కూడా అంత శక్తి ఉంది. అది లేచేసరికి శరీరంనుంచి ఇంద్రియాలు కూడా లేవాల్సి వచ్చింది.

**తే హోచుర్మా భగవ ఉత్క్రమీః** – అప్పుడా ఇంద్రియాలన్నీ వేడుకున్నాయి. ఓ భగవాన్ నువ్వు వెళ్ళవద్దు.

**న వై శక్ష్యామస్త్వదృతే జీవితుమితి** – నువ్వు లేకుండా జీవించే శక్తి మాకు లేదని అవి చెప్పాయి. కళ్ళు పిల్లలను, మనవలను ఇంకా కొన్నాళ్ళు చూడాలనుకున్నాయి. నాలుక మరికొన్ని రుచులను రుచి చూడాలనుకుంది. అందువల్ల మేము మామా విషయవస్తువులను ఇంకా కొన్నాళ్ళు అనుభవించాలి, దయచేసి నువ్వు శరీరాన్ని వదిలి వెళ్ళవద్దని వేడుకున్నాయి.

**తస్యో మే బలిం కురుతేతి తథేతి** – అయితే నాకు సుంకాన్ని కట్టండి అని ప్రాణం అడిగితే, సరే అన్నాయి ఇంద్రియాలు.

### మంత్రం 6.1.14

**సా హ వాగువాచ యద్వా అహం వసిష్ఠాఽస్మి త్వం తద్వసిష్ఠోఽసీతి యద్వా అహం ప్రతిష్ఠాఽస్మి త్వం తత్ప్రతిష్ఠోఽసీతి చక్షుర్యద్వా అహం సమ్పదస్మి త్వం తత్సమ్పదసీతి శ్రోత్రం యద్వా అహమాయతనమస్మి త్వం తదాయతనమసీతి మనో యద్వా అహం ప్రజాతిరస్మి త్వం తత్ప్రజాతిరసీతి రేతః ॥ తస్యో మే కిమన్నం కిం వాస ఇతి॥ యదిదం కిఞ్చా శ్వభ్య ఆ కృమిభ్య ఆ కీటపతఙ్గేభ్యస్తత్తేఽన్నమాపో వాస ఇతి న హ వా అస్యానన్నం జగ్ధం భవతి నానన్నం ప్రతిగృహీతం య ఏవమేతదనస్యాన్నం వేద తద్విద్వాగ్ంసశ్శ్రోత్రియా అశిష్యన్త ఆచామన్త్యశిత్వాఽఽచామన్తి। ఏతమేవ తదనమనగ్నం కుర్వన్తో మన్యన్తే ॥**

ఇప్పుడు ఒక్కొక్క ఇంద్రియం, ఇంతకుముందు చూసిన వరుసక్రమంలోనే ప్రాణాన్ని పొగడడం మొదలు పెట్టాయి అంటే వాక్కు, చక్షువు, శ్రోత్రం, మనస్సు, ఉపస్థ.

**సా హ వాగువాచ యద్వా అహం వసిష్ఠాఽస్మి త్వం తద్వసిష్ఠోఽసీతి** – వాక్కు నాకు వసిష్ఠగుణం ఉంటే, ఆ గుణం నాది కాదు, ఆ వసిష్ఠ అనే గుణం నీదే అని పలికింది.

అలా కన్ను నాకున్న ప్రతిష్ఠ అనే గుణం నీదే అంది.
చెవి నాకున్న సంపద అనే గుణం నీదే అంది.
మనస్సు నాకున్న ఆయతనం అనే గుణం నీదే అంది.
ఉపస్థ నాకున్న ప్రజాతి అనే గుణం నీదే అంది.

ప్రాణం నాకు సుంకం కట్టండి అంది కదా, ఇవన్నీ వాటికున్న గుణాలను ప్రాణానికి ధారపోసాయి. ఈ విధంగా ప్రాణానికి ఏడు గుణాలు వచ్చాయి. ఈ విధంగా ప్రాణస్తుతి వచ్చింది. మనం కూడా నాకున్న గుణాలన్నీ నువ్వు ఇచ్చినవే అని భగవంతునికి చెప్పగలగాలి.

సౌందర్యలహరివంటి గొప్ప స్తోత్రం రాయగలిగితే, అది భగవంతుని కృపే. భగవంతుడు ఆ అద్భుత పదజాలాన్ని ఇవ్వకపోతే, రాయలేము. అలాగే అదే పదజాలంతో భగవంతుణ్ణి కీర్తించాలి. సముద్రంనుంచి మేఘం నీరు తీసుకుని వర్షం కురిపించినా ఆ గొప్పతనం మేఘానిది కాదు, భగవంతుని కృప. మనం భగవంతుణ్ణి స్తుతించగలగటం కూడా ఆయన కృపవల్లనే.

**తస్యో మే కిమన్నం కిం వాస ఇతి** – అటువంటి నాకు ఆహారమేమిటి, వస్త్రమేమిటి అని ప్రాణం అడిగింది.

**యదిదం కించా శ్వభ్య ఆ కృమిభ్య ఆ కీటపతంగేభ్యస్తత్తేఽ న్నమ్** – కుక్కలు, క్రిములు, కీటకాలు, పక్షులు తినే ఆహారములతో సహా – అన్ని ప్రాణులచేత తినబడే ప్రతి ఆహారం నీకు అన్నము. అంటే ఒక్క ముక్కలో చెప్పాలంటే ప్రాణాన్ని సర్వ అన్నభోక్తా అనవచ్చు. ఆహారాలన్నీ సమష్టి ప్రాణదేవతకు అన్నమేననే భావనను శ్రుతి ఇక్కడ సూచిస్తున్నది. ఒకే ప్రాణదేవత కుక్కలరూపంలో, కీటకాలరూపంలో ఆయా ఆహారాలను భుజిస్తున్నది.

**ఆపో వాస ఇతి** – జలములే నీకు వస్త్రం అన్నాయి ఇంద్రియాలు. అన్నం తినేముందు, తిన్నాక ఆచమనం చేసిన నీరే ప్రాణానికి వస్త్రం.

నీరు వస్త్రం అనే మాటను అక్షరాలా తీసుకోకూడదు. నీటిని వస్త్రంగా భావించి ఉపాసన చెయ్యాలి. ఆ విధంగా ఆచమనం కాయిక క్రియ అయితే, నీటిని వస్త్రంగా భావించటం మానసికక్రియ. ఈ నీరు ప్రాణానికి వస్త్రం అవుగాక అనుకుని చెయ్యాలి.

ఇది **జలస్య ప్రాణ వస్త్రరూపేణ ఉపాసన.** దీని ఫలం ఏమిటి?

**న హ వా అస్యానన్నం జగ్ధం భవతి** – ఈ ప్రాణ ఉపాసన చేసిన వ్యక్తికి ఏ రోజూ కూడా తినకూడని దానిని తినాల్సిన పరిస్థితి రాదు. ఒకవేళ తినాల్సివచ్చినా కూడా తినదగినది తిన్నట్టే అవుతుంది కాని, దాన్ని తిన్న దోషం అతనికి అంటదు.

**తథా నానన్నం ప్రతిగృహీతమ్** – అదే విధంగా అతను స్వీకరించకూడని దానిని స్వీకరించినా కూడా అది స్వీకరించదగ్గ వస్తువే అవుతుంది.

ఆ విధంగా ప్రాణ ఉపాసకునికి నిషిద్ధం అయిన ఆహారం అంటూ ఉండదు. ప్రాణ ఉపాసకుడు కాని వ్యక్తికి శాస్త్రం కొన్ని రకాల ఆహారాన్ని, తామసిక ఆహారంగా భావించి నిషేధిస్తుంది. కాని అతను ప్రాణ ఉపాసకుడైతే అతనికి అది నిషేధవస్తువు అవదు. ఈ నియమాన్ని సడలించింది ఒక్క ప్రాణ ఉపాసకునికి మాత్రమే. దీన్ని అందరికీ వర్తింపజేయకూడదు. ఇలాంటి ప్రత్యేక సన్నివేశాలను మామూలు సన్నివేశాలకు కూడా తీసుకుంటారు మనుష్యులు. అందువల్ల శంకరులవారు ఇక్కడ ఈ విషయాన్ని మరింత విశ్లేషిస్తున్నారు.

సర్వమూ ప్రాణానికి ఆహారమే అనీ, ప్రాణ ఉపాసకుడు ఏం తిన్నా దోషం అంటదనీ ఇక్కడ చెబుతున్నది. కాని దేన్ని పడితే దాన్ని తినకూడదని మరొక శ్రుతివాక్యం చెబుతున్నది. అంటే శ్రుతి ఇక్కడ సర్వభక్షణాన్ని విధించటం లేదు. న హ వా అస్యానన్నం జగ్ధం భవతి అనే వాక్యంలో ఈ ఉపాసకుడు తినకూడని దానిని తినటం అనేది ఉండదు అని అర్థం. దీన్ని సర్వమూ ప్రాణానికి అన్నమే అని ఈ ఉపాసనను స్తుతించటంకోసం చెప్పబడింది. కాబట్టి, దీనికి మరియొక శ్రుతివాక్యాన్ని ఖండించే సామర్థ్యం ఉండదు. ప్రాణానికి సర్వమూ అన్నమే అనే ఉపాసనను సూచిస్తోంది కాని దేన్నిపడితే దాన్ని తినమనటం లేదు. ఇటువంటి వాక్యాన్ని అర్థవాదము అంటారు. అంటే స్తుతివాక్యము. అర్థవాదము మరొక విధివాక్యాన్ని ఖండించలేదు.

అంతేకాదు, మనుష్యశరీరం ఉన్నవ్యక్తి, క్రిమికీటకాలు, రాక్షసులు తినే ఆహారం భక్షించటం కూడా సంభవం కాదు. అందువల్ల అతను సర్వాన్ని భక్షించాలనే అపూర్వవిధి కూడా లేదు. పైగా సర్వమూ అన్నంగా కలది అని ఉపాసించవలసినది ప్రాణాన్ని మాత్రమే కాని, శరీరాన్ని కాదు. మానవశరీరానికి తగ్గ ఆహారాన్ని తీసుకోవాలి.

దీనికి శంకరులవారు మంచి వాదన కూడా చూపిస్తున్నారు. విషంనుంచి పుట్టిన క్రిమికి విషమే ఆహారం. ఆ విషం కూడా ఆహారమే అయినా కూడా, ఇంకో ప్రాణికి మరణం. అంటే ఒకరికి ఆహారం ఇంకొకరికి విషం. అందువల్ల బ్రాహ్మణక్షత్రియాది శరీరాలతో నిషేధించబడిన మాంసాదులను భక్షిస్తే, ఆ వ్యక్తికి దోషం కలిగితీరుతుంది. అది ప్రాణ ఉపాసకునికి కూడా వర్తిస్తుంది. అందువల్ల దీన్ని అర్థవాదము కింద తీసుకోవాలి.

**య ఏవమేతదనస్యాన్నం వేద** – ఈ విధంగా ప్రాణ ఉపాసన చేసిన వ్యక్తికి ఫలం ప్రాణదేవతయొక్క స్వరూపాన్ని పొందటమే.

**తద్విద్వాగ్ం సశ్శ్రోత్రియా అశిష్యంత ఆచామంత్యశిత్వాఽఽ చామంతి** – ప్రాణదేవతకు నీరు వస్త్రం కనుక, వేదాధ్యయనం చేసిన బ్రహ్మవేత్తలు భోజనంచేసే ముందు, భోజనంచేసిన తర్వాత నీటిని ఆచమనం చేస్తారు.

**ఏతమేవ తదనమనగ్నం కుర్వంతో మన్యంతే** – అలా చెయ్యటంవల్ల ఆ ప్రాణాన్ని నగ్నం కాకుండా చేస్తున్నామని వారు భావిస్తారు.

ఇది **సప్తగుణవిశిష్ట ప్రాణరూపేణ హిరణ్యగర్భ ఉపాసన.** ప్రాణానికీ, ఇంద్రియాలకూ మధ్య సంభాషణ జరిగింది కాబట్టి ఈ బ్రాహ్మణాన్ని ప్రాణసంవాద బ్రాహ్మణము అంటారు.

## 6.2 - కర్మవిభాగ బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణములో ఇంకొక ఉపాసనను చూస్తాము. దీన్ని పంచాగ్నివిద్య అంటారు. ఈ పంచాగ్నివిద్య కూడా ఛాందోగ్యోపనిషత్తులో ఐదవ అధ్యాయంలో, మూడవ ఖండంలో వస్తుంది. దీనికి ఉపోద్ఘాతంగా ముందు ఒక కథ, గురుశిష్యుల మధ్య సంభాషణ రూపంలో వస్తుంది.

ఇక్కడ శిష్యుడు శ్వేతకేతు, గురువు జైవలి. అతని పూర్తిపేరు ప్రవాహణ జైవలి. ఇక్కడ పరిస్థితి ప్రత్యేకంగా ఉంటుంది. మామూలుగా బ్రాహ్మణులు ఆరు పనులు చెయ్యాలి. వేదాన్ని చదవాలి, బోధించాలి; యజ్ఞాలు చెయ్యాలి, చేయించాలి; దానం చెయ్యాలి, స్వీకరించాలి. కాని క్షత్రియుడైన రాజు మూడే చెయ్యాలి. అతను వేదం నేర్చుకోవచ్చు కాని బోధ చెయ్యకూడదు; యజ్ఞం చెయ్యాలి కాని చేయించకూడదు; దానం చెయ్యాలి కాని స్వీకరించకూడదు. అలాగే బ్రాహ్మణుడు విలువిద్య నేర్పించవచ్చు కాని, అతను యుద్ధం చెయ్యకూడదు. ఇవి వర్ణాశ్రమ ధర్మాలు. ఈ బ్రాహ్మణమును కర్మ విపాక బ్రాహ్మణము అని కూడా అంటారు.

కాని ఇక్కడ నియమానికి భిన్నంగా క్షత్రియుడు గురువు, బ్రాహ్మణుడు శిష్యుడు అవుతారు. శ్వేతకేతు పాంచాల దేశపు రాజు దగ్గరికి వెళ్ళాడు. ప్రవాహణ జైవలి దగ్గరికి వచ్చినప్పుడు, ఆయనకు అనేక పరిచారకులు పరిచర్యలు చేస్తున్నారు. ఆ రాజు శ్వేతకేతుని చూసి ఇలా అన్నాడు.

### మంత్రం 6.2.1

**శ్వేతకేతుర్హ వా ఆరుణేయః పఞ్చాలానాం పరిషదమాజగామ స ఆజగామ జైవలిం ప్రవాహణం పరిచారయమాణం తముదీక్ష్యాభ్యువాద కుమారా ౩ ఇతి స భో ౩ ఇతి ప్రతిశుశ్రావానుశిష్టోఽన్వసి పిత్రేత్యోమితి హోవాచ ॥**

**కుమారా ౩ ఇతి** – ఓ కుమారా అని శ్వేతకేతుని రాజు సంబోధించాడు. (3– ఇది ప్లుతము. ఇలా ఉంటే మూడు చిటికెల నిడివితో పలకాలి.) అరుణిని పుత్రుడు ఆరుణి, ఆరుణి పుత్రుడు ఆరుణేయుడు. శ్వేతకేతుకి ఇంకొక పేరు ఆరుణేయ. అతని తండ్రిని ఆరుణి, గౌతముడు అంటారు. శ్వేతకేతు, గౌతములను ఛాందోగ్యోపనిషత్తులో కూడా చూస్తాము. అక్కడ శ్వేతకేతు విద్య ముగించుకుని వచ్చాక, విద్యాగర్వంతో ఉండటం గమనించాడు తండ్రి. అతని గర్వాన్ని అణచటానికి ఏ ఒక్క విద్య నేర్చుకుంటే సర్వం నేర్చుకున్నట్టు అవుతుందో, ఆ విద్య నేర్చుకున్నావా అని తండ్రి అతన్ని అడిగాడు. ముందు అలాంటి విద్య ఎలా ఉంటుంది, ఒకవేళ ఉంటే మా గురువు నాకు చెప్పి ఉండేవాడు అన్నాడు. తండ్రి ఉందని చూపిస్తే, అప్పుడు గర్వం తగ్గించుకుని, నాకు నువ్వే నేర్పించు అన్నాడు అణకువగా. ఆ సందర్భంలో వచ్చిన బోధే తత్త్వమసి మహావాక్యం. ఇది ఆరవ అధ్యాయంలో వస్తుంది.

ఇక్కడికి కూడా శ్వేతకేతు గర్వంగానే వచ్చాడు.

**ప్రతిశుశ్రావానుశిష్టోఽన్వసి పిత్రేత్యోమితి హోవాచ** – నీ తండ్రి నీకు శిక్షణనిచ్చారా అని అడిగితే అవును అన్నాడు. అప్పుడు జైవలి అతన్ని ఐదు ప్రశ్నలు అడిగాడు.

మంత్రం 6.2.2

**వేత్థ యథేమాః ప్రజాః ప్రయత్యో విప్రతిపద్యన్తా ౩ ఇతి నేతి హెూవాచ ॥ వేత్థో యథేమం లోకం పునరాపద్యన్తా ౩ ఇతి నేతి హైవోవాచ వేత్థో యథాఽసౌ లోక ఏవ బహుభిః పునః పునః ప్రయద్భిర్న సమ్పూర్యతా ౩ ఇతి నేతి హైవోవాచ వేత్థో యతిథ్యామాహుత్యాగ్ం హుతాయామాపః పురుషవాచో భూత్వా సముత్థాయ వదన్తీ౩ ఇతి నేతి హైవోవాచ ॥ వేత్థో దేవయానస్య వా పథః ప్రతిపదం పితృయాణస్య వా ॥ యత్కృత్వా దేవయానం వా పన్థానం ప్రతిపద్యన్తే పితృయాణం వాఽపి హి న ఋషేర్వచశ్రుతమ్ ॥ ద్వే సృతీ అశృణవం పితౄణామహం దేవానాముత మర్త్యానాం తాభ్యామిదం విశ్వమేజత్సమేతి యదన్తరా పితరం మాతరం చేతి ॥ నాహమత ఏకఞ్చన వేదేతి హెూవాచ ॥**

ఈ బ్రాహ్మణంలో పంచాగ్నివిద్యను చూస్తాము. ఛాందోగ్యోపనిషత్తులోని ఐదవ అధ్యాయం, మూడవ ఖండంలో కూడా ఈ పంచాగ్నివిద్య వస్తుంది. ఇంచుమించుగా సారాంశం ఒకటే. ఐదు ప్రశ్నలు చూస్తాము. అదే వరుస క్రమంలో చూస్తాము, కాకపోతే ప్రశ్నలకు వాడిన పదాలు వేరు.

ప్రశ్న 1: **వేత్థ యథేమాః ప్రజాః ప్రయత్యో విప్రతిపద్యంతా ౩ ఇతి** – మరణించిన జీవులు ఏఏ మార్గాలలో వెళతారో తెలుసా?

**నేతి హెూవాచ** – నాకు తెలియదు అన్నాడు శ్వేతకేతు.

ప్రశ్న 2: **వేత్థో యథేమం లోకం పునరాపద్యంతా ౩ ఇతి** – జీవులు ఈ లోకానికి మళ్ళీ ఏ మార్గంలో తిరిగి వస్తారో తెలుసా?

**నేతి హైవోవాచ** – నాకు తెలియదు అన్నాడు.

ప్రశ్న 3: **వేత్థో యథాఽసౌ లోక ఏవ బహుభిః పునః పునః ప్రయద్భిర్న సంపూర్యతా ౩ ఇతి** – స్వర్గలోకాలు మరణించే ఈ ప్రాణులతో నిండిపోయి రద్దీ పెరగకుండా ఉండటానికి కారణమేమిటి?

**నేతి హైవోవాచ** – నాకు తెలియదు అన్నాడు.

ప్రశ్న 4: **వేత్థో యతిథ్యామాహుత్యాగ్ం హుతాయామాపః పురుషవాచో భూత్వా సముత్థాయ వదంతీ ౩ ఇతి** – జలశరీరం పురుషశరీరంగా ఎప్పుడు మారుతుందో తెలుసా?

**నేతి హైవోవాచ** – నాకు తెలియదు అన్నాడు.

ఈ ప్రశ్న అన్నిప్రశ్నల్లోకీ చాలా ముఖ్యమైన ప్రశ్న. ఇది పంచాగ్నివిద్యను బోధించటానికి దారితీస్తుంది. నిజానికి ఈ ప్రశ్న అర్థం కావాలంటే జవాబు చూడాలి. ఇంకో విధంగా చెప్పాలంటే, ఏ దశలను దాటుకుని జీవుడు మనుష్యలోకానికి వస్తాడు?

**వేత్థో దేవయానస్య వా పథః ప్రతిపదం పితృయాణస్య వా** – దేవయానమార్గానికి కాని, పితృయాణమార్గానికి కాని ప్రతిపదం నీకు తెలుసా? ప్రతిపదం అంటే ఏమిటో ఉపనిషత్తే చెబుతున్నది.

**యత్కృత్వా దేవయానం వా పంథానం ప్రతిపద్యంతే పితృయాణం వాఽ పి హి న ఋషేర్వచశ్రుతమ్** – అంటే ఏ కర్మను చేసి దేవయానమార్గాన్ని కాని, పితృయాణమార్గాన్ని కాని పొందుతారు? ఈ విషయం చెప్పే మంత్రవాక్యాన్ని నేను విన్నాను.

దేవయానమార్గం, పితృయాణమార్గాలను శుక్లగతి, కృష్ణగతి అంటారు మామూలుగా. దీనికి జవాబు మనం వేరే ఉపనిషత్తులలో, భగవద్గీతలో కూడా చూశాము.

కేవలకర్మ చేసిన వ్యక్తి కృష్ణగతిద్వారా పితృలోకం (స్వర్గలోకం) వెళతాడు.

కర్మ, ఉపాసనల సముచ్చయం చేసిన వ్యక్తి శుక్లగతిద్వారా బ్రహ్మలోకానికి వెళతాడు. చాలామంది మనుష్యులు మరణించాక ఈ రెండింటిలో ఏదో ఒక మార్గంద్వారా వెళతారు. ఈ రెండూ కాక, మూడవమార్గం ఉంది. కర్మ కూడా చెయ్యనివారు ఆ మార్గంలో వెళతారు.

ఇక్కడ జైవలి రాజే కొంచెం ఈ మార్గాలను ఋగ్మంత్రంద్వారా వివరిస్తున్నాడు.

**ద్వే సృతీ అశృణవం పితౄణామహం దేవానాముత మర్త్యానాం తాభ్యామిదం విశ్వమేజత్సమేతి యదంతరా పితరం మాతరం చేతి** – దేవయానం, పితృయాణం అనే రెండు మార్గాల గురించి విన్నాను. ఈ రెండూ మనుష్యులకు చెందినవి. ఈ రెండూ భూలోకానికి, స్వర్గలోకానికి మధ్య ఉన్నాయి. అవి నీకు తెలుసా అన్నాడు.

ఇక్కడ మాతా అంటే తల్లి కాదు, పితా అంటే తండ్రి కాదు. మాతా అంటే భూలోకం, పితా అంటే ఊర్ధ్వలోకాలు. ఆ రెండింటినీ కలిపే మార్గాల గురించి అడుగుతున్నాడు.

ఈ ప్రశ్నను టూకీగా చూస్తే శుక్లగతి, కృష్ణగతిల్లో వెళ్ళటానికి కావాల్సిన సాధనలు ఏమిటి?

**నాహమత ఏకంచన వేదేతి హోవాచ** – వీటిలో ఏ ఒక్కటి కూడా నాకు తెలియదు అని శ్వేతకేతు చెప్పాడు.

## మంత్రం 6.2.3

**అథైనం వసత్యోపమన్త్రయాఞ్చక్రేఽ నాదృత్య వసతిం కుమారః ప్రదుద్రావ స ఆజగామ పితరం తగ్ం హోవాచేతి వావ కిల నో భవాన్ పురానుశిష్టానవోచ ఇతి ॥ కథగ్ం సుమేధ ఇతి ॥ పఞ్చ మా ప్రశ్నాన్ రాజన్యబన్ధురప్రాక్షీత్తతో నైకఞ్చన వేదేతి కతమే త ఇతీమ ఇతి హ ప్రతీకాన్యుదాజహార॥**

శ్వేతకేతు నాకు తెలియదని చెప్పినా, జైవలి అతన్ని సవినయంగా తన దగ్గర ఉండమని కోరాడు. శ్వేతకేతు నిజానికి యువకుడే అయినా, అతన్ని రాజు గౌరవించాడు. కాని అసలే అన్నీ తెలుసుననే గర్వంతో వచ్చాడేమో, ఈ ప్రశ్నలకు తనకు జవాబు తెలియకపోవటాన్ని అవమానంగా భావించాడు.

జైవలికి అతన్ని అవమానం చేసే ఉద్దేశం లేకపోయినా, అతను ఆ అవమానాన్ని భరించలేకపోయాడు. అవమానం కోపంగా మారింది. రాజు దగ్గర బస చెయ్యకుండా కోపంగా ఇంటికి వెళ్ళి తండ్రిని నిలదీశాడు. 'నాకు విద్యనంతా బోధించానని చెప్పావు కదా, నాకెందుకు పూర్తిగా నేర్పలేదు?'

తండ్రికి అర్థమయింది పుత్రుని అహం ఎక్కడో దెబ్బతిందని. ఏమయిందని అడిగాడు. శ్వేతకేతుకి రాజుమీద కూడా బాగా కోపంగా ఉంది.

**పంచ మా ప్రశ్నాన్ రాజన్యబంధురప్రాక్షీత్** – నన్ను రాజు ఐదు ప్రశ్నలు అడిగాడు అన్నాడు. రాజు మాట చెబుతూ, రాజన్యబంధువు అనే పదం వేశాడు. రాజులు బంధువులుగా కలవాడు రాజన్యబంధువు. అంటే అతను పేరుకే రాజు కాని, నిజంగా కాదు. ఇది తిరస్కారపదం. అయోగ్యుడైన రాజు అని చెప్పినట్టుగా తీసుకోవచ్చు.

ఏం ప్రశ్నలు అడిగాడు అన్నాడు తండ్రి గౌతముడు. ఉపనిషత్తు ఆ ప్రశ్నలను తిరిగి చెప్పదు కాని, మన వీలుకోసం మళ్ళీ వాటిని టూకీగా చూద్దాము.

1. మరణం తర్వాత జీవుడు వెళ్ళే మార్గం తెలుసా?
2. జీవుడు మళ్ళీ ఎలా తిరిగివస్తాడు?
3. ఇంతమంది మరణిస్తున్నా కూడా స్వర్గలోకం ఎందుకు నిండటం లేదు?
4. ఏ దశలను దాటుకుని జీవుడు మనుష్యలోకానికి తిరిగివస్తాడు?
5. శుక్లగతి, కృష్ణగతుల్లో వెళ్ళటానికి సాధనలు ఏమిటి?

## మంత్రం 6.2.4

**స హోవాచ తథా నస్త్వం తాత జానీథా యథా యదహం కిఞ్చ వేద సర్వమహం తత్తుభ్యమవోచమ్॥ ప్రేహి తు తత్ర ప్రతీత్య బ్రహ్మచర్యం వత్స్యావ ఇతి ॥ భవానేవ గచ్ఛత్వితి స ఆజగామ గౌతమో యత్ర ప్రవాహణస్య జైవలేరాస తస్మా ఆసనమాహృత్యోదకమాహారయాఞ్చకారాథ హాస్మా అర్ఘ్యం చకార తగ్ంహోవాచ వరం భగవతే గౌతమాయ దద్మ ఇతి ॥**

**సహోవాచ తథా నస్త్వం తాత జానీథా యథా యదహం కించ వేద సర్వమహం తత్తుభ్యమవోచమ్** – నాకు ఏం తెలిస్తే అదంతా నీకు చెప్పాను. నీకన్నా ప్రియమైనవారు నాకు ఎవరు ఉంటారు, నీకు చెప్పకుండా ఎందుకు దాచిపెడతాను అని అతని ఉద్దేశం.

తండ్రి వెంటనే వినయంగా 'పద, మనమిద్దరం వెళ్ళి రాజు దగ్గర నేర్చుకుందాము' అన్నాడు. విద్య తెలియక పోవటం పాపమేమీ కాదు. అది గ్రహించిన గౌతముడు రాజు దగ్గర నేర్చుకోవటానికి ఏమీ చిన్నతనంగా భావించలేదు. కాని శ్వేతకేతు కోపం ఇంకా తగ్గలేదు.

**భవానేవ గచ్ఛత్వితి** – మీరే వెళ్ళండి అన్నాడు.

అతని మనస్థితి అర్థం చేసుకున్న గౌతముడు అతన్ని వదిలి తను ఒక్కడే రాజు దగ్గరికి వెళ్ళాడు. తను నేర్చుకుని, తనే మళ్ళీ పుత్రునికి చెబుదాంలే అనుకున్నాడు.

అందువల్ల గౌతముడు జైవలి రాజు దర్బారుకు వెళ్ళాడు. రాజు అతనిని రాజమర్యాద చేయించాడు.

**తగ్ం హోవాచ వరం భగవతే గౌతమాయ దద్మ ఇతి** – ఓ భగవాన్, మీకే వరం కావాలో కోరుకోండి అన్నాడు రాజు.

ఆ రోజుల్లో బ్రాహ్మణులు స్వంతంగా సంపాదించేవారు కాదు. ధనాన్ని దాచుకోవటం అనే పద్ధతీ లేదు. లక్ష్మీ సరస్వతులు ఒకచోట ఉండవు అని నానుడి. వేదపండితుల విషయంలో అది ఆ రోజుల్లో సరిపోయేది. జ్ఞానం మెండుగా ఉండేది; జీవనం సాదాసీదాగా ఉండేది. అందువల్ల వారికి ఏ అదనపు ఖర్చు వచ్చినా రాజుల దగ్గరకు దక్షిణకోసం వెళ్ళేవారు. అప్పుడు రాజులే వారి పాలిట కల్పతరువులు. రాజులు కూడా అలాగే ఇచ్చేవారు. అందువల్ల ఏం కావాలో కోరుకొమ్మని ధారాళంగా వరమిచ్చేశాడు.

## మంత్రం 6.2.5

**స హోవాచ ప్రతిజ్ఞాతో మ ఏష వరో యాం తు కుమారస్యాన్తే వాచమభాషథాస్తాం మే బ్రూహీతి॥**

ఎప్పుడూ ఇలా రాజులు వరం కోరుకోమని చెప్పి, చిక్కుల్లో పడతారు. కఠోపనిషత్తులో కూడా యమధర్మరాజు నచికేతునికి మూడు వరాలు కోరుకోమని చెప్పి చిక్కుల్లో పడ్డాడు. నచికేతుడు ఆత్మవిద్య కోరుతాడని అతను ఆశించలేదు. పూర్వం మాట యిస్తే వెనక్కిపోయే ప్రసక్తి లేదు. అందువల్ల మీకేం కావాలో కోరుకోండి అనగానే గౌతముడు సంతోషించాడు.

**స హోవాచ ప్రతిజ్ఞాతో మ ఏష వరః** – నాకు మీచేత ఈ వరము ప్రతిజ్ఞ చేయబడింది.

**యాం తు కుమారస్యాంతే వాచమభాషథాస్తాం మే బ్రూహీతి** – నా పుత్రునికి ఏ ఐదు ప్రశ్నలు వేసారో, వాటికి నాకు జవాబులు చెప్పండి. ఇంకో విధంగా చెప్పాలంటే తనకు పంచాగ్నివిద్యను బోధించమని కోరాడు.

## మంత్రం 6.2.6

**స హోవాచ దైవేషు వై గౌతమ తద్వరేషు మానుషాణాం బ్రూహీతి ॥**

**స హోవాచ దైవేషు వై గౌతమ తద్వరేషు మానుషాణాం బ్రూహీతి** – ఓ గౌతమా! అది దేవతలు కోరే వరం, నువ్వు మనుష్యులకు చెందిన వరం ఏదైనా కోరు అన్నాడు. యమధర్మరాజు కూడా ముందు నచికేతునితో ఇలాగే చెప్పాడు. 'నువ్వు కోరిన విద్య దేవతలకు కూడా అంత తేలిగ్గా అర్థం కాదు; నువ్వు వేరే ఏదైనా కోరుకో' అని ఎన్నో ఆశలు చూపాడు. చక్రవర్తి పదవి, దాసదాసీలు, ఐశ్వర్యం – ఎన్ని చూపినా, 'అన్నీ నువ్వే పెట్టుకో; అవి అశాశ్వతం. అవి నాకు వద్దు, ఆత్మవిద్యే నేర్పించు,' అన్నాడు నచికేతుడు. గౌతముడు కూడా అలాగే స్పందించాడు. మనిషి అయిన జైవలిరాజు నేర్చుకోగా లేనిది, తనెందుకు నేర్చుకోకూడదు?

మంత్రం 6.2.7

**స హోవాచ విజ్ఞాయతే హాస్తి హిరణ్యస్యాపాత్తం గో అశ్వానాం దాసీనాం ప్రవారాణాం పరిధానస్య॥ మా నో భవాన్ బహోరనన్తస్యాపర్యన్తస్యాభ్యవదాన్యో భూదితి ॥ స వై గౌతమ తీర్థేనేచ్ఛాసా ఇతి ॥ ఉపైమ్యహం భవన్తమితి వాచా హ స్మైవ పూర్వ ఉపయన్తి స హోపాయనకీర్త్యోవాస ॥**

రాజు ఇవ్వబోయే లౌకిక సంపదలేవో గౌతమునికి తెలుసు. అందువల్ల, రాజు చెప్పకముందే రాజు ఇవ్వబోయే సంపదలన్నీ తన దగ్గర ఉన్నాయన్నాడు.

**సహోవాచ విజ్ఞాయతే హాస్తి హిరణ్యస్యాపాత్తం గో అశ్వానాం దాసీనాం ప్రవారాణాం పరిధానస్య** – మీకు తెలుసు; నాకు బంగారం, గోవులు, గుర్రాలు, దాసీజనం, పరివారం, వస్త్రాలు అన్నీ ఉన్నాయి అన్నాడు.

**మా నో భవాన్ బహోరనంతస్యాపర్యంతస్యాభ్యవదాన్యో భూదితి** – మీరు అంతులేని, హద్దులులేని సంపదకు దాతలు. మా విషయంలో దాతలు కానివారు కావద్దు అన్నాడు. విద్యాదానం అంతులేని దానం ఎందుకంటే అది తరతరాలకు అందజేయబడుతుంది. మీ దానగుణం గురించి నేను గొప్పగా విన్నాను. ఆ పేరు చెడగొట్టుకోకండి, నా కోరిక కూడా తీర్చండి అంటాడు గౌతముడు.

**స వై గౌతమ తీర్థేనేచ్ఛాసా ఇతి** – ఓ గౌతమా, మీకు నేను బోధ చెయ్యాలంటే మీరు నా శిష్యులు కావాలి అంటాడు. డబ్బు ఇవ్వటం వేరు, జ్ఞానం పంచటం వేరు. జ్ఞానం పంచాలంటే గురుశిష్యుల మధ్య జరగాలి అది. శిష్యుడు కాకుండా, కులాసా కబుర్లలో జ్ఞానబోధను పొందలేరు ఎవరైనా. దానికొక విధివిధానం ఉంటుంది. దాన్ని ఉపసదనము అంటారు.

గౌతమునికి ఈ విషయం తెలుసు. అందువల్ల నేను మిమ్మల్ని శిష్యభావంతో అడుగుతున్నాను అంటాడు. ఇక్కడ ఉపనిషత్తు ఒక విషయం వివరిస్తున్నది. ఆ రోజుల్లో ఉన్న వర్ణాశ్రమవ్యవస్థ ప్రకారం బ్రాహ్మణుడే బోధ చెయ్యగలడు కాని, క్షత్రియుడు చెయ్యకూడదు. క్షత్రియుడు విద్య నేర్చుకోవచ్చు కాని నేర్పించకూడదు. బ్రాహ్మణుడే బోధ చేస్తాడు కాబట్టి బ్రాహ్మణుడు రాజుల దగ్గరనుంచి కూడా నమస్కారాలు పొందుతాడు కాని, తను ఎవరి ముందూ తలవంచడు. పండితులకు, గురువులకు అంత మన్నన ఉండేది. గురువును కించపరిచే సంఘం బాగుపడదు.

శిష్యుడు విద్య నేర్చుకోవాలంటే గురువుకు వంగి నమస్కారం చెయ్యాలి – అది నియమం. కాని బ్రాహ్మణుడు క్షత్రియునికి వంగి నమస్కారం చెయ్యకూడదు. అది ఇంకొక నియమం. అందువల్ల శాస్త్రం ఒక మధ్యే మార్గాన్ని సూచిస్తున్నది. మామూలుగా గురువు శిష్యునికి చేసే ఉపనయనసంస్కారం చేయించుకోకుండా, శిష్యుడు వాక్కుద్వారా నేను మీ శిష్యుణ్ణి అని పలికితే చాలు, తక్కిన ఆచారాలు పాటించనవసరం లేదు. అంటే పాదాభివందనం, సేవలాంటివి చెయ్యనవసరం లేదు. మాటలతో చెపితే చాలు.

మంత్రం 6.2.8

**స హోవాచ తథా నస్త్వం గౌతమ మాऽపరాధాస్తవ చ పితామహా యథేయం విద్యేతః పూర్వం న కస్మిగ్ంశ్చన బ్రాహ్మణ ఉవాస తాం త్వహం తుభ్యం వక్ష్యామి కో హి త్వైవం బ్రువన్తమర్హతి ప్రత్యాఖ్యాతుమితి ॥**

గౌతముడు ఎప్పుడైతే వినయంగా నేను మీ శిష్యునిగా అడుగుతున్నాను అన్నాడో, అప్పుడే రాజుకు అపరాధ భావన కలిగింది. రాజు గౌతముడు తన శిష్యుడు కావాలని అడిగింది గౌతముణ్ణి కించపరచటానికి కాదు; సాంప్రదాయాన్ని పాటించటానికి. బ్రాహ్మణుడికి గురువును అవుతున్నాననే గర్వమూ కాదు, బ్రాహ్మణుణ్ణి కించపరచటమూ కాదు, అది సాంప్రదాయం అని చెబుతున్నాడు. అంతకు ముందు మీ తాతలు, మా తాతల దగ్గర ఏదైనా నేర్చుకోవాలన్నా కూడా ఇలాగే శిష్యులయ్యారు అని చెబుతున్నాడు. అంటే వాక్కుద్వారానే శిష్యులయ్యారు.

ఇంకో అపరాధభావన కూడా తొలుస్తున్నది రాజును. ఇది దైవవిత్తం, మానుషవిత్తం కాదన్నాడు కదా ముందు. అంటే గౌతముడు అడిగిన వరాన్ని తీర్చనట్టు అవుతుంది. నాకున్న విద్యను మీతో పంచుకోననే స్వార్థం చూపినట్టు అవుతుంది. అందువల్ల చెబుతున్నాడు, 'ఈ విద్య ఇంతకుముందు కూడా క్షత్రియులకు మాత్రమే తెలుసు, బ్రాహ్మణులకు తెలియదు.'

ఈ విద్య అంటే పంచాగ్నివిద్య బ్రాహ్మణులకు శుక్లగతి, కృష్ణగతుల గురించి తెలుస్తాయి కాని పంచాగ్నివిద్య అనే ఉపాసన గురించి తెలియదు. జీవుడు మారే ఒక్కొక్క దశనూ ఒక్కొక్క అగ్నితో పోల్చి ఉపాసన చెయ్యాలి. ఈ విద్య క్షత్రియులకు మాత్రమే తెలుసు కాబట్టి, నేను ముందు చెప్పదలుచుకోలేదు. కాని ఇప్పుడు ఆ సంప్రదాయాన్ని తప్పించి, మీకు చెబుతాను అంటాడు.

**అహం తుభ్యం వక్ష్యామి కో హి త్వైవం బ్రువంతమర్హతి ప్రత్యాఖ్యాతుమితి** – మీకు నేను ఉపదేశిస్తాను. ఎందుకంటే, మీకు నేను శిష్యుణ్ణని చెప్పే మీలాంటి వారికి చెప్పకుండా ఎవరైనా ఎలా నిరాకరించగలరు?

అంటే తప్పకుండా చెబుతాను అని అర్థం. ఇంకా బోధ మొదలవలేదు. ఇంతవరకూ ఉపోద్ఘాతం అయింది. జైవలి గురువు, గౌతముడు శిష్యుడు.

మంత్రం 6.2.9

**అసౌ వై లోకోऽగ్నిర్గౌతమ తస్యాదిత్య ఏవ సమిద్రశ్మయో ధూమోऽహరర్చిర్దిశోऽఙ్గారా అవాన్తరదిశో విస్ఫులిఙ్గాస్తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవాశ్రద్ధాం జుహ్వతి తస్యా ఆహుత్యై సోమో రాజా సమ్భవతి ॥**

ఈ మంత్రంతో బోధ మొదలవుతుంది. ముందు నాలుగవ ప్రశ్నకు జవాబు చెబుతున్నాడు జైవలి. ఆ జవాబు 9–14వ మంత్రాల వరకూ సాగుతుంది. ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. దీని జవాబు అంతకన్నా ముఖ్యం. దీన్ని పంచాగ్నివిద్య అంటారు. విద్య అంటే ఇక్కడ ఉపాసన.

నాలుగవ ప్రశ్నను టూకీగా చూస్తే – **ఏ దశలను దాటుకుని జీవుడు మనుష్యలోకానికి తిరిగి వస్తాడు**? దానికి జవాబు టూకీగా ఐదు దశలను దాటుకుని మనిషిగా వస్తాడు. ఐదు దశలనూ అగ్నిగా భావించి ఉపాసన చేస్తారు కాబట్టి దీనిని పంచాగ్నివిద్య అంటారు. ఈ పంచాగ్నివిద్యను ఛాందోగ్యోపనిషత్తులో కూడా ఐదవ అధ్యాయంలో, మూడవ ఖండంలో చూస్తాము.

ముందు ఈ పంచాగ్నివిద్య గురించి సూక్ష్మంగా చూద్దాము.

ఈ పంచాగ్నివిద్య వైదికజీవితాన్ని గడిపిన ఒక గృహస్థు గురించి వస్తుంది. అగ్నిసాక్షిగా పెళ్ళి చేసుకున్న గృహస్థు, తన ఇంట్లో ఆ అగ్నిని తను జీవించి ఉన్నంతకాలం గార్హపత్యాగ్నిగా కొలుస్తాడు. అంతేకాదు, తన జీవితకాలంలో తను 40 సంస్కారాలు చేస్తాడు. అతని మరణం తర్వాత, అదే అగ్నిలోంచి తీసి అతనికి దహన సంస్కారం చేస్తారు. అది తనకు తాను చేసుకోలేడు, తనవారు చేస్తారు. ఈ చివరి సంస్కారాన్ని అంత్యేష్టికర్మ అంటారు.

అంత్యేష్టికర్మలో ఈ వైదికపురుషుని శరీరాన్ని గార్హపత్యాగ్నిలో కాలిస్తే, ఆ అగ్ని అతనికి ఒక స్థూలశరీరాన్ని ఇస్తుంది. అది పేరుకే స్థూలశరీరం కాని, అది చాలా సూక్ష్మశరీరంగా ఉంటుంది. కంటికి కనపడదు. ఈ స్థూలశరీరం కూడా పాంచభౌతికశరీరం. కాని ఇది పంచభూతాలతో కూడినదైనా కూడా నీరు ప్రధానంగా ఉంటుంది. అందువల్ల దీన్ని జలీయశరీరం అంటారు.

జైవలి ప్రశ్న గుర్తుంటే, జలీయశరీరం లేదా జలశరీరం మానవశరీరంగా ఎలా మారుతుంది? అది ఎందుకు జలశరీరం అయింది అంటే ఈ వైదికపురుషుడు జీవించివుండగా 40 సంస్కారాలు చేస్తాడని చూశాము కదా! ఆ యజ్ఞాల్లో ఎక్కువగా పాలు, నెయ్యివంటి ద్రవపదార్థాలు వేస్తాడు. అతను ద్రవపదార్థాలు వెయ్యటంవల్ల అతనికి ద్రవరూపంలో ఉన్న జలశరీరాన్ని ఇస్తుంది అగ్ని.

ఈ జలశరీరంలో సూక్ష్మశరీరం, కారణశరీరం, ప్రతిబింబచైతన్యం ప్రయాణం చేస్తాయి. ఆ ప్రయాణం ఐదు దశల్లో సాగుతుంది. ఒక ఫ్యాక్టరీలో ఒక వస్తువు ఎలా దశలవారీగా తయారవుతుందో, అలాగే మళ్ళీ పుట్టే జీవుడు కూడా అత్యంత సూక్ష్మస్థితినుంచి స్థూలస్థితికి దశలవారీగా చేరుకుంటాడు. చివరిదశలో అద్భుతమైన మానవశరీరం పొందుతాడు.

ఐదు దశలు ఐదు యజ్ఞాలు అని చూశాము. మొదటి దశ ఒక యజ్ఞం. అందులో జలశరీరాన్ని అగ్నికి ఆహుతిగా వేస్తే, దానికన్నా కొత్త స్థూలశరీరం వస్తుంది. ఆ కొత్తగా వచ్చే శరీరం ఫలం. కొత్తగా వచ్చే శరీరం రెండవ అగ్నికి ఆహుతి అవుతుంది. ఆ విధంగా మొదటి అగ్నినుంచి వచ్చిన ఫలం రెండవ అగ్నికి ఆహుతి అవుతుంది. అలాగే రెండవ అగ్నినుంచి వచ్చిన ఫలం మూడవ అగ్నిలో వేసే ఆహుతి లేదా ద్రవ్యం అవుతుంది. ఇదీ కల్పన, ఇదీ ఉపాసన. ఆ విధంగా ఐదు అగ్నులు ఉన్నాయి. అంటే ఐదు ద్రవ్యాలు, ఐదు ఫలాలు ఉన్నాయి. దాన్ని కింద ఉన్న పట్టికలో చూడవచ్చు.

| మంత్రం | దశ | ద్రవ్యం | అగ్ని | ఫలం | వివరణ |
|---|---|---|---|---|---|
| 9 | 1 | జలశరీరం | స్వర్గ అగ్ని | సోమశరీరం | సోమరాజు |
| 10 | 2 | సోమ శరీరం | పర్జన్య అగ్ని | వృష్టి శరీరం | వర్షం |
| 11 | 3 | వృష్టి శరీరం | పృథివీ అగ్ని | ఓషధీ శరీరం | అన్నం |
| 12 | 4 | ఓషధీ శరీరం | పురుష అగ్ని | రేతశ్శరీరం | రేతస్సు |
| 13 | 5 | రేతశ్శరీరం | స్త్రీ అగ్ని | పురుష శరీరం | – |

**పంచాగ్నులు** – స్వర్గ అగ్ని, పర్జన్య అగ్ని, పృథివి అగ్ని, పురుష అగ్ని, స్త్రీ అగ్ని. చివరి ఫలం పురుషశరీరం. ఈ పంచాగ్నివిద్య ప్రత్యేకించి ఉపాసనకోసం చెప్పబడింది. అందుకని వైదికపురుషుని జీవితాన్ని తీసుకుంది.

మరణించిన వ్యక్తిని అగ్నిలో దహనం చేస్తే, అగ్నిదేవత అతనికి ఒక స్థూలశరీరం ఇస్తుందని చూశాము. అంటే దహనం చెయ్యబడని వారికి ఇవ్వదా అనే సందేహం రావచ్చు. కొన్ని మతాల్లో శరీరాన్ని దహనం చెయ్యరు. పూడ్చిపెడతారు. వారి సంగతేమిటి?

దీనికి జవాబులు ముఖ్యం కాదు. వేదం పునర్జన్మ విశేషాలు చెప్పటానికి ఈ విద్య గురించి చెప్పటం లేదు. అన్ని రకాల జీవుల గురించి కూడా ఇక్కడ చెప్పటం లేదు. యజ్ఞాలు చెయ్యని వ్యక్తి మాటేమిటి? ఏ కారణంవల్లనైనా అంత్యేష్టికర్మ జరగని వ్యక్తి మాటేమిటి? ఈ ప్రశ్నలకు ఇక్కడ జవాబులు దొరకవు. ఇక్కడ తీసుకున్న అంశం జీవితమంతా అనేక యజ్ఞాలు చేసి అగ్నిహోత్రంలో ఆహుతులు వేసి, పుణ్యం పొందిన వ్యక్తి గురించి. ఇన్నాళ్ళూ అతను ఆహుతులు వేశాడు. ఇప్పుడు అతని మరణానంతరం అతని శరీరాన్ని అగ్నికి ఆహుతిగా వేస్తారు. అందుకే ఆ కర్మని దహనసంస్కారం అంటారు.

అటువంటి వైదిక పురుషుని గురించి చెబుతున్నది. దానికి రెండు కారణాలున్నాయి. ఒక కారణం – ఒక ఉపాసనను నేర్పించటానికి, ఇంకొక కారణం వైరాగ్యం పెంపొందించటానికి. పునర్జన్మ దశలు తెలుసుకోవటానికి కాదు, ఆ దశల గురించి విని వైరాగ్యం పెంపొందించుకోవటానికి చెబుతున్నది. అందువల్ల ఇది తెలుసుకుని ఈ జననమరణవృత్తినుంచి బయటకు రావాలనే ఉద్దేశంతో చెబుతున్నది. మంత్రాల్లో అగ్ని, ఇంధనము, పొగ, జ్వాల, బొగ్గులు, మిణుగురులు గురించిన కల్పనలు ప్రతిదశలో వస్తాయి. ఆ వివరాలలోకి వెళ్ళటం లేదు మనం.

**అగ్ని 1** – ద్యులోకము అగ్ని. అంటే స్వర్గలోకం అగ్ని. దానిలో వేసే ద్రవ్యం జలశరీరం. దానినుంచి వచ్చే ఫలం సోమశరీరం. ఆ ఆహుతినుంచి సోమరాజు ఉదయిస్తున్నది.

## మంత్రం 6.2.10

**పర్జన్యో వా అగ్నిర్గౌతమ తస్య సంవత్సర ఏవ సమిదభ్రాణి ధూమో విద్యుదర్చిరశనిరఙ్గారా హ్రాదునయో విస్ఫులిఙ్గాస్తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవాః సోమగ్ం రాజానం జుహ్వతి తస్యా ఆహుత్యై వృష్టిస్సమ్భవతి ॥**

**అగ్ని 2** – పర్జన్య అగ్ని. అంటే మేఘాలు అగ్ని. దానిలో వేసే ద్రవ్యం సోమశరీరం. దానినుంచి వచ్చే ఫలం వృష్టిశరీరం. ఆ ఆహుతినుంచి వర్షం సంభవిస్తుంది.

మంత్రం 6.2.11

**అయం వై లోకోఽగ్నిర్గౌతమ తస్య పృథివ్యేవ సమిదగ్నిర్ధూమో రాత్రిరర్చిశ్చన్ద్రమా అఙ్గారా నక్షత్రాణి విస్ఫులిఙ్గాస్తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవా వృష్టిం జుహ్వతి తస్యా ఆహుత్యా అన్నగ్ం సమ్భవతి ॥**

**అగ్ని 3** – పృథివి అగ్ని. అంటే భూలోకం అగ్ని. దానిలో వేసే ద్రవ్యం వృష్టిశరీరం. దానినుంచి వచ్చే ఫలం ఓషధీశరీరం. ఆ ఆహుతినుంచి అన్నం సంభవిస్తుంది.

మంత్రం 6.2.12

**పురుషో వా అగ్నిర్గౌతమ తస్య వ్యాత్తమేవ సమిత్ప్రాణోధూమో వాగర్చిశ్చక్షురఙ్గారాశ్శ్రోత్రం విస్ఫులిఙ్గాస్తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవా అన్నం జుహ్వతి తస్యా ఆహుత్యై రేతస్సమ్భవతి ॥**

**అగ్ని 4** – పురుష అగ్ని. అంటే పురుషుడు అగ్ని. దానిలో వేసే ద్రవ్యం ఓషధీశరీరం. దానినుంచి వచ్చే ఫలం రేతశ్శరీరం. ఆ ఆహుతినుంచి రేతస్సు ఉద్భవిస్తుంది. అంటే పురుషుడు కూడా గర్భంతో ఉన్నట్లే. అతని శరీరంలో కూడా జీవి ఉంటుంది. అతని శరీరంనుంచి ఈ జీవి స్త్రీ శరీరంలోకి ప్రవేశిస్తుంది. జీవి పురుష శరీరంలోనే రూపుదిద్దుకుంటుంది కాబట్టి గర్భస్రావం చేయించుకోవటం శాస్త్రం ప్రకారం పాపం.

మంత్రం 6.2.13

**యోషా వా అగ్నిర్గౌతమ తస్యా ఉపస్థ ఏవ సమిల్లోమాని ధూమో యోనిరర్చిర్యదన్తః కరోతి తేఽఙ్గారా అభినన్దా విస్ఫులిఙ్గాస్తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవా రేతో జుహ్వతి తస్యా ఆహుత్యై పురుషస్సమ్భవతి స జీవతి ॥ యావజ్జీవత్యథ యదా మ్రియతే ॥**

**అగ్ని 5** – స్త్రీ అగ్ని. అంటే స్త్రీశరీరం అగ్ని. అందులో వేసే ద్రవ్యం రేతశ్శరీరం. దానినుంచి వచ్చే ఫలం పురుషశరీరం. ఆ ఆహుతినుంచి పురుషుడు అంటే సంతానం సంభవిస్తుంది.

**స జీవతి** – ఆ పురుషుడు జీవిస్తాడు. ఆ విధంగా ఐదు ఆహుతుల తర్వాత జలశరీరం మనుష్య శరీరంగా మారుతుంది. పంచాగ్నిద్వారా వచ్చాము కాబట్టి మనమంతా అగ్నిపుత్రులం. అగ్నిచేత పునీతులమయ్యాము.

ఈ దశలను పంచాగ్ని ఉపాసనగా భావించాలని ఎందుకంది ఉపనిషత్తు? అగ్ని నికృష్టవస్తువును ఉత్కృష్టవస్తువుగా మారుస్తుంది. అది అగ్నియొక్క ప్రత్యేకత. మనం రోజూ చేసే వంట కూడా అంతే. పచ్చిగా తినటానికి వీలుగా లేని కూరని వండితే, అది రుచికరమైన ఆహారంగా మారుతుంది. అంటే నికృష్టస్థితినుంచి ఉత్కృష్టస్థితి పొందుతుంది.

అలాగే మన శరీరం కూడా ముందు సూక్ష్మంగా ఉండి, వ్యవహారం నడపలేని స్థితిలో ఉంటుంది. క్రమంగా స్థూలమవుతూ వచ్చి చివరికి మనుష్యశరీరాన్ని పొందుతుంది. ఆ మార్పును అగ్నితో పోల్చింది ఉపనిషత్తు.

ఎందుకు యజ్ఞంతో పోలుస్తుంది? ఎందుకంటే ప్రతి యజ్ఞంలో నికృష్టవస్తువు, ఉత్కృష్టవస్తువుగా మారుతుంది. ఈ ఐదు దశలనూ పంచాగ్ని విద్యతో పోల్చింది ఉపనిషత్తు. దానిమీద చేసే ఉపాసనను పంచాగ్నివిద్య అంటారు.

**యావజ్జీవత్యథ యదా మ్రియతే** – అలా పుట్టిన వ్యక్తి కర్మఫలమున్నంతవరకూ జీవిస్తాడు. తర్వాత ఎప్పుడైతే మరణిస్తాడో –

## మంత్రం 6.2.14

**అథైనమగ్నయే హరన్తి తస్యాగ్నిరేవాగ్నిర్భవతి సమిత్సమిద్ధూమో ధూమోఽర్చిరర్చిరఙ్గారా అఙ్గారా విస్ఫులిఙ్గా విస్ఫులిఙ్గాస్తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవాః పురుషం జుహ్వతి తస్యా ఆహుత్యై పురుషో భాస్వరవర్ణస్సమ్భవతి ॥**

**అథైనమగ్నయే హరంతి** – అప్పుడు అతన్ని అగ్నికి ఆహుతి చేస్తారు. ఇంతవరకూ చెప్పిన అగ్నులు ఊహాజనిత మైనవి. వాటిని గౌణాగ్ని అంటారు. అవి ముఖ్య అగ్నులు కావు. కాని అలా పంచాగ్నివిద్యద్వారా పుట్టిన వ్యక్తి మరణించాక, అతన్ని నిజమైన అగ్నిలో వేస్తారు. అందువల్ల ఇందులో అగ్ని, సమిధ, పొగ, జ్వాల, బొగ్గులు, మిణుగురులు అన్నీ నిజమే. ఇది నిజమని చూపించటానికి అర్చిరర్చిః అంది. అంటే జ్వాలయే జ్వాల అంది.

**తస్యా ఆహుత్యై పురుషో భాస్వరవర్ణస్సంభవతి** – ఆ ఆహుతినుంచి బాగా ప్రకాశించే రంగుగల పురుషుడు ఆవిర్భవిస్తాడు. ఇక్కడ ఉపనిషత్తు అతను జీవించి ఉండగా 40 సంస్కారాలూ చేసివుంటాడని భావిస్తున్నది. అలా వైదికకర్మలచేత సంస్కరింపబడటంవల్ల, అధికంగా ప్రకాశిస్తాడు. దీనితో నాలుగవ ప్రశ్నకు జవాబు ముగిసింది. పంచాగ్నివిద్య వివరంగా ఛాందోగ్యంలోనూ, టూకీగా ముండకంలోనూ చూస్తాము.

**నాలుగవ ప్రశ్న:** జలశరీరం పురుషశరీరంగా ఎప్పుడు మారుతుందో తెలుసా?

**జవాబు:** పంచాగ్నులలో వేశాక, పురుషశరీరంగా మారుతుంది.

### మంత్రాలు 6.2.15, 6.2.16

ఈ రెండు మంత్రాల్లో రెండు ప్రశ్నలకు జవాబు వస్తుంది. శుక్లగతి, కృష్ణగతుల గురించి వివరంగా వస్తుంది. అందువల్ల ఈ రెండు మంత్రాలు చాలా ముఖ్యమైన మంత్రాలు. భగవద్గీతలో 8.24కి బీజం ఈ మంత్రాలు. అంతేకాదు, ఈ గతుల గురించి ఛాందోగ్యోపనిషత్తులో 4.15.1లో, 5.10.1 వస్తుంది; ప్రశ్నోపనిషత్తులో 1.10లో వస్తుంది; ఈశావాస్యోపనిషత్తులో 18వ మంత్రంలో వస్తుంది. ఇక్కడ ఐదవ ప్రశ్నకు జవాబు వస్తుంది.

## మంత్రం 6.2.15

**తే య ఏవమేతద్విదుర్యే చామీ అరణ్యే శ్రద్ధాగ్ం సత్యముపాసతే తేఽర్చిభిరభిసమ్భవన్త్యర్చిషోఽహరహ్న ఆపూర్యమాణపక్షమాపూర్యమాణపక్షాద్యాన్ షణ్మాసానుదఙ్ఙాదిత్య ఏతి మాసేభ్యో దేవలోకం దేవలోకాదాదిత్యమాదిత్యాద్వైద్యుతం తాన్ వైద్యుతాన్ పురుషో మానస ఏత్య బ్రహ్మలోకాన్ గమయతి తే తేషు బ్రహ్మలోకేషు పరాః పరావతో వసన్తి తేషాం న పునరావృత్తిః ॥**

**ప్రశ్న 5** – శుక్లగతి, కృష్ణగతుల్లో వెళ్ళటానికి సాధనలు ఏమిటి?

ముందు శుక్లగతి గురించి చూస్తాము.

**తే య ఏవమేతద్విదుః** – పంచాగ్ని ఉపాసన చేసినవారు శుక్లగతిద్వారా వెళ్ళటానికి అర్హులు. అంటే పంచాగ్ని ఉపాసన చేసిన గృహస్థు శుక్లగతిద్వారా వెళ్ళి, తర్వాత క్రమముక్తి పొందుతాడు. ఈ గృహస్థు వానప్రస్థాశ్రమానికి కాని, సన్న్యాసాశ్రమానికి కాని వెళ్ళనవసరం లేదు.

**యే చామీ అరణ్యే శ్రద్ధాగ్ం సత్యముపాసతే** – వానప్రస్థాశ్రమానికి వెళ్ళినవారు అక్కడ హిరణ్యగర్భ ఉపాసన చేస్తే, వారు కూడా శుక్లగతిద్వారా వెళతారు. ఇక్కడ సత్యం అంటే హిరణ్యగర్భ ఉపాసన.

ఈ సందర్భంలో శంకరులవారు సన్న్యాసులను కూడా కలుపుతున్నారు. ఏ సన్న్యాసులు అయితే సన్న్యాస ధర్మాలను పాటిస్తారో వారు కూడా శుక్లగతిని పొందుతారు. సన్న్యాసి పంచాగ్నివిద్యతో సహా ఏ ఉపాసనా చెయ్యనవసరం లేదు. అతను జ్ఞానం పొందితే విదేహముక్తి పొందుతాడు. జ్ఞానం పొందని సన్న్యాసి, సన్న్యాస ఆశ్రమధర్మాలను పాటించిన సన్న్యాసి శుక్లగతిని పొందుతాడు.

ఆశ్రమధర్మాలు అంటే పారాయణం, ఓంకార జపం, హంస మంత్రజపం చెయ్యటంవంటివి. పంచాగ్ని విద్యను వానప్రస్థ ఆశ్రమానికీ, సన్న్యాసాశ్రమానికీ నియమించటం లేదు. ఎందుకంటే అందులో స్త్రీపురుష సంయోగం ఒక దశ. గృహస్థు ఒక్కడే దానికి అర్హుడు. వానప్రస్థానికి భార్యతో వెళ్ళినా, దాంపత్యజీవనం ఉండదు; సన్న్యాసి భార్యను కూడా త్యజిస్తాడు.

నైష్ఠిక బ్రహ్మచారి కూడా శుక్లగతిద్వారా వెళతాడు. అతను ఏమీ ఉపాసన చెయ్యనవసరం లేదు. నైష్ఠిక బ్రహ్మచారి అంటే జీవితాంతం బ్రహ్మచారిగానే ఉంటానని నిష్ఠ తీసుకున్న వ్యక్తి. గురుకులంలో ఉండి, విద్య నేర్చుకునే వ్యక్తిని బ్రహ్మచారి అంటారు. అతను విద్యనభ్యసించాక, వివాహం చేసుకుని గృహస్థు అవచ్చు; లేదా వెంటనే సన్న్యాసం స్వీకరించవచ్చు. ఈ రెండింటిలో ఏది తీసుకున్నా అతను గురుకులవాసం వదలాలి. సన్న్యాసి ఏకాంతంగా జీవించాలి.

ఈ రెండు మార్గాలు కాక, మూడవ మార్గం ఉంటుంది బ్రహ్మచారికి. దాన్ని నైష్ఠిక బ్రహ్మచర్యం అంటారు. అతనికి ఇంకా విద్యనభ్యసించాలి, గురువుకు సేవ చెయ్యాలి అనే కోరిక ఉంటే, గురుకులంలోనే ఉండిపోయి, గురుసేవ చెయ్యవచ్చు. అతను అక్కడ ఒకవేళ ఆత్మజ్ఞానం పొందకపోతే, శుక్లగతిద్వారా బ్రహ్మలోకానికి వెళతాడు.

శుక్లగతిద్వారా వెళ్ళటానికి ఈ విధంగా నాలుగు సాధనలు చెప్పవచ్చు – నైష్ఠిక బ్రహ్మచర్య అనుష్ఠానం, పంచాగ్నివిద్య, హిరణ్యగర్భ ఉపాసన, సన్న్యాస ఆశ్రమ ధర్మ అనుష్ఠానం. ఆ విధంగా నాలుగు ఆశ్రమ ధర్మాలలోనూ శుక్లగతిలో వెళ్ళటానికి సాధనలు ఉన్నాయి.

ఇక్కడ్నుంచీ శుక్లగతి మార్గంయొక్క వివరణ వస్తుంది. శుక్లగతిలో మరణించిన జీవిని తీసుకువెళ్ళే దేవతలను అర్చిరాది దేవతలు అంటారు. బ్రహ్మసూత్రాల్లో ఈ మార్గాన్ని వివరంగా చర్చిస్తారు. అందువల్ల ఈ బ్రాహ్మణం ముఖ్యమైన బ్రాహ్మణం.

**తేఽ ర్చిరభిసంభవంత్యర్చిషోఽ హరహ్న ఆపూర్వమాణపక్షమాపూర్వమాణపక్షాద్యాన్ షణ్మాసానుదఙ్ఙాదిత్య ఏతి మాసేభ్యో దేవలోకం దేవలోకాదాదిత్యమాదిత్యాద్వైద్యుతం తాన్ వైద్యుతాన్ పురుషో మానస ఏత్య బ్రహ్మలోకాన్ గమయతి –** తే అంటే వారు. పైన చెప్పిన సాధనలు చేసినవారు. వారిని ముందు అర్చి దేవతలు తీసుకువెళతారు. అందువల్ల ఈ మార్గాన్ని అర్చిరాది మార్గం అంటారు. శంకరులవారు తన భాష్యంలో ఎక్కువగా ఈ పదం వాడతారు. శుక్లగతి అనే పదాన్ని భగవద్గీతలో కూడా చూస్తాము.

అర్చిదేవత అహర్దేవతకు అందిస్తుంది. అహర్దేవత అంటే పగటి దేవత. అహర్దేవత అపూర్వమాణపక్షానికి అందిస్తుంది. అపూర్వమాణపక్షం అంటే శుక్లపక్షం. అపూర్వమాణపక్షం ఉత్తరాయణ దేవతకు అందజేస్తుంది. ఉత్తరాయణ దేవత అని ప్రత్యక్షంగా చెప్పకుండా సూర్యుడు ఆరుమాసాలు ఉత్తరాయణంవైపు వెళతాడు అని చెబుతున్నది ఉపనిషత్తు. ఉత్తరాయణ దేవతనుంచి దేవలోకానికి, దేవలోకంనుంచి ఆదిత్యలోకానికి వెళతాడు జీవుడు. ఈ రెండింటికి దేవతలు అనకుండా లోకాలు అంటున్నది ఉపనిషత్తు. దేవలోకం అంటే ఇక్కడ స్వర్గం. స్వర్గంనుంచి సూర్యలోకానికి, సూర్యలోకంనుంచి విద్యుత్ లోకానికి వెళతాడు జీవుడు. విద్యుత్ దేవత అంటే మెరుపుకు దేవత. బ్రహ్మలోకానికి వెళ్ళే ముందు లోకం అది.

బ్రహ్మలోకంనుంచి ప్రత్యేకమైన దేవత వచ్చి ఈ జీవుడిని తీసుకువెళతాడు. ఆ దేవతను బ్రహ్మమానసపుత్రుడు అంటారు.

బ్రహ్మలోకంలో కూడా తారతమ్యాలు ఉంటాయని ఒక భాష్యకారుడు అంటాడు. ఎందుకు? అందరూ పంచాగ్నివిద్యే చేసినా కూడా, వారి భక్తిలో, వారు చేసిన తీరులో తేడాలు ఉండవచ్చు. అలాగే తక్కిన ఆశ్రమాలవారు కూడా వారి శ్రద్ధాభక్తులలో వ్యత్యాసాలు చూపవచ్చు. అందువల్ల వారి ఆనందంలో తారతమ్యాలు ఉంటాయి.

**తే తేషు బ్రహ్మలోకేషు పరాః పరావతో వసంతి –** అక్కడ వారు బ్రహ్మలోకంలో మహిమను చూస్తూ అనేక సంవత్సరాలు ఉంటారు. బ్రహ్మలోకంలో ఒక్కరోజు మనుష్యులయొక్క రెండువేల చతుర్యుగాలు. అలా ఎన్ని సంవత్సరాలో ఉంటారు.

**తేషాం న పునరావృత్తిః –** అంతేకాదు, వారు మళ్ళీ తిరిగిరారు. అంటే క్రమముక్తి పొందుతారు. అక్కడ సాక్షాత్తూ బ్రహ్మద్వారా బ్రహ్మజ్ఞానం పొంది, అక్కడ ఉన్నన్నాళ్ళూ జీవన్ముక్తి పొంది, ప్రళయకాలంలో విదేహముక్తి పొందుతారు.

## మంత్రం 6.2.16

**అథ యే యజ్ఞేన దానేన తపసా లోకాన్ జయన్తి తే ధూమమభిసమ్భవంతి ధూమాద్రాత్రిగ్ం రాత్రేరపక్షీయమాణపక్షమపక్షీయమాణపక్షాద్యాన్ షణ్మాసాన్దక్షిణాఽ ఽ దిత్య ఏతి మాసేభ్యః పితృలోకం పితృలోకాచ్చన్ద్రం తే చన్ద్రం ప్రాప్యాన్నం భవన్తి తాగ్ంస్తత్ర దేవా యథా సోమగ్ం రాజానమాప్యాయస్వాపక్షీయస్వేత్యేవమేనాగ్ంస్తత్ర భక్షయన్తి తేషాం యదా తత్పర్యవైత్యథేమమేవాకాశమభినిష్పద్యన్తే ॥ ఆకాశాద్వాయుం వాయోర్వృష్టిం వృష్టేః పృథివీం తే**

**పృథివీం ప్రాప్యాన్నం భవన్తి తే పునః పురుషాగ్నౌ హూయన్తే తతో యోషాగ్నౌ జాయన్తే లోకాన్ ప్రత్యుత్థాయినస్త ఏవమేవానుపరివర్తన్తేఽథ య ఏతౌ పన్థానౌ న విదుస్తే కీటాః పతఙ్గా యదిదం దన్దశూకమ్ ॥**

ఈ మంత్రంలో మూడు అంశాలను చూస్తాము. అవి కృష్ణగతి సాధనం, కృష్ణగతి, అథోగతి.

1. **కృష్ణగతి సాధనం**

**అథ యే యజ్ఞేన దానేన తపసా లోకాన్ జయంతి** – కృష్ణగతి సాధనలు మూడు అంటున్నది ఉపనిషత్తు. అవి యజ్ఞం, దానం, తపస్సు. భగవద్గీత 17వ అధ్యాయంలో మూడు రకాల యజ్ఞాలు, మూడు రకాల దానాలు, మూడు రకాల తపస్సులు చూస్తాము. 18వ అధ్యాయంలో కూడా దీని గురించి చూస్తాము. దీన్నిబట్టి ఈ మూడు సాధనలూ చాలా ముఖ్యమని మనకు తెలుస్తున్నది.

యజ్ఞం అంటే భగవంతుని పూజించటం; దానం అంటే ధనరూపేణ, కర్మరూపేణ దానం చెయ్యటం; కష్టంలో ఉన్నవారికి నాలుగు మంచిమాటలు చెప్పటం, ఎదుటివారి బాధలను చిరునవ్వుతో, ఓర్పుగా వినటం కూడా దానం కిందికే వస్తుంది. తపస్సు అంటే ఆత్మ సంయమనం, ఇంద్రియనిగ్రహం వస్తాయి. ఏకాదశిరోజు ఉపవాసం ఉండగలగటం కూడా తపస్సు కిందికే వస్తుంది.

ఇక్కడ రాని అంశం ఉపాసన. ఉపాసన కూడా కలిపి చేస్తే శుక్లగతిద్వారా వెళతారు. కాని ఉపాసన చెయ్యరు కాబట్టి, వారు బ్రహ్మలోకానికి వెళ్ళలేరు.

2. **కృష్ణగతి వివరణ**

**తే ధూమమభిసంభవంతి** – వారు ముందు ధూమదేవత దగ్గరకు వెళతారు.

**ధూమాద్రాత్రిగ్ం రాత్రేరపక్షీయమాణపక్షమపక్షీయమాణపక్షాద్యాన్ షణ్మాసాన్దక్షిణాఽఽదిత్య ఏతి మాసేభ్యః పితృలోకం పితృలోకాచ్చంద్రమ్** – వారిని ధూమదేవత రాత్రిదేవతకు, రాత్రిదేవత కృష్ణపక్షదేవతకు, కృష్ణపక్షదేవత దక్షిణాయణదేవతకు, దక్షిణాయణదేవత పితృలోకానికి, పితృలోకదేవత చంద్రలోకానికి తీసుకువెళతారు. చంద్రలోకం అంటే స్వర్గం.

**తే చంద్రం ప్రాప్యాన్నం భవంతి** – స్వర్గంలో వీరు దేవతలకు అన్నం అవుతారు. అన్నం అవుతారు అంటే దేవతలు వీరిని వారి అవసరాలకు వాడుకుంటారని అర్థం. అంటే భోగ్యము అవుతారు.

**తాగ్ంస్తత్ర దేవా యథా సోమగ్ం రాజానమాప్యాయస్వాపక్షీయస్వేత్యేవమేనాగ్ం స్తత్ర భక్షయంతి** – సోమ యాగంలో అనేక దేవతలకు అగ్నిదేవతద్వారా సోమరసాన్ని ఆహుతిగా వేస్తారు. దేవతలకు సోమరసం చాలా ఇష్టం. వారు ఈ కర్మఠులచేత సోమరసాన్ని నింపించుకుని తాగుతూ ఉంటారు. ఆ విధంగా స్వర్గలోకానికి చేరుకున్న కర్మఠులు దేవతలకు, రాజుకు సేవకులు సేవ చేసినట్టుగా, సేవ చెయ్యాలి. ఆ విధంగా వీరు అన్నం (భోగ్యవస్తువు) అవుతారు దేవతలకు.

అలా సేవకులుగా ఉంటే స్వర్గలోక ఆనందం ఏం ఉంటుంది? ఏ.సి. ఉన్న కారులో డ్రైవరు పొందే ఆనందం ఉంటుంది. కారు అతనిది కాకపోయినా, అతను ఎక్కువసేపే కారులోని ఏ.సి.ని అనుభవిస్తాడు. అలా ఉండటం ఇష్టం లేకపోతే, ఆత్మజ్ఞానం పొంది, మోక్షం పొందవచ్చు.

**తేషాం యదా తత్పర్యవైత్యథేమమేవాకాశభినిష్పద్యంతే** – ఎప్పుడైతే ఆ కర్మఠుల యజ్ఞం, దానం, తపస్సు అనే కర్మవల్ల వారిని స్వర్గలోకానికి తీసుకుపోయిన కర్మఫలం క్షీణిస్తుందో, అప్పుడు వారు ఈ ప్రసిద్ధమైన ఆకాశాన్ని చేరుకుంటారు.

యజ్ఞం, దానం, తపస్సు చేసిన కర్మఠుడు స్వర్గలోకానికి వెళతాడు. అక్కడ దేవతలకు సేవ చేస్తాడు, పుణ్యఫలం క్షీణించగానే తిరిగివస్తాడు అంటే, ఇటువంటి స్వర్గలోకంమీద ఆశలేని వ్యక్తి ఈ మూడు కర్మలూ చెయ్యటం మానేయవచ్చా? ఈ మూడు కర్మలూ మానేయలేడు, మానేయకూడదు కూడా. ఎందుకు? వీటి ఫలం స్వర్గలోకం కదా, నాకు స్వర్గం అవసరం లేదని మీరు అంటే ఇవే కర్మలు అంటే యజ్ఞం, దానం, తపస్సు మోక్షం పొందటానికి కూడా చెయ్యవచ్చు.

వీటిని చేసేటప్పుడు మీ దృక్పథాన్ని మార్చుకోవాలి. పుణ్యం రెండు రకాలు. ఒకటి లౌకిక పుణ్యం. ఇంకొకటి ఆధ్యాత్మిక పుణ్యం. లౌకిక పుణ్యం స్వర్గలోకానికి తీసుకువెళుతుంది. ఆధ్యాత్మిక పుణ్యం మోక్షానికి సిద్ధం చేస్తుంది. అంటే సాధనచతుష్టయసంపత్తిని పెంచుతుంది. గురువును ఏర్పాటు చేస్తుంది. శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి మోక్షం పొందటానికి అవకాశం కలుగజేస్తుంది. అంటే వీటికి అనువైన వాతావరణాన్ని, మంచి ఆరోగ్యంతో సహా, ఏర్పాటు చేస్తుంది.

ఇది వద్దనుకుని కేవలం కర్మఠుడుగా ఉండిపోయిన వ్యక్తి స్వర్గలోకానికి వెళ్ళి, పుణ్యం క్షీణించాక తిరిగి వస్తాడని చూశాము. అతను ఆకాశానికి వస్తాడని కూడా చూశాము. ఇప్పుడు అతను తిరిగివచ్చే మార్గం చూద్దాము.

**ఆకాశాద్వాయుం వాయోర్వృష్టిం వృష్టేః పృథివీం తే పృథివీం ప్రాప్యాన్నం భవంతి** – ఆకాశానికి వస్తారు; ఆకాశంనుంచి వాయువుకు, వాయువునుంచి వర్షానికి, వర్షంనుంచి పృథివికి వచ్చి, పృథివినుంచి అన్నం అవుతాడు. అంటే పృథివిలో ఉన్న వృక్షాల్లోకి వెళతాడు. అప్పుడు వృక్షాల్లో రెండు జీవులు ఉంటాయి – వృక్షానికి సంబంధించిన జీవుడు, తిరిగివచ్చిన జీవుడు. కాని తిరిగివచ్చిన జీవుడు ఇంకా జన్మ పొందలేదు కాబట్టి అతనికి వృక్షానికి చెందే కర్మఫలాలు అంటవు.

**తే పునః పురుషాగ్నౌ హూయంతే తతో యోషాగ్నౌ జాయంతే లోకాన్ ప్రత్యుత్థాయినస్త ఏవమేవానుపరివర్తంతే** – వృక్షంనుంచి పురుషుడు అనే అగ్నిలో హోమం చేయబడతాడు. రేతస్సు రూపాన్ని పొందివున్న ఆ జీవుడు ఆ పురుషునినుంచి స్త్రీ అనే అగ్నిలో హోమం చేయబడతాడు. ఆమెనుంచి జన్మించి, మళ్ళీ కర్మలు చేస్తూ, మళ్ళీ కృష్ణగతిద్వారా పుణ్యలోకాలకు వెళుతూ, మళ్ళీ తిరిగి పుడుతూ ఉంటారు. ఈ విధంగా వారు జనన మరణవృత్తంలో పడి కొట్టుమిట్టాడుతూనే ఉంటారు.

దీనికి పరిష్కారం ఏమిటి? వారు సగుణబ్రహ్మ ఉపాసన చేసి, బ్రహ్మలోకానికి వెళ్ళి, అక్కడ క్రమముక్తిని పొందటం. అప్పుడు ఈ చీకటి మార్గంలో కాకుండా, ప్రకాశవంతమైన శుక్లగతిద్వారా వెళ్ళవచ్చు. లేదా ఇంకా ఉత్తమమైన మార్గం, నిర్గుణబ్రహ్మజ్ఞానం పొంది, ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందటం. దానిని జీవన్ముక్తి అంటారు. జ్ఞాని మరణించాక, ఈ జననమరణవృత్తం ఉండదు; అతను విదేహముక్తి పొందుతాడు.

**3 అధోగతి-** కేవలకర్మ కూడా చేయనివారు ఉన్నారు. వారి గతి ఏమిటి? అధోగతే.

**అథ య ఏతౌ పంథానౌ న విదుస్తే కీటాః పతంగా యదిదం దందశూకమ్** - కర్మ, ఉపాసనలు చెయ్యనివారు అధోగతిలో వెళతారు. వారు కీటకాలు, పక్షులు, దోమలుగా పుడతారు. కర్మ చేస్తే కృష్ణగతి, ఉపాసన చేస్తే శుక్లగతి పొందుతారు. ఈ రెండూ చెయ్యనివారు మూడవగతి అయిన అథోగతి పాలవుతారు. వారు వెంటవెంటనే కీటకాలుగా పుడుతూ, మరణిస్తూ ఉంటారు. అందువల్ల స్వర్గలోకం నిండటం లేదు. దీనితో తక్కిన నాలుగు ప్రశ్నలకూ జవాబులు వచ్చేశాయి. అవేమిటో మళ్ళీ ఒకసారి టూకీగా చూద్దాము.

**ప్రశ్నలు - జవాబులు**

1. మరణం తర్వాత జీవుడు వెళ్ళే మార్గం తెలుసా?
జవాబు: శుక్లగతిలో కాని, కృష్ణగతిలో కాని వెళతాడు.

2. జీవుడు మళ్ళీ ఎలా తిరిగివస్తాడు?
జవాబు: ఆకాశంనుంచి వాయువుకు, వాయువునుంచి వర్షానికి, వర్షంనుంచి పృథివిని పొంది అన్నం అవుతారు. అన్నంగా పురుషునిలో చేరి, పురుషునినుంచి స్త్రీలోకి వెళ్ళి, మళ్ళీ జన్మ పొందుతాడు.

3. ఇంతమంది మరణిస్తున్నా కూడా స్వర్గలోకం ఎందుకు నిండటం లేదు?
జవాబు: కేవలకర్మ కూడా చేయనివారు అధోగతి పాలవుతున్నారు. వారు క్రిమికీటకాలుగా పుడుతున్నారు.

4. ఏ దశలను దాటుకుని జీవుడు మనుష్య లోకానికి తిరిగివస్తాడు?
జవాబు: జలశరీరం, సోమశరీరం, వృష్టిశరీరం, ఓషధీ శరీరం, రేతశ్శరీరం దాటుకుని పురుషశరీరం పొందుతాడు. దీన్ని పంచాగ్నివిద్య అంటారు.

5. శుక్లగతి, కృష్ణగతుల్లో వెళ్ళటానికి సాధనలు ఏమిటి?
జవాబు: శుక్లగతిద్వారా బ్రహ్మలోకానికి వెళ్ళటానికి నాలుగు సాధనలు - నైష్ఠిక బ్రహ్మచర్య అనుష్ఠానం, పంచాగ్నివిద్య, హిరణ్యగర్భ ఉపాసన, సన్న్యాసాశ్రమ ధర్మ అనుష్ఠానం. కృష్ణగతిద్వారా స్వర్గలోకానికి వెళ్ళటానికి మూడు సాధనలు - యజ్ఞం, దానం, తపస్సు. అంటే శుక్లగతికి ఉపాసన, కృష్ణగతికి కర్మసాధనలు.

ఈ విధంగా ఈ బ్రాహ్మణములో కర్మ-కర్మఫలం, ఉపాసన-ఉపాసన ఫలం చూశాము. ఉపాసనల్లో ప్రసిద్ధి చెందిన పంచాగ్నివిద్య కూడా చూశాము. కర్మఫలం గురించి చెబుతుంది కాబట్టి ఈ బ్రాహ్మణాన్ని కర్మవిపాక బ్రాహ్మణము అంటారు. కర్మ అంటే అందులో ఉపాసన కూడా వస్తుంది.

# 6.3 – శ్రీమంథ బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణములో శ్రీమంథ కర్మ గురించి వస్తుంది కాబట్టి దీన్ని శ్రీమంథ బ్రాహ్మణము అంటారు. ఈ కర్మ ఐశ్వర్యం పొందటానికి చేసే కర్మ, అంటే శ్రీప్రాప్త్యర్థం చేసే కర్మ.

మోక్షం కావాలనుకునే వ్యక్తికి ధనప్రాప్తి ఎందుకు? దానికి శంకరులవారు తైత్తిరీయంలో జవాబు చెబుతారు. అందులో ఆవహంతీ హోమం వస్తుంది. అది కూడా ధనప్రాప్తికోసం చేసేదే.

**ధనం దానార్థమ్; దానం కర్మార్థమ్; కర్మ చిత్తశుద్ధ్యర్థమ్; చిత్తశుద్ధి జ్ఞానార్థమ్; జ్ఞానం మోక్షార్థమ్**

మోక్షం కావాలంటే ధనం ఎందుకు అంటే, ధనం అన్ని దశలు దాటుకుని మోక్షాన్ని ఇస్తుంది. ధనం ఉంటే దానం చెయ్యగలం; దానం ఉత్తమకర్మలు చెయ్యటానికి పనికివస్తుంది; ఉత్తమకర్మలు చేస్తే చిత్తశుద్ధి కలుగుతుంది; చిత్తశుద్ధి కలిగితే జ్ఞానానికి అర్హత వస్తుంది. అర్హత వస్తే జ్ఞానం పొందుతాము; జ్ఞానం పొందితే మోక్షం వస్తుంది. మోక్షం ఎందుకు? మోక్షం ఆనందాన్ని ఇస్తుంది. ఆనందం ఎందుకు? మనం ఆనందస్వరూపులం కాబట్టి.

**ఉపాసన స్వతంత్రం కర్మ దానతంత్రమ్**

ఉపాసన చెయ్యటానికి వేరే ఏదీ అవసరం లేదు. అది మానసవ్యాపారం. కాని కర్మ అలా కాదు. కర్మలో చాలా అంశాలు ఉంటాయి. ద్రవ్యం కావాలి, దక్షిణ ఇవ్వాలి, అనేక రకాల దానాలు చెయ్యాలి – అన్నదానం, వస్త్రదానం, గోదానం వగైరా. అందువల్ల కర్మ దానతంత్రం. దానం చెయ్యటానికి డబ్బు కావాలి.

ముందు బ్రాహ్మణంలో కర్మ గురించి, కర్మఫలం గురించి చూశాము. ఇప్పుడు ఒక కర్మచేసే విధానాన్ని చూడబోతున్నాము. ఆ కర్మ పేరు శ్రీమంథకర్మ. ఈ కర్మకుడు ఒక ముద్దని తినాలి; దాన్ని మంథః అంటారు. ఈ ముద్దను ధాన్యాలు, పళ్ళు కలిపి చేస్తారు. అది కూడా ఎలా పడితే అలా చెయ్యకూడదు. దానికి ఒక పద్ధతి ఉంది. అది తినటానికి ఇంకొక పద్ధతి ఉంది.

ఈ కర్మలో రెండు అంశాలున్నాయి – మంథః అనే ఈ ముద్దను తినటం; శ్రీ ప్రాప్తికోసం తినటం. అంటే తినటం సాధన; ఐశ్వర్యం పొందటం సాధ్యం. ఈ రెండింటినీ సూచిస్తూ దీన్ని శ్రీమంథకర్మ అంటారు.

ఈ కర్మను నాలుగు దశల్లో చెయ్యాలి. ఇది వేదంలోని కర్మకాండ భాగంలో వస్తుంది. అవి – సంభారం, హోమం, ప్రాశనం, జపం.

మంత్రం 6.3.1

**స యః కామయేత మహత్ప్రాప్నుయామితి ॥ ఉదగయన ఆపూర్యమాణపక్షస్య పుణ్యాహే ద్వాదశాహముపసద్వ్రతీ భూత్వౌదుమ్బరే కగ్ంసే చమసే వా సర్వౌషధం ఫలానీతి సమ్భృత్య పరిసమూహ్య పరిలిప్యాగ్నిముపసమాధాయ పరిస్తీర్యావృతాఽఽజ్యగ్ం సగ్ంస్కృత్య పుగ్ంసా**

**నక్షత్రేణ మన్థగ్ం సంనీయ జుహోతి। యావన్తో దేవాస్త్వయి జాతవేదస్తిర్యంచో ఘ్నన్తి పురుషస్య కామాన్। తేభ్యోఽహం భాగధేయం జుహోమి తే మా తృప్తాస్సర్వైః కామైస్తర్పయన్తు స్వాహా। యా తిరశ్చీ నిపద్యతేఽహం విధరణీ ఇతి తాం త్వా ఘృతస్య ధారయా యజే సగ్ంరాధనీమహగ్ం స్వాహా ॥**

1. **సంభారమ్**

**ఉదగయన ఆపూర్యమాణపక్షస్య పుణ్యాహే ద్వాదశాహముపసద్ర్వతీ భూత్వా** – ఉత్తరాయణంలో శుక్లపక్షంలో, పుణ్యతిథి రోజు పాలను మాత్రమే ఆహారంగా తీసుకుని వ్రతాన్ని చేపట్టాలి.

ఎ) ఈ వ్రతం మొదలుపెట్టటానికే చాలా నియమాలు ఉన్నాయి. ఇది ఉత్తరాయణకాలంలో శుక్లపక్షంలో మొదలుపెట్టాలి. అది కూడా పుణ్యతిథి రోజు. అంటే తనకు అనుకూలమైన కర్మను సిద్ధింపజేసే తిథి ఉన్న రోజు. అది హస్త మొదలైన పురుషనామం కల నక్షత్రంతో కూడి ఉండాలి.

బి) ఒక పుణ్యతిథిని ఎన్నుకున్నాక, దానికంటే పన్నెండు రోజుల ముందునుంచే ఉపసద్ర్వతము చెయ్యాలి. అంటే పన్నెండు రోజులు పాలు మాత్రమే ఆహారంగా తీసుకోవాలి. 13వ రోజు వ్రతానికి ఎన్నుకున్న పుణ్యరోజు అయివుండాలి.

సి) యజ్ఞానికి కావాల్సిన వస్తువులను సమకూర్చుకోవాలి. ఔదుంబర వృక్షం, అంటే మేడిచెట్టుయొక్క కర్రతో చేసిన కంచంలో కాని, చమసపాత్రలో కాని ముద్దను తయారుచెయ్యాలి. అది మేడిచెట్టుయొక్క కర్రతోనే చెయ్యాలి.

డి) ముద్దను ఒక కవ్వంతో చిలకాలి. ఆ కవ్వాన్ని ఉపమంథాని అంటారు. ఇది కూడా మేడికర్రతోనే చెయ్యాలి.

ఇ) ఆహుతులను వేసే స్రువం కూడా మేడిచెట్టునుంచి చేసినదే అయి ఉండాలి.

ఎఫ్) అగ్నిలో వేసే సమిధలు కూడా మేడిచెట్టుకి చెందినవే అవ్వాలి. వీటిని ఇధ్మః అంటారు.

జి) పల్లెటూర్లలో దొరికే పది రకాల ధాన్యాలను అంటే గోధుమలు, బియ్యం, పప్పులు మొదలైనవాటిని; పల్లెటూర్లలో దొరికే పళ్ళను సమకూర్చుకోవాలి. పది అంటే పది ధాన్యాలు మాత్రమే కానవసరం లేదు. పది కన్నా ఎక్కువ కూడా ధాన్యాలు కలుపుకోవచ్చు.

హెచ్) దానికి వాడే నెయ్యిని కూడా స్థాలీపాక పద్ధతిలోనే సంస్కరించాలి. దాని వివరం ఇక్కడ ఇవ్వలేదు. అది చేసేవారికి తెలుస్తుంది.

ఐ) హోమకుండం దగ్గర ఏర్పాట్లు చెయ్యాలి. హోమకుండాన్ని స్థాపించేటప్పుడు కూడా కొన్ని మంత్రాలను పఠించాలి. ఒక ప్రత్యేకమైన చీపురుతో ఊడవాలి. హోమకుండానికి నాలుగు దిక్కులా మంత్రాలను చదువుతూ ధర్భలను పరవాలి. ఆ మంత్రాలు కూడా ఇక్కడ చెప్పలేదు.

జె) తర్వాత అగ్నిని వెలిగించాలి. దాన్ని అగ్ని ఉపసమధనం అంటారు. అగ్నులు ఐదు రకాలు ఉంటాయి. **ఈ కర్మకు చేసే అగ్నిని అవసద్యాగ్ని అంటారు.**

ఈ ఏర్పాట్లన్నీ చేసి, యజ్ఞం చేస్తే, అతనికి కలిగే ఫలం మహత్వం. ఇక్కడ మహత్వం అంటే ఐశ్వర్యం పొందుతాడు.

### మంత్రం 6.3.2

**జ్యేష్ఠాయ స్వాహా శ్రేష్ఠాయ స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థేసగ్ంస్రవమవనయతి ప్రాణాయ స్వాహా వసిష్ఠాయై స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి వాచే స్వాహా ప్రతిష్ఠాయై స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి చక్షుషే స్వాహా సమ్పదే స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి శ్రోత్రాయ స్వాహా‌ఽఽయతనాయ స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవ మవనయతి మనసే స్వాహా ప్రజాత్యై స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి ॥ రేతసే స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి ॥**

2. **హోమమ్**

హోమకుండంలో ఉన్న అగ్నిలో ఆజ్యం పొయ్యాలి. అది కూడా మంత్రాలు పఠిస్తూ చెయ్యాలి. ఈ కర్మ తనకు ఐశ్వర్యం పొందకుండా అడ్డుపడుతున్న దేవతలను శాంతి పరచటానికి చేస్తాడు. వారిని శాంతిపరచమని అగ్నిదేవతను వేడుకుంటాడు. వారు నామాట వినరు కాని నీ అధీనంలో ఉన్నారు, నువ్వు వారిని శాంతిపరుచు అంటాడు. అంతేకాదు, నేను ఆహుతులనిచ్చి వారిని తృప్తి పరుస్తాను; వారు నాకు నా కోరికలు తీర్చి తృప్తి పరచుదురు గాక. ఆ అడ్డుపడే దేవతలను తిర్యక్ దేవతలు అంటారు.

ఇక్కడ మరికొన్ని ఆహుతులను చూస్తాము.

**జ్యేష్ఠాయ స్వాహా శ్రేష్ఠాయ స్వాహా** – జ్యేష్ఠాయ స్వాహా శ్రేష్ఠాయ స్వాహా అని ఆరంభించి రెండేసి చొప్పున ఆహుతులను హోమంలో వేసి, స్రువంలో మిగిలివున్న నేతిని మంథంమీద వెయ్యాలి. ఇలా చెయ్యటాన్ని **సంస్రవ అవనయనం** అంటారు. నెయ్యిని మంథముమీద రాల్చటం అనుకోకుండా చేసేది కాదు; అది హోమం చేసే తతంగంలో ఒక భాగం.

ఈ ఆహుతులు ప్రాణానికి వచ్చిన ఏడు గుణాలమీద వేస్తున్నాడు. అవి జ్యేష్ఠత్వం, శ్రేష్ఠత్వం, వసిష్ఠత్వం, ప్రతిష్ఠత్వం, సంపదత్వం, ఆయతనత్వం, ప్రజనత్వం. శంకరులవారు ఈ గుణాలు ప్రాణానికి చెందినవి కాబట్టి, ప్రాణదేవతను ఉపాసన చేసిన వ్యక్తి మాత్రమే చెయ్యాలన్నారు. చివరి ఆహుతి రేతసేస్వాహా. ఇంతవరకూ రెండేసి చొప్పున ఆహుతులని వేసి, మిగిలిన నేతిని తన ముందు ఉంచుకున్న మంథముమీద వెయ్యాలి.

### మంత్రం 6.3.3

**అగ్నయే స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి సోమాయ స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి భూస్స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి భువస్స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి స్వస్స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి భూర్భువస్స్వస్స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి బ్రహ్మణేస్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి క్షత్త్రాయ స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి భూతాయ స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి భవిష్యతే స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి విశ్వాయ స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి సర్వాయ స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి ప్రజాపతయే స్వాహేత్యగ్నౌ హుత్వా మన్థే సగ్ంస్రవమవనయతి ॥**

మరికొన్ని ఆహుతులను చూస్తాము. ఇప్పుడు ఒక్కొక్కటే వెయ్యాలి.

**అగ్నయే స్వాహేత్యగ్నౌ హుత్వా మంథే సగ్ంస్రవమవనయతి** – అగ్నయే స్వాహా అని అగ్నిలో ఆహుతి వేసి, స్రువంలో మిగిలివున్న నేతిని మంథముమీద వెయ్యాలి. ఎవరెవరికో పేర్లు మాత్రం చూద్దాము. అవి వరుసగా సోమదేవత, భూ, భువ, సువర్లోకాలు; బ్రాహ్మణుడు, క్షత్రియుడు; భూతకాలము, భవిష్యత్కాలము, విశ్వం, సర్వం, ప్రజాపతి. ప్రజాపతి అంటే హిరణ్యగర్భ. ఆ విధంగా విశ్వానికీ, కాలానికీ, హిరణ్యగర్భకూ అందరికీ ఆహుతులు అర్పిస్తాడు.

ఇక్కడితో రెండవ భాగం అయిన హోమం అయిపోయింది. ఇప్పుడు మూడవ భాగం అయిన ప్రాశనం చూడబోతున్నాము. ప్రాశనం అంటే ఆ మంథాన్ని తినే విధానం.

### మంత్రం 6.3.4

**అథైనమభిమృశతి భ్రమదసి జ్వలదసి పూర్ణమసి ప్రస్తబ్ధమస్యేకసభమసి హింకృతమసి హింక్రియమాణమస్యుద్గీథమస్యుద్గీయమానమసి శ్రావితమసి ప్రత్యాశ్రావితమస్యార్ద్రే సందీప్తమసి విభూరసి ప్రభూరస్యన్నమసి జ్యోతిరసి నిధనమసి సంవర్గోఽసీతి ॥**

3. ప్రాశనమ్

దీన్ని మంథ ఆచమనం అని కూడా అంటారు. ఇక్కడ ఆచమనం అంటే తినటం. అది కూడా హడావుడిగా తినకూడదు. భరతనాట్యంలో నడవటం, నమస్కారం పెట్టడంలో కూడా పద్ధతులు ఉన్నట్టే, ఈ మంథ ఆచమనంలో కూడా ఒక పద్ధతి ఉంది. దీనిలో మళ్ళీ మూడు దశలు ఉన్నాయి. అవి –

**అభిమర్శనమ్, ఉద్యమనమ్, ప్రాశనమ్.** అంటే ఆ మంథాన్ని స్పృశించటం, నాలుగు భాగాలుగా చెయ్యటం, తినటం. కాని ఈ మూడు దశలు పాటించేముందు ఈ మంథాన్ని ముద్దగా తయారు చేసుకోవాలి.

పది ధాన్యాలు, పళ్ళతో కూడిన ఆ పిష్టాన్ని మేడికర్రతో చేసిన పాత్రలో పెట్టి, హోమం చేసినప్పుడు నెయ్యి చుక్కలు వాటిమీద వేస్తాడు కదా, దాన్ని కవ్వంతో చిలికి ముద్దగా చెయ్యాలి. చేత్తో కలపకూడదు. అలా కలపకపోతే నెయ్యి పైనే ఉండిపోతుంది. ఇప్పుడు మూడు దశల వారీగా దానిని తినాలి.

ఎ) **అభిమర్షణమ్**

**అథైనమభిమృశతి భ్రమదసి జ్వలదసి పూర్ణమసి** – తర్వాత ఈ మంథాన్ని భ్రమదసి, జ్వలదసి, పూర్ణమసి మంత్రం చదువుతూ స్పృశించాలి. ఈ కర్మ చేసే వ్యక్తి హిరణ్యగర్భ ఉపాసకుడు కాబట్టి, ఆ చిన్న ముద్దమీద హిరణ్యగర్భను ఆవాహన చేస్తున్నాడు. సంధ్యావందనంలో చిన్న చెంచాడు నీటిలో ఈశ్వరుణ్ణి ఆవాహన చేసినట్టుగా, ఇప్పుడు ఈ చిన్న మంథంలో సర్వాత్మతత్త్వాన్ని చూడాలి. అందువల్ల ఆ మంథాన్ని స్పృశిస్తూ, దాన్ని ఉద్దేశించి స్తుతిస్తున్నాడు.

**భ్రమదసి** – నువ్వు వాయురూపంలో అంతటా తిరుగుతున్నావు.

**జ్వలదసి** – అగ్నిరూపంలో ప్రజ్వలిస్తున్నావు.

**పూర్ణమసి** – సర్వాత్ముడవు. మంథం పూర్ణం కాదు; మంథరూపంలో హిరణ్యగర్భ పూర్ణం. హిరణ్యగర్భ అంటే సమష్టి సూక్ష్మప్రపంచ అధిష్ఠానదేవత.

**ప్రస్తబ్ధమస్యేకసభమసి** – ఆకాశం లాగా చలనం లేదు; ఏకసభవు. అంటే విశాలమైన జగత్తు నీలో ఇమిడివుంది. అంటే నువ్వు విశ్వాధారుడవు.

**హింకృతమసి హింక్రియమాణమసి** – హింకారం అంటే యాగంలో సామవేది పాడే మంత్రం. అది హిమ్ అనే ధ్వనిలా వస్తుంది. అంటే సామవేదం నువ్వే.

**ఉద్గీథమస్యుద్గీయమానమసి** – ఓంకారాన్ని సామవేదంలో ఎలుగెత్తి గానం చేస్తారు. దాన్ని ఉద్గీథ అంటారు. నువ్వు ఓంకారానివి.

**శ్రావితమసి ప్రత్యాశ్రావితమసి** – యజుర్వేద ఋత్విక్కులు పఠించే మంత్రానివి నువ్వే. ఈ పదాలను తైత్తిరీయంలో కూడా చూస్తాము. ఇవన్నీ సాంకేతిక పదాలు. నిజానికి యజుర్వేద ఋత్విక్కు, యజ్ఞాన్ని మొదలుపెట్టేముందు అనుమతి కోరుతూ అడిగే మంత్రం ఇది. అనుమతి కోరటాన్ని శ్రావితం అనీ; బ్రహ్మ అనుమతి ఇవ్వటాన్ని ప్రత్యాశ్రావితమనీ అంటారు.

**ఆర్ద్రే సందీప్తమసి** – తడిగా ఉన్న మేఘంలో గొప్పగా ప్రకాశించేది నువ్వే.

**విభూరసి** – అనేక రూపాలు ఉన్నాయి నీకు;

**ప్రభూరసి** – నువ్వు సమర్థుడవు;

**అన్నమసి** – అన్నానివి నువ్వే. అన్నం అంటే భోగ్య ప్రపంచం. మొత్తం భోగ్యప్రపంచానివి నువ్వే.

**జ్యోతిరసి** – చైతన్య స్వరూపం నువ్వే. అంటే భోక్తృ ప్రపంచానివి కూడా నువ్వే. **నిధనమసి సంవర్గో౽సీతి** – నువ్వే లయస్థానం కూడా. అన్నీ నీలోనే లయమవుతాయి.

ఒక్కముక్కలో చెప్పాలంటే నువ్వు సర్వాత్ముడవు. నువ్వు విశ్వరూపానివి లేదా సమష్టి రూపానివి. ఇది దేనికి చెప్పాలి?

**ఏనమ్ అభిమృశతి** – ఆ మంథాన్ని ముట్టుకుని చెప్పాలి. దీనితో మొదటి దశ ముగిసింది.

## మంత్రం 6.3.5

**అథైనముద్యచ్ఛత్యామగ్ంస్యామగ్ం హి తే మహి స హి రాజేశానోఽ ధిపతిస్సమాగ్ం రాజేశానోఽ ధిపతిం కరోత్వితి ॥**

బి) **ఉద్యమనమ్**

**అథ ఏనమ్ ఉద్యచ్ఛతి** – ఈ మంథం ఉన్న చమసపాత్రను ఎత్తి పట్టుకుని మళ్ళీ ప్రాణతత్త్వాన్ని కీర్తించాలి. ఇదంతా వేదభాషలో ఉంది.

**ఆమంసి** – అంటే జానాసి అంటే నీకు అంతా తెలుసు. నువ్వు సర్వజ్ఞుడవు.

**తే మహి ఆమంసి** – నీ గొప్పతనం మాకు తెలుసు. ఏమిటి నీ గొప్పతనం?

**స హి రాజా ఈశానః అధిపతిః** – నువ్వు ఈ జగత్తుకు రాజువు, అధిపతివి. తర్వాత అతను కోరిక కోరుతాడు. సర్వశక్తిమంతుడే కోరికలను తీర్చగలడు. అందువల్ల ముందు హిరణ్యగర్భను స్తుతించి తను కోరుతున్నాడు.

**మాగ్ం రాజేశానోఽ ధిపతిం కరోత్వితి** – నన్ను కూడా రాజుగా, అధిపతిగా చెయ్యి.

ఇప్పుడు ఆ మంథాన్ని నాలుగు ముద్దలుగా చెయ్యాలి. ఆ మంథాన్ని చేసేటప్పుడే ఎంత చెయ్యాలో అవగాహన ఉండాలి. నాలుగు ముద్దలను, ఒక్కొక్క ముద్దగా మొత్తం నోట్లో పెట్టేసుకునేటంత చెయ్యాలి. తర్వాత ఈ క్రింది మంత్రాలు పఠిస్తూ వాటిని తినాలి.

## మంత్రం 6.3.6

**అథైనమాచామతి తత్సవితుర్వరేణ్యమ్ । మధు వాతా ఋతాయతే మధు క్షరన్తి సిన్ధవః। మాధ్వీర్నస్సన్త్వోషధీః । భూస్స్వాహా । భర్గో దేవస్య ధీమహి । మధు నక్తముతోషసో మధుమత్పార్థివగ్ం రజః । మధు ద్యౌరస్తు నః పితా । భువస్స్వాహా । ధియో యో నః ప్రచోదయాత్ । మధుమాన్నో వనస్పతిర్మధుమాగ్ం అస్తు సూర్యః । మాధ్వీర్గావో భవన్తు నః । స్వస్స్వాహేతి । సర్వాం చ సావిత్రీమన్వాహ సర్వాశ్చ మధుమతీరహమేవేదగ్ం సర్వం భూయాసం భూర్భువస్స్వస్స్వాహేత్యన్తత ఆచమ్య పాణీ ప్రక్షాల్య జఘనేనాగ్నిం ప్రాక్శిరాస్సంవిశతి ప్రాతరాదిత్యముపతిష్ఠతే దిశామేకపుణ్డరీకమస్యహం మనుష్యాణామేకపుణ్డరీకం భూయాసమితి యథేతమేత్య జఘనేనాగ్నిమాసీనో వగ్ంశం జపతి ॥**

సి) **ప్రాశనమ్** – ఇప్పుడు తినే ప్రక్రియ వస్తుంది. మంథాన్ని తినేటప్పుడు ఈ మంత్రాలను పఠించాలి. నాలుగు మంత్రాలున్నాయి. వాటి చివర స్వాహా అని వస్తుంది. అవి గాయత్రీమంత్రంయొక్క మూడు పాదాలు, చివరగా మూడూ కలిపిన మంత్రం. ప్రతిపాదంతో పాటు మధుమంత్రం కూడా జపించాలి. మధు అంటే తియ్యగా, అందంగా, మంగళకరంగా ఉండేది.

**మొదటి ముద్ద తినేముందు–**

**అథైనమాచామతి తత్సవితుర్వరేణ్యమ్** – గాయత్రీ మంత్రంలోని మొదటి పాదం తత్సవితుర్వరేణ్యమ్. అది జపిస్తూ మొదటి ముద్దను తీసుకోవాలి. దీని అర్థం సర్వప్రాణులకూ జన్మనిచ్చే ఆ సూర్యదేవతయొక్క సర్వోత్కృష్టమైన తేజస్సును మేము ధ్యానిస్తున్నాము.

**మధు వాతా ఋతాయతే మధు క్షరంతి సింధవః మాధ్వీర్నస్సంత్వోషధీః భూస్స్వాహా** – గాయత్రీ మంత్రంతో పాటు మధుమంత్రం కూడా జపించాలి. ఈ మధుమంత్రంద్వారా నా చుట్టూ ఉన్నది పవిత్రంగా, మంగళకరంగా, ఆనందాన్ని ఇచ్చేదిగా ఉండుగాక. వాతావరణం మంగళకరంగా, నీరు పవిత్రగంగాజలంలా, మనుష్యులు ఆనంద ప్రదాతలుగా ఉండుగాక. ఇటువంటి మంచి ఆలోచనలతో మనం పొద్దున్న లేస్తే ఎంత బాగుంటుంది. భూః స్వాహా అంటే ఇది మొదటి వ్యాహృతి మంత్రం. ఇక్కడిదాకా చెప్పి మొదటి ముద్దను తీసుకోవాలి.

**రెండవ ముద్ద తినేముందు–**

**భర్గో దేవస్య ధీమహి మధు నక్తముతోషసో మధుమత్పార్థివగ్ం రజః మధు ద్యౌరస్తు నః పితా భువస్స్వాహా** – గాయత్రీ మంత్రంలోని రెండవ పాదం భర్గో దేవస్య ధీమహి. తర్వాత మధుమంత్రం కొనసాగుతున్నది. రాత్రీ పగళ్ళు పవిత్రంగా, మంగళకరంగా, ఆనందప్రదాతలుగా ఉండుగాక. నిజానికి జీవితం అంటే ఏమిటి; రాత్రీ, పగలు. రెండూ బాగుండాలి అని అంటే మొత్తం జీవితం బాగుండాలి.

భూలోకం ప్రీతికరమగు గాక! ఆకాశం ప్రీతికరమగుగాక! శాస్త్రంలో భూమిని తల్లిగానూ, ఆకాశాన్ని తండ్రిగానూ అభివర్ణిస్తారు. రెండవ వ్యాహృతి భువః స్వాహా అని చెప్పి రెండవ ముద్ద తీసుకోవాలి.

**మూడవ ముద్ద తినేముందు–**

**ధియో యో నః ప్రచోదయాత్ మధుమాన్నో వనస్పతిర్మధుమాగ్ం అస్తు సూర్యః మాధ్వీర్గావో భవంతు నః స్వస్స్వాహేతి**– గాయత్రీ మంత్రంలోని మూడవ పాదం – ధియో యో నః ప్రచోదయాత్. సూర్యభగవానుడు నా మేధాశక్తిని పెంపొందించు గాక. తర్వాత మధుమంత్రం కొనసాగుతున్నది.

సోమతీగను తీగల్లోకెల్లా రాజుగా వర్ణిస్తారు. ఎందుకు? ఎందుకంటే చాలా గొప్ప సోమయాగంలో ఈ సోమతీగనుంచి తీసిన సోమరసాన్ని వాడతారు. అందువల్ల దీనిని వనస్పతి అంటారు. అందువల్ల ఈ వనస్పతి నాకు మంగళకరమగు గాక! సూర్యుడు నాకు మంగళకరమగు గాక. సూర్యుడు ఎండాకాలంలో గీష్మతాపం చూపిస్తాడని సూర్యుణ్ణి ద్వేషించకూడదు. ఆయన చాలా ముఖ్యం. తర్వాత ఏనుగులు, ఆవులులాంటి

జంతువులు కూడా మాకు సుఖకరము అగుగాక. తర్వాత మూడవ వ్యాహృతి సువః స్వాహా అని చెప్పి మూడవ ముద్ద తీసుకోవాలి.

**నాలుగవ ముద్ద తినేముందు–**

**సర్వాం చ సావిత్రీమన్వాహ సర్వాశ్చ మధుమతీరహమేవేదగ్ం సర్వం భూయాసం భూర్భువస్స్వస్స్వాహేత్యంతత ఆచమ్య** – గాయత్రీ మంత్రంయొక్క మూడు పాదాలూ అయిపోయాయి కదా, దీనికేమిటి పఠించాలి? మొత్తం గాయత్రీ మంత్రాన్ని పఠించి, మొత్తం మధుమంత్రాన్ని పఠించి, మూడు వ్యాహృతులనూ పఠించాలి.

ఇది చెప్పేటప్పుడు ప్రత్యేకమైన ప్రార్థన చేస్తాడు. అది చాలా ముఖ్యం. అది – **అహం ఏవ ఇదం సర్వం భూయాసమ్** – నేనే అంతా అగుదును గాక. అంటే నేను సమష్టి హిరణ్యగర్భతో ఐక్యప్రాప్తి పొందుదును గాక అని ఈ ప్రార్థన. మొదటి పాదంలో స్థూలప్రపంచంతో ఐక్యం; రెండవ పాదంలో సూక్ష్మప్రపంచంతో ఐక్యం; మూడవ పాదంలో కారణప్రపంచంతో ఐక్యం; చివరి పాదానికి వచ్చేసరికి అహం బ్రహ్మ అస్మి అని ఊహించుకో గలగాలి. దీన్ని ఊహించుకోవటానికి కర్మకాండంలో అహం ఏవ ఇదం సర్వం అని ప్రార్థన వస్తుంది. మూడు వ్యాహృతులూ అయిన భూః భువః సువః అని చెప్పి ఆఖరి ముద్ద తీసుకోవాలి. దీనితో ప్రాశనం భాగం అయిపోయింది. ఇక్కడ్నుంచి యజ్ఞాన్ని ముగించే విధానం చెప్పబడింది.

**4 జపమ్**

**పాణీ ప్రక్షాల్య జఘనేనాగ్నిం ప్రాక్శిరాస్సంవిశతి** – చేతులను కడుగుకొని, నీటిని త్రాగి, హోమకుండానికి పశ్చిమ దిక్కుకి వచ్చి, తూర్పువైపు తిరిగి కూర్చోవాలి. ఆ అగ్నికుండం దగ్గరే రోజంతా గడపాలి. బయటకు వెళ్ళకూడదు. రాత్రి అక్కడే తల తూర్పువైపు పెట్టుకుని పడుకోవాలి.

**ప్రాతరాదిత్యముపతిష్ఠతే** – మర్నాడు పొద్దున్న నిద్రలేచాక, సంధ్యావందనంతో పాటు ప్రత్యేకమైన పూజను ఈ విధంగా చెయ్యాలి.

**దిశామేకపుండరీకమస్యహం మనుష్యాణామేకపుండరీకం భూయాసమితి** – నువ్వు అన్ని దిక్కులలో ఉన్న ఒకే ఒక పుండరీకానివి. పుండరీకం అంటే తెల్లకలువపువ్వు. దిక్కులను నీటిగానూ, నక్షత్రాలను పువ్వులుగానూ ఊహించుకోవాలి. ఓ ఆదిత్యా, నీటిలో ఉన్న పువ్వులలాంటి నక్షత్రాలకన్నా మిలమిల మెరిసే కలువపువ్వులాంటివాడివి నువ్వు. కలువపువ్వు తెలుపు, సూర్యుడు కూడా తెలుపు.

అంతేకాదు నేను కూడా మనుష్యులందరిలోకి ఒకే ఒక పుండరీకం అవుదును గాక. అంటే నేను చక్రవర్తి అంత గొప్పవాణ్ణి, అంత ఐశ్వర్యవంతుడిని అవుగాక. ఇలా మర్నాడు ఉదయం చేసే ఈ ప్రార్థన నాలుగవ దశ.

**యథేతమేత్య జఘనేనాగ్నిమాసీనో వగ్ంశం జపతి** – వెళ్ళిన దారిన వెనక్కివచ్చి, పశ్చిమదిక్కులో నిల్చుని, వంశ జపం చెయ్యాలి. ఇక్కడ వంశం అంటే గురు పరంపరను సూచిస్తుంది. ఈ యజ్ఞం చేయించిన గురువుల పేర్లు, దాని ఫలం కూడా వస్తుంది.

మంత్రం 6.3.7

**తగ్ం హైతముద్దాలక ఆరుణిర్వాజసనేయాయ యాజ్ఞ్యవల్క్యాయాన్తేవాసిన ఉక్త్వోవాచాపి య ఏనగ్ం శుష్కే స్థాణౌ నిషిఞ్చేజ్జాయేరన్ శాఖాః ప్రరోహేయుః పలాశానీతి ॥**

మంత్రం 6.3.8

**ఏతము హైవ వాజసనేయో యాజ్ఞవల్క్యో మధుకాయ పైఙ్గ్యాయాన్తేవాసిన ఉక్త్వోవాచాపి య ఏనగ్ం శుష్కే స్థాణౌ నిషిఞ్చేజ్జాయేరన్ శాఖాః ప్రరోహేయుః పలాశానీతి ॥**

మంత్రం 6.3.9

**ఏతము హైవ మధుకః పైఙ్గ్యశ్చూలాయ భాగవిత్తయేఽన్తేవాసిన ఉక్త్వోవాచాపి య ఏనగ్ం శుష్కే స్థాణౌ నిషిఞ్చేజ్జాయేరన్ శాఖాః ప్రరోహేయుః పలాశానీతి ॥**

మంత్రం 6.3.10

**ఏతము హైవ చూలో భాగవిత్తిర్జానకయ ఆయస్థూణాయాన్తేవాసిన ఉక్త్వోవాచాపి య ఏనగ్ం శుష్కే స్థాణౌ నిషిఞ్చేజ్జాయేరన్ శాఖాః ప్రరోహేయుః పలాశానీతి ॥**

మంత్రం 6.3.11

**ఏతము హైవ జానకిరాయస్థూణస్సత్యకామాయ జాబాలాయాన్తేవాసిన ఉక్త్వోవాచాపి య ఏనగ్ం శుష్కే స్థాణౌ నిషిఞ్చేజ్జాయేరన్ శాఖాః ప్రరోహేయుః పలాశానీతి ॥**

మంత్రం 6.3.12

**ఏతముహైవ సత్యకామో జాబాలోఽన్తేవాసిభ్య ఉక్త్వోవాచ । అపి య ఏనగ్ం శుష్కే స్థాణౌ నిషిఞ్చేజ్జాయేరన్ శాఖాః ప్రరోహేయుః పలాశానీతి తమేతం నాపుత్రాయ వాఽనన్తేవాసినే వా బ్రూయాత్॥**

ఈ మంత్రాల్లో శ్రీమంథకర్మ గురు పరంపరను చూస్తాము. అంతేకాదు, ఈ కర్మయొక్క మహిమను కూడా చూస్తాము. అన్ని మంత్రాల్లోనూ మహిమ ఒకటే. ముందు మహిమను చూద్దాము.

**య ఏనగ్ం శుష్కే స్థాణౌ నిషించేజ్జాయేరన్ శాఖాః ప్రరోహేయుః పలాశానీతి** – ఎవరైనా ఈ మంథాన్ని ఎండిపోయిన మోడుపై చల్లితే, కొమ్మలు మొలుస్తాయి, ఆకులు తొడుగుతాయి.

ఈ మంథం పది ధాన్యాలతోనూ, తేనెలాంటి వాటితోనూ పైన చిలకరించబడిన నెయ్యితోనూ చెయ్యబడిందని, దానిమీద హిరణ్యగర్భను ఆవాహన చేయాలనీ చూశాము. అంటే దీనిలో ప్రాణతత్త్వం మెండుగా ఉంటుంది. అందువల్ల మోడువారిన చెట్టు ఏదైనా మళ్ళీ ప్రాణం పోసుకోవాలనుకుంటే ఈ మంథాన్ని చెట్టు మొదట్లో

పెడితేనో, మోడుపై చల్లితేనో, ఆ చెట్టు మెల్లగా మళ్ళీ చిగురిస్తుంది. ఆ ఆకులను పలాశా అంటారు. అంటే ఈ మంథంలో ప్రాణతత్త్వం మెండుగా ఉందని అర్థం. ఈ ఫలం 7-12 వరకూ అన్ని మంత్రాల్లోనూ చూస్తాము. వాటిలో వచ్చే గురుపరంపర మాత్రం మారుతుంది.

ఈ మంథకర్మను బోధించిన గురు పరంపర -

7 - ఆరుణి తన శిష్యుడైన వాజసనేయ యాజ్ఞవల్క్యునికి చెప్పాడు.

8 - వాజసనేయ యాజ్ఞవల్క్యుడు తన శిష్యుడైన పైంగి మధుకునికి చెప్పాడు.

9 - పైంగి మధుకుడు తన శిష్యుడైన చూలభాగవిత్తికి చెప్పాడు.

10 - చూలభాగవిత్తి తన శిష్యుడైన జానకి ఆయస్థూణునికి చెప్పాడు.

11 - జానకి ఆయస్థూణుడు తన శిష్యుడైన సత్యకామ జాబాలునికి చెప్పాడు.

12 - సత్యకామ జాబాలుడు తన శిష్యులకు చెప్పాడు.

(సత్యకామ జాబాల శిష్యులు ఎక్కువ ఉండటంవల్ల వారి పేర్లు చెప్పలేదు)

**తమేతం నాపుత్రాయ వాఽనంతేవాసినే వా బ్రూయాత్** - ఈ సందర్భంలో ఒక నియమాన్ని కూడా సూచిస్తున్నది ఉపనిషత్తు. ఈ మంథకర్మను పుత్రుడు కానివానికి, శిష్యుడు కానివానికి ఉపదేశించకూడదు.

మంత్రం 6.3.13

**చతురౌదుమ్బరో భవత్యౌదుమ్బరస్స్రువ ఔదుమ్బరశ్చమస ఔదుమ్బర ఇధ్మ ఔదుమ్బర్యా ఉపమన్థన్యౌ దశ గ్రామ్యాణి ధాన్యాని భవన్తి ॥ వ్రీహియవాస్తిలమాషా అణుప్రియఙ్గవో గోధూమాశ్చ మసూరాశ్చ ఖల్వాశ్చ ఖలకులాశ్చ తాన్ పిష్టాన్ దధని మధుని ఘృత ఉపసిఞ్చత్యాజ్యస్య జుహోతి ॥**

నిజానికి ఈ మంత్రం ఈ బ్రాహ్మణం మొదట్లో రావాల్సింది.

**చతురౌదుంబరో భవతి** - నాలుగు వస్తువులు మేడికర్రతో చెయ్యాలి. అవి -

**ఔదుంబరస్స్రువ ఔదుంబరశ్చమస ఔదుంబర ఇధ్మ ఔదుంబర్యా ఉపమంథన్యౌః** - స్రువము, చమసపాత్ర, సమిధ, కవ్వము. ఈ కవ్వాలు రెండు ఉండాలి. ఒకటి మొదట్లో ముద్ద చెయ్యటానికి, రెండవది యజ్ఞం అయ్యాక, దానిమీద చిలకరించిన నెయ్యిని కలపటానికి. మొదట వాడిన కవ్వం మళ్ళీ వాడకూడదు.

ఎందుకు రెండు కవ్వాలు అని ప్రశ్నించకూడదు. కర్మకాండలో ప్రశ్నలు అడగకూడదు. ఎందుకంటే జవాబు ఉండదు. శాస్త్రం చెప్పిందంటే చేసితీరాలి. వేదవాక్కు అంటారు అందుకే. వచనాత్ ప్రవృత్తిః వచనాత్ నివృత్తిః. వేదం చెప్పింది కాబట్టి మేడికర్రను వాడాలి. వేదం చెప్పలేదు కాబట్టి మామిడికొమ్మను వాడకూడదు.

**దశ గ్రామ్యాణి ధాన్యాని భవంతి** - పదిరకాల ధాన్యాలు వాడాలి. అవి కూడా పల్లెలలో పండించినవై ఉండాలి. వాటి పేర్లు కూడా ఇచ్చింది ఉపనిషత్తు.

**వ్రీహియవాస్తిలమాషా అణుప్రియంగవో గోధూమాశ్చ మసూరాశ్చ ఖల్వాశ్చ ఖలకులాశ్చ** - అవి వడ్లు, బార్లీ, నువ్వులు, మినుములు, చిరువడ్లు, కొర్రలు, గోధుమలు, ఉలవలు, అనుములు, ఖలకులములనే ధాన్యాలు.

అంతకన్నా ఎక్కువ వేసుకోవచ్చు కాని తక్కువ వాడకూడదని శంకరులవారు చెబుతున్నారు. పండ్లు కూడా కలుపుకోవాలి. ఇక్కడ చెప్పలేదు కాని అది మొదటి మంత్రంలో వచ్చింది.

**తాన్ పిష్టాన్ దధని మధుని ఘృత ఉపసించత్యాజ్యస్య జుహోతి** – వాటి పిండిని పెరుగుతో, తేనెతో, నేతితో తడిపి ముద్ద చెయ్యాలి. అజ్యస్య జుహోతి అంటే ముందు చూసినట్టుగా యజ్ఞంలో వేసిన నెయ్యి చుక్కలు దానిమీద వేసి, మళ్ళీ చివర్లో కలపాలి.

అలా ఈ యజ్ఞం చేస్తే ధనప్రాప్తి, ఐశ్వర్యప్రాప్తి కలుగుతుంది.

ధనం దానార్థమ్; దానం కర్మార్థమ్; కర్మ చిత్తశుద్ధ్యర్థమ్; చిత్తశుద్ధి జ్ఞానార్థమ్; జ్ఞానం మోక్షార్థమ్.

ఈ బ్రాహ్మణము శ్రీని ఇచ్చే మంథకర్మ గురించి చెబుతుంది కాబట్టి ఈ బ్రాహ్మణాన్ని శ్రీమంథ బ్రాహ్మణము అంటారు.

# 6.4 – పుత్రమంథ బ్రాహ్మణము

ఈ బ్రాహ్మణము గృహస్థాశ్రమధర్మాల గురించి చెబుతుంది. మన వేదాలు సన్న్యాసాశ్రమంలాగానే గృహస్థాశ్రమం పవిత్రమైనది అని ఘోషిస్తాయి. మూడు, నాలుగు అధ్యాయాల్లో సన్న్యాసాశ్రమాన్ని స్తుతించింది. ఇక్కడ గృహస్థాశ్రమాన్ని స్తుతిస్తున్నది.

ఎందుకు గృహస్థాశ్రమాన్ని స్తుతిస్తున్నది?

1. **అర్హత –** 95 శాతం వైదికకర్మలు చెయ్యటానికి గృహస్థు మాత్రమే అర్హుడు. ఈ వైదిక కర్మలు అతనికి ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడతాయి. కర్మను సాంకేతికపదంలో చెపితే, పాంక్తం అంటారు. పాంక్తం అంటే ఐదు అంశాలతో కూడినది. అవి – యజమాని, పత్ని, పుత్రుడు, దైవవిత్తం, మానుషవిత్తం. అంటే ఈ ఐదు అంశాల్లో పత్ని ఒక ముఖ్యమైన అంశం. గృహస్థుకే పత్ని ఉంటుంది. వానప్రస్థంలో ఉన్నా అది లెక్కలోకి రాదు.

2. **సమాజ పోషణ –** గృహస్థు ఒక్కడే సమాజం మధ్యలో ఉండి, సమాజ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొంటాడు. బ్రహ్మచారి గురుకులంలో ఉంటాడు; వానప్రస్థి అరణ్యంలో ఉంటాడు; సన్న్యాసి ఒంటరిగా ఉంటాడు. అంటే ఈ ముగ్గురికీ సమాజంతో అనుబంధం లేదు. గృహస్థు మాత్రమే వర్ణాశ్రమధర్మాలను పాటించాలి.

అంతేకాదు, అతను తక్కిన మూడు ఆశ్రమాలకు చెందినవారినీ పోషించాలి. వారు భిక్షాటన చేసి జీవించాలి. గృహస్థే వారికి భిక్ష వెయ్యాలి.

3. **సంతానోత్పత్తి –** గృహస్థు ఒక్కడే రాబోయే తరాన్ని ఉత్పత్తి చెయ్యగలడు. పుత్రులకు జన్మనివ్వటమే కాక, వారి సంస్కారాన్ని కూడా పెంపొందించాలి.

ఈ అంశాన్ని మరికాస్త విశ్లేషిద్దాము. గృహస్థు మాత్రమే పుత్రులను కని, వారి సంస్కారాన్ని కూడా పెంపొందించాలి అన్నాము కదా. ఇలా ఎందుకన్నాము అంటే దీనికి కొంత శాస్త్రం గురించిన అవగాహన ఉండాలి. మనిషిగా పుట్టిన ప్రతివ్యక్తీ కూడా ఆధ్యాత్మిక చింతన పెంచుకుని, ఆధ్యాత్మికంగా ఎదగాలి. పుట్టటం, శారీరకంగా ఎదగటం, మన ప్రమేయం లేకుండానే అవుతుంది.

జ్ఞానపరంగా ఎదగటానికి పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు తోడ్పడతాయి. ఆధ్యాత్మికంగా ఎదగటానికి శాస్త్రం 40 సంస్కారాలను ఆదేశించింది. వాటిని పుట్టినప్పటినుంచి మరణించేలోపు పాటించాలి. అవి దోష అపనయనం, గుణ ఆధానం చేస్తాయి.

దోష అపనయనం అంటే ఆధ్యాత్మిక ఎదుగుదలకు అడ్డువచ్చే ఆటంకాలను తొలగించటం. గుణ ఆధానం అంటే ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడే మంచి గుణాలను పెంపొందించుకోవటం. భగవద్గీత భాషలో చెప్పాలంటే ఆసురీ సంపత్తిని తొలగించుకుని, దైవీసంపత్తిని పెంపొందించుకోవటం. వీటినే సంస్కారాలు అంటారు. వాటిని పెంపొందించుకున్న వ్యక్తి ఆధ్యాత్మికంగా ఎదుగుతాడు.

ఎవరైనా ఒక చిత్రం గీస్తున్నారంటే ముందు వారు వేసే బొమ్మకు ఒక ఆకారాన్ని ఇస్తారు. తర్వాత ఒక్కొక్క గీత గీస్తూ, ఆ బొమ్మ అందాన్ని ఇనుమడింపజేస్తారు. అదే విధంగా మనిషి ఒక్కొక్క సంస్కారాన్ని పాటిస్తూ, తన వ్యక్తిత్వమనే సంస్కారాన్ని ఇనుమడింపజేసుకోవాలి. అప్పుడే అతను గుణబ్రాహ్మణుడు అవుతాడు. ఒక వ్యక్తి పుట్టుకతో బ్రాహ్మణుడు అవవచ్చు – అతన్ని జాతిబ్రాహ్మణుడు అంటారు; మరొక వ్యక్తి తను బ్రాహ్మణుడు చేసే కర్మలు చెయ్యవచ్చు – అతన్ని కర్మబ్రాహ్మణుడు అంటారు. కాని సత్త్వగుణాన్ని పెంపొందించుకున్న వ్యక్తిని మాత్రమే గుణబ్రాహ్మణుడు అంటారు.

అలా ఒక వ్యక్తి గుణబ్రాహ్మణుడు అవటానికి చిత్రకారుడు ఒక్కొక్క గీత గీసుకు వచ్చినట్టుగా, అతను ఒక్కొక్క సంస్కారాన్ని చేస్తూ రావాలి. ఒక మనిషి చెయ్యాల్సిన 40 సంస్కారాల్లో మొదటి ఎనిమిది అతను తనకు తాను చేసుకోలేడు. అతని చిన్నవయస్సులో చేసేవి కాబట్టి, వాటిని తల్లిదండ్రులు చెయ్యాలి. పుత్రుని ఆధ్యాత్మిక ఎదుగుదలకోసం తల్లిదండ్రులు చేస్తారు. ఈ సంస్కారాలు గర్భాధానంతో మొదలయ్యి, ఉపనయనం దాకా ఉంటాయి.

తల్లిదండ్రులు చేసే ఈ ఎనిమిది సంస్కారాల్లో మూడు పుట్టకముందు చేస్తే, ఐదు పుట్టాక చేస్తారు. ఈ సంస్కారాలు చెయ్యటంద్వారా ముందు తరానికి దైవీసంపత్తిని అందించిన వారవుతారు. అందువల్ల అవి గృహస్థాశ్రమ ధర్మాలలోకి వస్తాయి.

అందువల్లనే పిల్లలు తప్పు చేస్తే, మీ తల్లిదండ్రులు ఎవరు అంటారు. విద్యార్థులు తప్పు చేస్తే, మీ గురువు ఎవరు అంటారు. అలా 40 సంస్కారాల్లో తల్లిదండ్రులు 8 చేస్తారు; 5 అతను బ్రహ్మచర్య ఆశ్రమంలో చెయ్యాలి; 27 గృహస్థాశ్రమంలో చెయ్యాలి.

ఇప్పుడు మనం వాటి వివరాలలోకి పోవటం లేదు. తల్లిదండ్రులు చేసే ఎనిమిదిలో మూడు చూడబోతున్నాము ఈ బ్రాహ్మణంలో. అవి గర్భాధానం, జాతకర్మ, నామకరణం. తక్కినవి ముఖ్యమైవి కాదని చెప్పటం లేదు. కాని ఉదాహరణకు వీటిని తీసుకుంది ఉపనిషత్తు.

ముందు బ్రాహ్మణములో ఐశ్వర్యంకోసం ప్రసాదం తీసుకుంటారు కాబట్టి అది శ్రీమంథ బ్రాహ్మణము అయింది; ఇక్కడ పుత్ర ఉత్పత్తికోసం ప్రసాదం తీసుకుంటారు కాబట్టి ఇది పుత్రమంథ బ్రాహ్మణము అయింది.

గర్భాధానం కర్మను వివరించటానికి ఉపనిషత్తు స్త్రీపురుష సంయోగాన్ని వివరిస్తున్నది. అది గర్భాధాన సంస్కారంలో ఒక భాగం. స్త్రీపురుషుల సంయోగాన్ని శాస్త్రం గర్భాధాన సంస్కారంలో ఒక భాగంగా భావిస్తుంది కాబట్టి దాన్ని పాపకర్మగా భావించదు. దాన్ని ఒకవేళ పాపకర్మగా భావిస్తే, భర్త ఒక పాపి, భార్య ఒక పాపి అవటమే కాక, ఈ పాపుల సంయోగంవల్ల పుట్టిన పిల్లలు కూడా పాపులే అవుతారు. మొత్తం గృహస్థాశ్రమమే పాపపంకిలం అయిపోతుంది. అలా అంటే మొత్తం మానవాళే పాపులు అయిపోతారు; పాపుల సంగమంవల్ల పుట్టారు కాబట్టి.

కాని వైదిక సంప్రదాయం గృహస్థుయొక్క జీవితాన్ని కూడా ఆశ్రమధర్మంగా కీర్తిస్తుంది. స్త్రీపురుషుల సంయోగాన్ని పాపంగా భావిస్తే, అది ఆశ్రమం అవదు. అది పాపం అయితే దాని గురించిన చర్చ కూడా పాపమే అవుతుంది.

స్త్రీ పురుషుల సంయోగం కేవలం శారీరకవాంఛవల్ల ఏర్పడినదే అయితే, దాన్ని పశుకర్మ అంటారు. అప్పుడది చర్చనీయాంశం అవదు. అటువంటి పశువాంఛ గురించి ప్రత్యేకించి చెప్పనవసరమూ లేదు, చెప్పాల్సిన అంశమూ కాదు. ప్రకృతిధర్మంగా చేసేదాని గురించి ఎవరూ చెప్పనవసరం లేదు. ఆవుయొక్క గర్భాధానం గురించి మాట్లాడదు శాస్త్రం. స్త్రీపురుషుల సంయోగం ఒక ఆధ్యాత్మిక చర్య; ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడే ఉన్నతమైన ప్రక్రియ. అందువల్ల తొలి సంగమాన్ని గర్భాధానసంస్కారం అంటారు. దీని గురించి అందరూ, సన్యాసులతో సహా, చెప్పవచ్చు.

ఈ బ్రాహ్మణం జ్ఞానకాండకు చెందినది కాదు కాబట్టి ఈ మంత్రాల వివరణను చూడబోవటం లేదు. వాటి సారాంశాన్నే చూద్దాము. మొదటి పన్నెండు మంత్రాలు గర్భాధాన సంస్కారంలో భాగంగా స్త్రీపురుష సంయోగాన్ని వివరిస్తున్నాయి.

మంత్రం 6.4.1

**ఏషాం వై భూతానాం పృథివీ రసః పృథివ్యా ఆపోఽపామోషధయ ఓషధీనాం పుష్పాణి పుష్పాణాం ఫలాని ఫలానాం పురుషః పురుషస్య రేతః ॥**

మంత్రం 6.4.2

**స హ ప్రజాపతిరీక్షాంచక్రే హన్తాస్మై ప్రతిష్ఠాం కల్పయానీతి స స్త్రియగ్ం ససృజే తాగ్ం సృష్ట్వాఽధ ఉపాస్త తస్మాత్స్త్రియముపాసీత స ఏతం ప్రాంచం గ్రావాణమాత్మన ఏవ సముదపారయత్తేనైనామభ్యసృజత్ ॥**

మంత్రం 6.4.3

**తస్యా వేదిరుపస్థో లోమాని బర్హిశ్చర్మాధిషవణే సమిద్ధో మధ్యతస్తౌ ముష్కౌ స యావాను వై వాజపేయేన యజమానస్య లోకో భవతి తావానస్య లోకో భవతి య ఏవం విద్వానధోపహాసం చరత్యాసాగ్ం స్త్రీణాగ్ం సుకృతం వృంక్తేఽథ య ఇదమవిద్వానధోపహాసం చరత్యాఽస్య స్త్రియః సుకృతం వృంజతే॥**

మంత్రం 6.4.4

**ఏతద్ధ స్మ వై తద్విద్వానుద్దాలక ఆరుణిరాహైతద్ధ స్మ వై తద్విద్వాన్నాకో మౌద్గల్య ఆహైతద్ధ స్మ వై తద్విద్వాన్కుమారహారిత ఆహ బహవో మర్యా బ్రాహ్మణాయనా నిరిన్ద్రియా విసుకృతోఽస్మాల్లోకాత్ప్రయన్తి య ఇదమవిద్వాగ్ంసోఽధోపహాసం చరన్తీతి బహు వా ఇదగ్ం సుప్తస్య వా జాగ్రతో వా రేతః స్కన్దతి ॥**

మంత్రం 6.4.5

తదభిమృశేదను వా మన్త్రయేత యన్మేఽద్య రేతః పృథివీమస్కాన్త్సీద్యదోషధీరప్యసరద్యదపః। ఇదమహం తద్రేత ఆదదే పునర్మామైత్విన్ద్రియం పునస్తేజః పునర్భగః। పునరగ్నిర్ధిష్ణ్యా యథాస్థానం కల్పన్తామిత్యనామికాంగుష్ఠాభ్యామాదాయాన్తరేణ స్తనౌ వా భ్రువౌ వా నిమృజ్యాత్ ॥

మంత్రం 6.4.6

అథ యద్యుదక ఆత్మానం పశ్యేత్తదభిమన్త్రయేత మయి తేజ ఇన్ద్రియం యశో ద్రవిణగ్ం సుకృతమితి శ్రీర్హ వా ఏషా స్త్రీణాం మన్మలోద్వాసాస్తస్మాన్మలోద్వాససం యశస్వినీమభిక్రమ్యోపమన్త్రయేత ॥

మంత్రం 6.4.7

సా చేదస్మై న దద్యాత్కామమేనామవక్రీణీయాత్సా చేదస్మై నైవ దద్యాత్కామమేనాం యష్ట్యా వా పాణినా వోపహత్యాతిక్రామేదిన్ద్రియేణ తే యశసా యశ ఆదద ఇత్యయశా ఏవ భవతి ॥

మంత్రం 6.4.8

సా చేదస్మై దద్యాదిన్ద్రియేణ తే యశసా యశ ఆదధామీతి యశస్వినావేవ భవతః ॥

మంత్రం 6.4.9

స యామిచ్ఛేత్కామయేత మేతి తస్యామర్థం నిష్ఠాయ ముఖేన ముఖగ్ం సంధాయోపస్థమస్యా అభిమృశ్య జపేదంగాదంగాత్సంభవసి హృదయాదధిజాయసే। స త్వమంగకషాయోఽసి దిగ్ధవిద్ధమివ మాదయేమామమూం మయీతి ॥

మంత్రం 6.4.10

అథ యామిచ్ఛేన్న గర్భం దధీతేతి తస్యామర్థం నిష్ఠాయ ముఖేన ముఖగ్ం సంధాయాభిప్రాణ్యాపాన్యాదిన్ద్రియేణ తే రేతసా రేత ఆదద ఇత్యరేతా ఏవ భవతి ॥

మంత్రం 6.4.11

అథ యామిచ్ఛేద్దధీతేతి తస్యామర్థం నిష్ఠాయ ముఖేన ముఖగ్ం సంధాయాపాన్యాభిప్రాణ్యాదిన్ద్రియేణ తే రేతసా రేత ఆదధామీతి గర్భిణ్యేవ భవతి ॥

మంత్రం 6.4.12

అథ యస్య జాయాయై జారః స్యాత్తం చేద్ద్విష్యాదామపాత్రేఽగ్నిముపసమాధాయ ప్రతిలోమగ్ం శరబర్హిస్తీర్త్వా తస్మిన్నేతాః శరభృష్టీః ప్రతిలోమాః సర్పిషాఽక్తా జుహుయాన్మమ సమిద్ధేఽహౌషీః

**ప్రాణాపానౌ త ఆదదేఽసావితి మమ సమిద్ధేఽహౌషీః పుత్రపశూగ్ంస్త ఆదదేఽసావితి మమ సమిద్ధేఽహౌషీరిష్టాసుకృతే త ఆదదేఽసావితి మమ సమిద్ధేఽహౌషీరాశాపరాకాశౌ త ఆదదేఽసావితి స వా ఏష నిరిన్ద్రియో విసుకృతోఽస్మాల్లోకాత్ప్రైతి యమేవం విద్బ్రాహ్మణః శపతి తస్మాదేవంవిచ్ఛ్రోత్రియస్య దారేణ నోపహాసమిచ్ఛేదుత హ్యేవంవిత్పరో భవతి ॥**

వేదాలు రెండు రకాల కర్మలను నియంత్రిస్తున్నాయి. వాటిని అపూర్వం కర్మ, ప్రాకృతం కర్మ అంటారు. అపూర్వం కర్మ అంటే మనకు బొత్తిగా తెలియని కర్మ. ఉదాహరణకు సంధ్యావందనం, అగ్నిహోత్రం కర్మలు. వీటి గురించి వేదాలద్వారానే తెలుసుకుంటాము.

ప్రాకృతం కర్మను స్వాభావికం కర్మ అని కూడా అంటారు. అంటే వీటిని మనం స్వతఃసిద్ధంగా చేస్తాము. ఈ కర్మలను వేదం ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఎందుకంటే అవి మనకు ముందే తెలుసు కాబట్టి. వేదాలు ఆ ప్రాకృతం కర్మలను మానమని చెప్పదు కాని, వాటిని సంస్కృతం కర్మలుగా మార్చుకోమంటున్నాయి.

ఈ మార్పు ఎలా జరుగుతుంది? సరియైన దృక్పథం, సరియైన క్రమశిక్షణద్వారా. ప్రాకృత కర్మను అర్థకామాలకోసం చేస్తే, సంస్కృతకర్మలను ధర్మ, మోక్షాలకోసం చేస్తాము. చేసే కర్మ మారదు. చేసే దృక్పథం మారుతుంది.

ప్రాకృతకర్మల్లో ఒక ప్రాథమిక కర్మ ఆహారం తీసుకోవటం. పసిపాపాయినుంచి పండుముసలి దాకా అందరికీ ఆకలి వేస్తే ఆహారం తీసుకోవాలని తెలుసు. ఎవరూ వారికి నేర్పించాల్సిన అవసరం లేదు. వేదాలు ఈ ప్రాకృతకర్మను మానమనవు. భోజనం అనే ప్రాకృతకర్మను, యజ్ఞం అనే సంస్కృతకర్మగా మలుచుకోమంటున్నాయి. ఈ యజ్ఞానికి ఒక పవిత్రమైన పేరు కూడా పెట్టాయి. అది **ప్రాణాగ్నిహోత్రమ్**.

ప్రాణాగ్నిహోత్రం అంటే వేరే ఏమిటో కాదు; అది తినటమే. భోజనానికి, ప్రాణాగ్ని హోత్రానికి మధ్య ఉన్న సూక్ష్మభేదం ఏమిటి? ఒకటి మామూలుగా తినటం అయితే, రెండవది సరియైన దృక్పథంతో, క్రమశిక్షణతో తినటం. తినటంలో మార్పులేదు. కాని ఆ తినటం ప్రాణమనే అగ్నికుండంలో వేస్తున్నట్టుగా తింటున్నాము. ఎప్పుడైతే ఆహారాన్ని పొట్టలోకి కాదు, అగ్నికుండంలోకి వేస్తున్నాము అనుకుంటామో, అప్పుడే మనం తీసుకునే ఆహారం ఆహుతి కిందకి వస్తుంది. దానితో మన దృక్పథం మారుతుంది.

భోజనాన్ని ఒక యాగంగా భావిస్తే, యాగంలో పాటించాల్సిన నియమాలను పాటించాల్సి ఉంటుంది. ఒక యాగం స్నానం చెయ్యకుండా చెయ్యము. అందువల్ల ఎప్పుడైతే ఇది ప్రాణాగ్నిహోత్ర యాగం అవుతుందో అప్పుడు సరియైన ఆహారాన్ని, సరియైన సమయంలో, సరియైన పద్ధతిలో తీసుకోవాలి. ఏది పడితే దాన్ని కడుపులోకి తోసేయలేము; అది యజ్ఞయోగ్యద్రవ్యం అవ్వాలి. యజ్ఞం చేసే వ్యక్తి ఆ సమయంలో శాస్త్రం చెప్పిన ఆహారమే తీసుకోవాలి. ఆ నియమాన్ని ఉల్లంఘిస్తే, దానికి ప్రాయశ్చిత్తకర్మ చెయ్యాలి.

ఎప్పుడైతే ప్రాకృతకర్మ అయిన భోజనమనే కర్మను సంస్కృతకర్మగా మలుచుకుంటామో, దానికి ప్రాయశ్చిత్త కర్మ కూడా చేస్తాము. తినకూడని వస్తువు తింటే, దానికి పరిహారం ఉంటుంది. సంధ్యావందనం చేసేటప్పుడు,

నియమాన్ని ఉల్లంఘించి తీసుకున్న ఆహారానికి పరిహారమంత్రాలు ఉంటాయి. ఎక్కువగా తినటం కూడా పాపమే.

ప్రాకృతకర్మ + సరియైన దృక్పథం + క్రమశిక్షణ + ప్రాయశ్చిత్తకర్మ = సంస్కృతకర్మ

ఈ విధంగా స్త్రీపురుషుల సంయోగం అనే ప్రాకృతకర్మను కూడా వేదాలు సంస్కృతకర్మగా మలుస్తాయి. అంటే ఈ మూడు అంశాలూ ఉండాలి – సరియైన దక్పథం, క్రమశిక్షణ, ప్రాయశ్చిత్తం. ఈ మూడింటినీ ఈ పన్నెండు మంత్రాల్లో చూస్తాము. ఈ మంత్రాలు సంయోగం గురించికన్నా ఎక్కువగా ఎలా దీన్ని సంస్కృతకర్మగా ఈ మూడు అంశాలద్వారా మలుచుకోవాలో చెబుతున్నాయి.

ప్రాకృతంగా అంటే స్వభావసిద్ధంగా చేసే ఏ కర్మ కూడా, దానంతట అది ధార్మిక కర్మ కానీ, అధార్మికకర్మ కానీ అవదు. దానికి ఉన్న నియమాలను పాటిస్తే ధార్మికకర్మ అవుతుంది, పాటించకపోతే అధార్మికకర్మ అవుతుంది.

భోజనం చెయ్యటం అనే కర్మ స్వతహాగా ధార్మికమూ కాదు, అధార్మికమూ కాదు. మనం పైన చెప్పిన మూడు అంశాలనూ – సరియైన దృక్పథం, క్రమశిక్షణ, ప్రాయశ్చిత్తం – కలిపితే ధార్మికం అవుతుంది. శాస్త్రం కలిపితే కలుపు అనటం లేదు, కలిపితీరాలి అంటున్నది. శాస్త్రం ప్రకారం ప్రాకృతకర్మను ప్రాకృతకర్మగా చేస్తే అధర్మం; కాని ప్రాకృతకర్మను సంస్కృతకర్మగా చేస్తే ధర్మం అవుతుంది. స్నానం చేసేటప్పుడు అఘమర్షణ సూక్తాన్ని పఠిస్తే అది పాపాలను తొలగిస్తుంది.

భోజనాన్ని ఎలా అగ్నిహోత్రంగా చూస్తున్నామో, అలా స్త్రీపురుషుల సంయోగాన్ని కూడా వాజపేయ యజ్ఞంగా చూడాలి. అంటే ఆ కర్మ మోక్షప్రాప్తి లేదా ధర్మప్రాప్తికోసం చేసేదిగా ఉండాలి కాని, అర్థకామాలను తీర్చుకునేదిగా ఉండకూడదు.

ఎప్పుడైతే తొలికలయికను గర్భాధానసంస్కారంగా భావిస్తారో, అప్పుడే వారి కలయికవల్ల పుట్టిన శిశువును యాగఫలంగా భావిస్తారు. ధార్మిక పుత్రప్రాప్తి కలిగినట్టుగా భావిస్తారు. శిశువు అనే ఈ యాగఫలం ఉన్నత లోకాలంత ఉన్నతమైనది; ధర్మమంత పవిత్రమైనది. ఇదీ సరియైన దృక్పథం.

రెండవ అంశం క్రమశిక్షణ లేదా నియమాలు. దానికి కొన్ని నియమాలు ఉన్నాయి.

1) ఆ స్త్రీ, పురుషులు భార్యాభర్తలై ఉండాలి. అంటే అతను గృహస్థుడై ఉండాలి. 2) పవిత్రంగా ఉండాలి. 3) సరియైన ప్రదేశంలో, సరియైన సమయంలో చెయ్యాలి. 4) భార్యాభర్తల మధ్య మంచి అవగాహన ఉండాలి.

భోజనమనే ప్రాకృతకర్మ ఒక్కరు చేసేది. వంట ఎంతమందైనా వండవచ్చు గాక, కాని తినేది ఒక్కరే. కాని ఇక్కడ సంయోగ విషయంలో భార్యాభర్తల ఇద్దరి ప్రమేయమూ ఉంటుంది. భర్తకు ప్రాకృతకర్మను ఎలా సంస్కృతకర్మగా మలుచుకోవచ్చో తెలుసు. అతను భార్యకు బోధించాలి. అంటే భర్తను గురువుగా, తనను శిష్యురాలిగా భావించుకోవాలి. పతియే ప్రత్యక్షదైవం అంటే దైవంగా కొలవమని చెప్పటంకన్నా, గురువుగా కొలవమని అర్థం. గురువు ఈశ్వరునితో సమానం. అతను తన భార్యను శిష్యురాలిగా మలుచుకుని, ఆమెను సంస్కరించాలి. అందువల్ల భార్య ఏదైనా పాపం చేస్తే ఆ పాపం భర్తకు అంటుతుంది అంటుంది శాస్త్రం.

ఒక దేశపౌరుడు ఏదైనా తప్పు చేస్తే, ఆ నేరం రాజుకు వెళుతుంది; రాజు ఏదైనా తప్పు చేస్తే ఆ నేరం రాజగురువుకు వెళుతుంది; శిష్యుడు ఏదైనా తప్పు చేస్తే ఆ నేరం గురువుకు వెళుతుంది. అలాగే భార్య తప్పు చేస్తే ఆ నేరం భర్తకు వెళుతుంది. ధర్మాధర్మాల గురించి శాస్త్రం చెప్పిన సత్యం ఇది.

శాస్త్రం విధించిన నియమాలను ఉల్లంఘిస్తే పాటించాల్సిన ప్రాయశ్చిత్తం అయిన మూడవ అంశం ఈ పన్నెండు మంత్రాల్లో వస్తుంది.

మంత్రం 6.4.13

**అథ యస్య జాయామార్తవం విన్ద్రేత్త్ర్యహం కగ్ంసే న పిబేదహతవాసా నైనాం వృషలో న వృషల్యుపహన్యాత్త్రిరాత్రాన్త ఆప్లుత్య వ్రీహీనవఘాతయత్ ॥**

మంత్రం 6.4.14

**స య ఇచ్ఛేత్పుత్రో మే శుక్లో జాయేత వేదమనుబ్రువీత సర్వమాయురియాదితి క్షీరౌదనం పాచయిత్వా సర్పిష్మన్తమశ్నీయాతామీశ్వరౌ జనయితవై ॥**

మంత్రం 6.4.15

**అథ య ఇచ్ఛేత్పుత్రో మే కపిలః పింగలో జాయేత ద్వౌ వేదావనుబ్రువీత సర్వమాయురియాదితి దధ్యోదనం పాచయిత్వా సర్పిష్మన్తమశ్నీయాతామీశ్వరౌ జనయితవై ॥**

మంత్రం 6.4.16

**అథ య ఇచ్ఛేత్పుత్రో మే శ్యామో లోహితాక్షో జాయేత త్రీన్వేదాననుబ్రవీత సర్వమాయురియాదిత్యుదౌదనం పాచయిత్వా సర్పిష్మన్తమశ్నీయాతామీశ్వరౌ జనయితవై ॥**

మంత్రం 6.4.17

**అథ య ఇచ్ఛేద్దుహితా మే పణ్డితా జాయేత సర్వమాయురియాదితి తిలౌదనం పాచయిత్వా సర్పిష్మన్తమశ్నీయాతామీశ్వరౌ జనయితవై ॥**

మంత్రం 6.4.18

**అథ య ఇచ్ఛేత్పుత్రో మే పణ్డితో విగీతః సమితింగమః శుశ్రూషితాం వాచం భాషితా జాయేత సర్వాన్వేదాననుబ్రువీత సర్వమాయురియాదితి మాగ్ంసౌదనం పాచయిత్వా సర్పిష్మన్తమశ్నీయాతామీశ్వరౌ జనయితవా ఔక్షేణ వా౽౽ర్షభేణ వా ॥**

ఇంతవరకూ గర్భాధానకర్మ గురించి చూశాము. ఇప్పుడు 13 నుంచి 18 వరకూ గర్భాధాన వ్రతాలు చూస్తాము. అంటే భార్య, భర్త తమకెలాంటి పుత్రుడు కావాలనుకుంటే, దానికి సంబంధించిన నియమం పాటించాలి.

అంటే ఒక పద్ధతిలో తయారుచేసిన మంథాన్ని తినాలి; అది క్షీరాన్నమో, దధ్యోదనమో, మరేదో కావచ్చు. అలా ప్రత్యేకమైన ఆహారాన్ని మంథము అనీ, అది పుత్రుడికోసం చేసేది కాబట్టి పుత్రమంథకర్మ అనీ, అందువల్ల ఈ బ్రాహ్మణానికి పుత్రమంథ బ్రాహ్మణం అనీ పేరు వచ్చింది.

ఎటువంటి శిశువును కోరుకోవచ్చు?

1. అమ్మాయో, అబ్బాయో ఎవరు కావాలో నిర్ణయించుకోవచ్చు.
2. శిశువు పరావిద్య నేర్చుకోవాలో, అపరావిద్య నేర్చుకోవాలో నిర్ణయించుకోవచ్చు.
3. శిశువు రంగు ఎలా ఉండాలో నిర్ణయించుకోవచ్చు.
4. శిశువు కన్ను ఏ వర్ణంలో ఉండాలో నిర్ణయించుకోవచ్చు.

ఆంజనేయస్వామి కళ్ళు పసుపురంగులో ఉంటాయి. ఆయనను పింగళాక్షుడు అంటారు.

వీటిల్లో ఏది కోరుకుంటే దానికి తగ్గ ప్రసాదం తీసుకోవాలి. ఏ కోరిక కోరుకున్నా సమానంగా ఉండే కోరిక దీర్ఘాయుష్షు.

ఇక్కడ శంకరులవారు ఒక విషయాన్ని ప్రత్యేకించి చెబుతున్నారు. ఈ అధ్యాయం ప్రాణ ఉపాసనతో మొదలయింది కాబట్టి, అది ఈ అధ్యాయంలో ప్రధాన అంశం. అందువల్ల దాని తర్వాత చెప్పబడిన శ్రీమంథకర్మ కాని, పుత్రమంథ ఉపాసన కాని ప్రాణ ఉపాసకుడు మాత్రమే చెయ్యాలి. తక్కినవారు చేస్తే ఆశించిన ఫలితం పొందవచ్చు, పొందలేకపోవచ్చు కాని ప్రాణ ఉపాసకుడు మాత్రం పొంది తీరుతాడు.

## మంత్రం 6.4.19

**అథాభిప్రాతరేవ స్థాలీపాకావృతాఽఽజ్యం చేష్టిత్వా స్థాలీపాకస్యోపఘాతం జుహోత్యగ్నయే స్వాహాఽనుమతయే స్వాహా దేవాయ సవిత్రే సత్యప్రసవాయ స్వాహేతి హుత్వోద్ధృత్య ప్రాశ్నాతి ప్రాశ్యేతరస్యాః ప్రయచ్ఛతి ప్రక్షాల్య పాణీ ఉదపాత్రం పూరయిత్వా తేనైనాం త్రిరభ్యుక్షత్యుత్తిష్ఠాతో విశ్వావసోఽన్యామిచ్ఛ ప్రపూర్వ్యాగ్ం సం జాయాం పత్యా సహేతి ॥**

## మంత్రం 6.4.20

**అథైనామభిపద్యతేఽమోహమస్మి సా త్వగ్ం సా త్వమస్య మోఽహగ్ం సామాహమస్మి ఋక్త్వం ద్యౌరహం పృథివీ త్వం తావేహి సగ్ంరభావహై సహ రేతో దధావహై పుగ్ంసే పుత్రాయ విత్తయ ఇతి ॥**

## మంత్రం 6.4.21

**అథాస్యా ఊరూ విహాపయితి విజిహీథాం ద్యావాపృథివీ ఇతి తస్యామర్థం నిష్ఠాయ ముఖేన ముఖగ్ం సంధాయ త్రిరేనామనులోమామనుమార్ష్టి విష్ణుర్యోనిం కల్పయతు త్వష్టా రూపాణి పిగ్ంశతు। ఆసించతు**

**ప్రజాపతిర్ధాతా గర్భం దధాతు తే । గర్భం ధేహి సినీవాలి గర్భం ధేహి పృథుష్టుకే । గర్భం తే అశ్వినౌ దేవావాధత్తాం పుష్కరస్రజౌ ॥**

మంత్రం 6.4.22

**హిరణ్మయీ అరణీ యాభ్యాం నిర్మన్థతామశ్వినౌ । తం తే గర్భగ్ం హవామహే దశమే మాసి సూతయే । యథాఽగ్నిగర్భా పృథివీ యథా ద్యౌరిన్ద్రేణ గర్భిణీ । వాయుర్దిశాం తథా గర్భ ఏవం గర్భం దధామి తేఽసావితి ॥**

ఈ భాగం గర్భాధానసంస్కారం గురించి వివరిస్తుంది. ఈ భాగంలో మూడు అంశాలు ఉన్నాయి. అవి అగ్నిహోత్రం, నియమాలు, ప్రార్థన. అగ్నిహోత్రం వివరాలు వస్తాయి; మళ్ళీ స్త్రీపురుషుల సంయోగంలో పాటించాల్సిన నియమాలు వస్తాయి. వారి మధ్య చక్కని అనుబంధం ఎలా ఉండాలో అనేక ఉదాహరణలద్వారా చూపిస్తుంది ఉపనిషత్తు. ఋగ్వేదం–సామవేదం ఒక జంట; సంగీతం–సాహిత్యం ఒక జంట; రాత్రి–పగలు ఒక జంట; ఆకాశం–భూమి ఒక జంట. అలా భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండాలి. ఉదాహరణకు మంచి సాహిత్యం ఉండి, సరిగ్గా పాడకపోతే, సాహిత్యం అందం తెలియదు; అలాగే బాగా పాడినా, సాహిత్యం బాగుండకపోతే రసాస్వాదన చెయ్యలేము. ఇప్పుడు ఇటువంటి అనుబంధాలు లోపించే, భార్యాభర్తల మధ్య ఉన్న సంబంధాలు వీగిపోతున్నాయి.

మూడవ అంశం ఆరోగ్యకరమైన శిశువుకోసం చేసే ప్రార్థన. సనాతన ధర్మ అభివృద్ధికోసం పుడతారు పిల్లలు. అందువల్ల ఆ పుట్టే పిల్లలు శారీరకంగా, మానసికంగా, ముఖ్యంగా ఆధ్యాత్మికంగా ఆరోగ్యకరంగా ఉండాలి. అంగవైకల్యం ఉన్నవారు తక్కువమంది అనుకుంటాము కాని, నిజానికి పిల్లల ఆసుపత్రికి వెళ్ళిచూస్తే అంగ వైకల్యం సామాన్యం; ఆరోగ్యకరమైన పిల్లలు ఉండటం అరుదు అనిపిస్తుంది. అందువల్ల ఆరోగ్యకరమైన శిశువుకోసం గర్భాధాన సమయంలో ప్రార్థన చేస్తారు.

ఆ ప్రార్థన ప్రజాపతికి ఉంటుంది. ఆయన సృష్టికర్త కదా. ఓ దేవా, నాద్వారా నువ్వు నాకు మంచి ఆరోగ్యకరమైన శిశువును ఇవ్వమని చేసే ప్రార్థన అది. నేను కాదు ఆ శిశువు పుట్టుకకు కారణం, నువ్వే కారణం అని దాని అర్థం. ఆ పుట్టే శిశువు కూడా బ్రహ్మలాగా ఉండాలి.

దీనితో గర్భాధానవ్రతం అయిపోయింది. గర్భాధానసంస్కారాలు, వ్రతాలు, స్త్రీపురుషనియమాలు వివరించటానికి 22 మంత్రాలు తీసుకుంది ఉపనిషత్తు. దీన్నిబట్టి తెలుస్తున్నది శాస్త్రం ప్రాకృతకర్మను ఎలా సంస్కృతకర్మగా చెయ్యాలనుకుంటున్నదో.

గర్భాధానం అంటే గర్భస్య ఆధానం. జీవుడిని పురుషబీజంనుంచి స్త్రీయోనికి మార్చటం. అది మనం పంచాగ్నివిద్యలో చూశాము. నాలుగవ అగ్ని పురుషశరీరం అనీ, ఐదవ అగ్ని స్త్రీశరీరం అనీ చూశాము.

మంత్రం 6.4.23

**సోష్యన్తీమద్భిరభ్యుక్షతి । యథా వాయుః పుష్కరిణీగ్ం సమింగయతి సర్వతః । ఏవా తే గర్భ ఏజతు సహావైతు జరాయుణా । ఇన్ద్రస్యాయం వ్రజః కృతః సార్గలః సపరిశ్రయః । తమిన్ద్ర నిర్జహి గర్భేణ సావరాగ్ం సహేతి ॥**

మంత్రం 6.4.24

**జాతేఽగ్నిముపసమాధాయాంక ఆధాయ కగ్ంసే పృషదాజ్యగ్ం సంనీయ పృషదాజ్యస్యోపఘాతం జుహోత్యస్మిన్సహస్రం పుష్యాసమేధమానః స్వే గృహే । అస్యోపసన్ద్యాం మా ఛైత్సీత్ప్రజయా చ పశుభిశ్చ స్వాహా । మయి ప్రాణాగ్ంస్త్వయి మనసా జుహోమి స్వాహా । యత్కర్మణాఽత్యరీరిచం యద్వా న్యూనమిహాకరమ్ । అగ్నిష్టత్స్విష్టకృద్విద్వాన్స్విష్టగ్ం సుహుతం కరోతు నః స్వాహేతి ॥**

మంత్రం 6.4.25

**అథాస్య దక్షిణం కర్ణమభినిధాయ వాగ్వాగితి త్రిరథ దధి మధు ఘృతగ్ం సంనీయానన్తర్హితేన జాతరూపేణ ప్రాశయతి । భూస్తే దధామి భువస్తే దధామి స్వస్తే దధామి భూర్భువః స్వః సర్వం త్వయి దధామీతి ॥**

ఈ మంత్రాల్లో ఇంకొక సంస్కారం గురించి చూస్తాము. దాని పేరు జాతకర్మ.

**జాతే సతి క్రియమాణం కర్మ జాతకర్మ**

పుట్టగానే చేసే కర్మ. ముందే చూసినట్టుగా ఒక వ్యక్తి చెయ్యాల్సిన 40 కర్మల్లో, తల్లిదండ్రులు 8 కర్మలు చేస్తారు. వాటిల్లో మనం మూడే చూస్తున్నాము ఇప్పుడు. గరాధానకర్మకూ, జాతకర్మకూ మధ్యలో కొన్ని ఉన్నాయి కాని ఈ సందర్భంలో ఉపనిషత్తు వాటి గురించి చెప్పటం లేదు. ఇది ఉపనిషత్తు భాగం, ఇందులో కర్మకాండకు ఎక్కువ ప్రాధాన్యం ఉండదు. వీటి వివరాలు కర్మకాండలో ఉంటాయి. ఇక్కడ చెప్పినదాన్నిబట్టి కర్మ చెయ్యలేము. ఇది మనకు కర్మకాండ అర్థం కావటంకోసం సూక్ష్మంగా చెప్పబడింది.

జాతకర్మలో ఐదు దశలున్నాయి. అవి ప్రోక్షణం, హోమమ్, ప్రార్థన, కర్ణజపమ్, ప్రాశనమ్.

1. **ప్రోక్షణమ్** – శిశువు జన్మిస్తున్నప్పుడు, భర్త భార్యమీద నీళ్ళు జల్లి ప్రార్థన చెయ్యాలి. ఈ ప్రార్థన ప్రాణశక్తికి లేదా ప్రాణదేవతకు చేస్తాడు.

శాస్త్రం ప్రకారం పురిటినొప్పులు పడే స్త్రీ శరీరం పడే అవస్థలు ఈ ప్రాణశక్తివల్లనే జరుగుతాయి. అంటే గర్భస్థ శిశువును బయటకు తీసుకురావటానికి తోడ్పడేది ప్రాణవాయువు. ఆ ప్రాణవాయువును అప్పుడు ప్రసూతికా వాయువు అంటారు. అందువల్లనే ఆ చర్యను ప్రసూతి అంటారు.

భర్త ఆ ప్రసూతికా వాయువుకు పూజ చెయ్యాలి. బిడ్డ క్షేమంగా బయటకు రావాలని, తల్లి క్షేమంగా ఉండాలనీ చేసే ప్రార్థన అది. ఆ పూజ సారాంశం ఇది – 'ఓ వాయుదేవుడా, నువ్వు సముద్రంలో అలలను సృష్టిస్తావు. నువ్వు అలల సృష్టికర్తవు, కాని అలలకు జన్మనిచ్చిన సముద్రాన్ని ఏమీ చెయ్యవు. అలాగే సముద్రంలాంటి నా భార్యనుంచి అలలాంటి నా పుత్రుడు జన్మించటానికి నువ్వు తోడ్పడుతున్నావు. నా పుత్రుడు క్షేమంగా బయటకి వచ్చేటట్టు, తల్లికి ఏమీ అవకుండా ఉండేటట్టు చెయ్యి.'

2. **హోమమ్** – ఈ హోమాన్ని పుత్రుడు పుట్టగానే చెయ్యాలి. కుదరకపోతే పదకొండవ రోజు కాని, ఇంకొక అనువైన రోజున కాని చెయ్యాలి. హోమం కూడా శిశువు ఆరోగ్యంకోసం చేసే ప్రార్థన. వివరాలు ఇక్కడ లేవు.

3. **ప్రార్థన** – శిశువును ఒళ్ళో కూర్చోపెట్టుకుని అతని ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధికోసం, వంశాభివృద్ధికోసం చేసే ప్రార్థన ఇది. ఈ వంశంలో వెయ్యిమంది పుత్రులు ఉండాలి అంటాడు. అంతే కాకుండా తన ప్రాణశక్తిని పుత్రునికి ధారపోస్తాడు తండ్రి. ఎందుకంటే అతను తన తండ్రికి ప్రతీకగా నిలుస్తాడు; తండ్రి చెయ్యలేకపోయిన కర్మలు ఏవైనా ఉంటే వాటిని పూర్తి చేస్తాడు. అందువల్ల పుత్రునిలోకి ప్రాణశక్తిని నింపే మానసిక ప్రార్థన ఇది.

4. **కర్ణజపమ్** – 'వాక్కు' అనే పదాన్ని తన పుత్రుని కుడిచెవిలో మూడుసార్లు ఉచ్చరిస్తాడు. వాక్కు వేదాలను సూచిస్తుంది. వేదాలు శబ్దప్రధానం; వేదాలు సాక్షాత్తూ ఆ భగవానునినుంచే వచ్చాయి అంటే అపౌరుషేయం. వేదాలు మన జీవన విధానాన్ని నిర్దేశిస్తాయి. అందువల్ల వాక్కు అంటే వేదాలు. మూడుసార్లు ఎందుకు చెప్పాలంటే మూడు వేదాలను సూచిస్తాయి. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం. నిజానికి నాలుగు వేదాలు ఉన్నా, నాలుగవ వేదమైన అథర్వణవేదం గురించి ఎక్కువగా చెప్పరు. అథర్వణ వేదంలో ఎక్కువగా కర్మలు ఉండవు.

అలా వాక్కు అనే పదాన్ని ఉచ్చరించటంవల్ల, వేదాలన్నీ పుత్రునిలోకి ప్రవేశించి, అతన్ని పునీతుణ్ణి చేస్తాయని, అతనికి వేదాలమీద శ్రద్ధ ఏర్పడుతుందనీ నమ్మడం. శాస్త్రంమీద శ్రద్ధ కలిగివుండటం చాలా అవసరం. వేదంమీద శ్రద్ధ లేకపోతే అతను నాస్తికుడయ్యే ప్రమాదముంది.

5. **ప్రాశనమ్** – దీన్నే మనం అన్నప్రాశనం అంటాము. ప్రాశనం అంటే శిశువును **దధి మధుఘృతం** కలిపినదాన్ని నోట్లో పెట్టాలి. అంటే పెరుగు, తేనె, నెయ్యిలను పెడతాడు. దీన్ని స్వర్ణంతో అంటే బంగారంతో పెట్టాలి. ఇది శిశువుకు ఆధ్యాత్మిక, మానసిక, భావపరమైన ఆరోగ్యాన్ని ఇస్తుంది.

ప్రాశనం సమయంలో శిశువుకు అంతా ఇస్తున్నాను అని తండ్రి చెబుతాడు.

**భూస్తే దధామి** – దధి పెడుతూ నీకు మొత్తం భూలోకం ఇస్తున్నాను అంటాడు.
**భువస్తే దధామి** – మధువు పెడుతూ నీకు మొత్తం భువర్లోకాన్ని ఇస్తున్నాను అంటాడు.
**స్వస్తే దధామి** – తేనె పెడుతూ నీకు మొత్తం సువర్లోకాన్ని ఇస్తున్నాను అంటాడు.
**భూర్భువః స్వః సర్వం త్వయి దధామీతి** – ఆ విధంగా నీకు మూడు లోకాలు రావాలి అంటే నీకు సర్వం ఇస్తున్నాను. శిశువు అంతా పొందాలనే సదుద్దేశంతో చేసే ఒక ఊహాజనిత కర్మ. దీనితో జాతకర్మ అయిపోయింది.

మంత్రం 6.4.26

**అథాస్య నామ కరోతి వేదోஉసీతి తదస్య తద్గుహ్యమేవ నామ భవతి ॥**

ఇప్పుడు మూడవ కర్మ నామకరణ కర్మ. దీన్ని చాలా టూకీగా చెప్పింది ఇక్కడ ఉపనిషత్తు. ఈ సందర్భంలో ఇంకా ఎన్నో వివరాలు ఉన్నాయి. అవి కావాలంటే కర్మకాండ భాగానికి వెళ్ళాలి. ఇక్కడ ఊరికే చెప్పి వదిలేస్తున్నది.

**అథాస్య నామ కరోతి వేదోஉసీతి తదస్య తద్గుహ్యమేవ నామ భవతి** – తండ్రి ఒక ప్రత్యేకమైన పేరు చెప్పాలి. అది రహస్యమైన నామం. ఈ పేరే పిల్లలందరికీ పెడతారు. ఈ పేరు వేదోஉసి అంటే వేదః. ఇక్కడ మళ్ళీ వేదః అంటే ఇందాక చూసిన ఋగ్వేద, యజుర్వేద, సామవేదాలు కావు. వేదః అంటే చైతన్యం, జ్ఞానం. వేదః అసి అనేది ఒక మహావాక్యం. నువ్వు ఆ చైతన్యానికి లేదా బ్రహ్మవు అని చెబుతుంది కాబట్టి ఇది మహావాక్యం. అప్పుడు ఆ శిశువుకు అర్థం కాకపోయినా, ఆ సంస్కారం పొందటంవల్ల ఎప్పుడో ఒకప్పుడు అహం బ్రహ్మ అస్మి సూత్రాన్ని అర్థం చేసుకుంటాడు.

ఆ పేరు గుహ్యం అంటే రహస్యం. ఎందుకంటే ఆ పేరు అర్థం అతనికి అప్పుడు తెలియదు. అతను పెరిగి పెద్దయి, శిష్యుడయి, బ్రహ్మవిద్య నేర్చుకున్నప్పుడు తెలుస్తుంది. ఇది ఎందుకు రహస్యనామం అయింది? పుట్టిన ప్రతిశిశువుకూ అదే పేరు పెడతారు కాబట్టి అది వ్యవహారానికి పనికి రాదు.

అందువల్ల ఆ శిశువును పిలవటానికి వీలుగా ఇంకొక పేరు పెడతారు. దానికి కూడా ఎన్నో నియమాలు ఉంటాయి. ఫలానా అక్షరంతో మొదలవ్వాలి, ఇన్ని అక్షరాలు ఉండాలి, మొదలైనవి. ఇక్కడ ఆ వివరాలను చెప్పదు ఉపనిషత్తు. దీనితో నామకరణం అయిపోయింది.

ఇప్పుడు ఇంకొక సంస్కారాన్ని వివరిస్తున్నది ఉపనిషత్తు. దీన్ని జాతకర్మతో పాటు లేదా నామకరణంతో పాటు చెయ్యాలి. దీన్ని స్తనదానకర్మ అంటారు. ఈ స్తనదానమంత్రాన్ని 27వ మంత్రంలో చూస్తాము.

మంత్రం 6.4.27

**అథైనం మాత్రే ప్రదాయ స్తనం ప్రయచ్ఛతి యస్తే స్తనః శశయో యో మయోభూర్యో రత్నధా వసువిద్యః సుదత్రః । యేన విశ్వా పుష్యసి వార్యాణి సరస్వతి తమిహ ధాతవే కరితి ॥**

భర్త, భార్య దగ్గరికి శిశువును తీసుకువెళ్ళి, పాలివ్వమని చెప్పాలి. అప్పుడు సరస్వతీదేవికి ప్రార్థన చెయ్యాలి. ముందుగా సరస్వతీదేవిని స్తుతించాలి. ఆమెవల్ల తన శిశువుకు జ్ఞానం, తెలివితేటలు, స్వచ్ఛత, ఐశ్వర్యం, మంగళకరమైన అంశాలు పొందాలని చేసే ప్రార్థన. అంటే శిశువు రాణించటానికి కావాల్సినవన్నింటినీ ప్రసాదించమని కోరుతాడు.

పాలు ఇచ్చేది తల్లే అయినా, ఆ తల్లి స్తనంలో పాలుగా మారి శిశువును దీవించమని సరస్వతీదేవిని కోరుతున్నాడు తండ్రి. 'ఓ సరస్వతీ, నా శిశువుకు పాలిస్తున్నది నా భార్య కాదు, సాక్షాత్తూ చదువుల సరస్వతీ అయిన నువ్వే.' ఇక్కడ చదువు అంటే చదువు ఒక్కటే కాదు, అన్ని సంపదలూ వస్తాయి.

గర్భాధానసమయంలో బ్రహ్మదేవుణ్ణి ప్రార్థిస్తాడని చూశాము. 'ఓ దేవా, అప్పుడు నువ్వు నాలో ప్రవేశించి, నాద్వారా నాకు పుత్రుణ్ణి ప్రసాదించు' అన్నాడు అప్పుడు. ఇప్పుడు సరస్వతీదేవిని 'నా భార్యలో నువ్వు ప్రవేశించు,' అంటున్నాడు. అంటే ఏదీ యాంత్రికంగా జరగటం లేదు. అంతా ఒక పవిత్రమైన, మంగళకరమైన క్రతువుగా సాగుతున్నది. తండ్రి బ్రహ్మ, తల్లి సరస్వతీ అయితే వారి శిశువు మామూలుగా ఉంటాడా? అతను కూడా బ్రహ్మస్వరూపుడు, సరస్వతీపుత్రుడు అవుతాడు.

### మంత్రం 6.4.28

**అథాస్య మాతరమభిమన్త్రయతే । ఇలాఽసి మైత్రావరుణీ వీరే వీరమజీజనత్ । సా త్వం వీరవతీ భవ యాఽస్మాన్వీరవతోఽకరదితి । తం వా ఏతమాహురతిపితా బతాభూరతిపితామహో బతాభూః పరమాం బత కాష్ఠాం ప్రాపచ్ఛ్రియా యశసా బ్రహ్మవర్చసేన య ఏవంవిదో బ్రాహ్మణస్య పుత్రో జాయత ఇతి ॥**

ఇందులో తన శిశువును స్తుతిస్తున్నాడు. నువ్వు గొప్ప శిశువ్వి అంటున్నాడు. నువ్వు నాకన్నా గొప్పవాడివి అవుతావు అంటున్నాడు. తనకన్నానే కాదు, తన తండ్రిని మించినవాడు అవుతాడు అంటున్నాడు. తండ్రిని మించిన తనయుడు, తాతనుమించిన మనవడు అనే నానుడులు అందువల్లనే వచ్చాయి. అంతేకాదు –

**శ్రియా యశసా బ్రహ్మవర్చసేన** – అందరికన్నా ఎక్కువ ఐశ్వర్యం పొందుతావు, కీర్తిప్రతిష్ఠలు పొందుతావు. బ్రహ్మ వర్చస్సుతో వెలిగిపోతావు.

ఇవన్నీ తండ్రికి ఎలా తెలుసు? ఇదంతా మనస్తత్వశాస్త్రం. చిన్నప్పటినుంచి బలమైన సానుకూల ఆలోచనలు నింపితే అతను వృద్ధిలోకి వస్తాడు. అతను ఏది అవాలని కోరుకుంటే, అది అవుతాడు. అందువల్ల మంచి కోరుకోవాలి.

పూర్వం నామకరణం కూడా ఆలోచించి చేసేవారు. తమ పుత్రుడు ఎందులో రాణించాలనుకుంటే దానికి తగ్గ పేరు పెట్టేవారు. అపారమైన విద్యాబుద్ధులు కలగాలంటే అతనికి విద్యాసాగర్ అని పేరు పెట్టేవారు. అంటే అతను సర్వజ్ఞుడు అవ్వాలనే తపన. ఆ పేరును పదిమంది పదేపదే ఉచ్చరిస్తే ఆ పేరు బలం ఉంటుంది. ఆ పుత్రునికి అది ప్రాప్తి అయ్యేలాగా చేస్తుంది.

దాని తర్వాత తన భార్యను అభినందిస్తాడు. నువ్వు గొప్ప పని చేశావు. నీ జన్మ ధన్యమైంది అంటాడు. అలా తను తండ్రిగా ఎదగటంవల్ల తన జన్మ కూడా ధన్యమైంది అనుకుంటాడు. దీనితో సంస్కారాలన్నీ ముగిశాయి.

# 6.5 - వంశ బ్రాహ్మణము

మంత్రం 6.5.1

**అథ వగ్ంశః । పౌతిమాషీపుత్రః కాత్యాయనీపుత్రాత్కాత్యాయనీపుత్రో గౌతమీపుత్రాద్గౌతమీ పుత్రో భారద్వాజీపుత్రాద్భారద్వాజీపుత్రః పారాశరీపుత్రాత్పారాశరీ పుత్ర ఔపస్వతీపుత్రాదౌపస్వతీపుత్రః పారాశరీపుత్రాత్పారాశరీపుత్రః కాత్యాయనీపుత్రాత్కాత్యాయనీపుత్రః కౌశికీపుత్రాత్కౌశికీపుత్ర ఆలమ్బీపుత్రాచ్చ వైయాఘ్రపదీపుత్రాచ్చ వైయాఘ్రపదీపుత్రః కాణ్వీపుత్రాచ్చ కాపీపుత్రాచ్చ కాపీపుత్రః॥**

మంత్రం 6.5.2

**ఆత్రేయీపుత్రాదాత్రేయీపుత్రో గౌతమీపుత్రాద్గౌతమీపుత్రో భారద్వాజీపుత్రాద్భారద్వాజీపుత్రః పారాశరీపుత్రాత్పారాశరీపుత్రో వాత్సీపుత్రాద్వాత్సీపుత్రః పారాశరీపుత్రాత్పారాశరీపుత్రో వార్కారుణీపుత్రాద్వార్కారుణీపుత్రో వార్కారుణీ పుత్రాద్వార్కారుణీపుత్ర ఆర్తభాగీపుత్రాదార్తభాగీపుత్ర శౌఙ్గీపుత్రాచ్ఛౌంగీపుత్రస్సాంస్కృతీపుత్రాత్సాంస్కృతీపుత్ర ఆలంబాయనీపుత్రాదాలమ్బాయనీపుత్ర ఆలమ్బీపుత్రాదాలమ్బీపుత్రో జాయన్తీపుత్రాజ్జాయన్తీపుత్రో మాణ్డూకాయనీపుత్రాన్మామ్బాణ్డూకాయనీ పుత్రో మాణ్డూకీపుత్రాన్మాణ్డూకీపుత్రశ్శాణ్డిలీపుత్రాచ్ఛాణ్డిలీపుత్రో రాథీతరీపుత్రాద్రాథీతరీపుత్రో భాలుకీపుత్రాద్భాలుకీపుత్రః క్రౌఞ్చికీపుత్రాభ్యాం క్రౌఞ్చికీపుత్రౌ వైదభృతీపుత్రాద్వైదభృతీపుత్రః కార్శకేయీ పుత్రాత్కార్శకేయీపుత్రః ప్రాచీనయోగీపుత్రాత్ప్రాచీనయోగీపుత్రస్సాఞ్జీవీపుత్రాత్సాఞ్జీవీపుత్రః ప్రాశ్నీ పుత్రాదాసురివాసినః ప్రాశ్నీపుత్ర ఆసురాయణాదాసురాయణ ఆసురేరాసురిః ॥**

మంత్రం 6.5.3

**యాజ్ఞవల్క్యాద్యాజ్ఞవల్క్య ఉద్దాలకాదుద్దాలకోఽరుణాదరుణ ఉపవేశేరుపవేశిః కుశ్రేః కుశ్రిర్వాజశ్రవసో వాజశ్రవా జిహ్వావతో బాధ్యోగాజ్జిహ్వావాన్ బాధ్యోగోఽసితాద్వార్షగణాదసితో వార్షగణో హరితాత్కశ్యపాద్ధరితః కశ్యపశ్శిల్పాత్కశ్యపాచ్ఛిల్పః కశ్యపః కశ్యపాన్నైధ్రువేః కశ్యపో నైధ్రువిర్వాచో వాగమ్భిణ్యా అమ్భిణ్యాదిత్యాత్ ॥ ఆదిత్యానీమాని శుక్లాని యజూగ్ంషి వాజసనేయేన యాజ్ఞవల్క్యేనాఖ్యాయన్తే ॥**

తర్వాత ఇప్పుడు వంశం అంటే ఆచార్య పరంపరయొక్క క్రమం చెప్పబడుతున్నది. పౌతిమాషీ అని స్త్రీయొక్క పుత్రుడు కాత్యాయనీయొక్క పుత్రున్నుంచి, కాత్యాయనీ పుత్రుడు గౌతమీ పుత్రున్నుంచి, గౌతమీ పుత్రుడు భారద్వాజీ పుత్రున్నుంచి, భారద్వాజీ పుత్రుడు పారాశరీ పుత్రున్నుంచి, పారాశరీ పుత్రుడు ఔపస్వతీ పుత్రున్నుంచి, ఔపస్వతీ పుత్రుడు (ఇంకో) పారాశరీ పుత్రున్నుంచి, (ఆ) పారాశరీ పుత్రుడు కాత్యాయనీ పుత్రున్నుంచి, కాత్యాయనీ

పుత్రుడు కౌశికీ పుత్రున్నుంచి, కౌశికీ పుత్రుడు ఆలంబీ పుత్రున్నుంచి మరియు వైయాఘ్రపదీ పుత్రునినుంచి, వైయాఘ్రపదీ పుత్రుడు కాణ్వీ పుత్రున్నుంచి మరియు కాపీ పుత్రునినుంచి, కాపీ పుత్రుడు ఆత్రేయీ పుత్రునినుంచి, ఆత్రేయీ పుత్రుడు గౌతమీ పుత్రున్నుంచి, గౌతమీ పుత్రుడు భారద్వాజీ పుత్రున్నుంచి, భారద్వాజీ పుత్రుడు పారాశరీ పుత్రునినుంచి, పారాశరీ పుత్రుడు వాత్సీ పుత్రున్నుంచి, వాత్సీపుత్రుడు (మరో) పారాశరీ పుత్రున్నుంచి, పారాశరీ పుత్రుడు వార్కారుణీ పుత్రున్నుంచి, వార్కారుణీ పుత్రుడు (మరో) వార్కారుణీ పుత్రున్నుంచి, వార్కారుణీ పుత్రుడు ఆర్తభాగీ పుత్రున్నుంచి, ఆర్తభాగీ పుత్రుడు శౌంగీ పుత్రున్నుంచి, శౌంగీ పుత్రుడు సాంస్కృతీ పుత్రున్నుంచి, సాంస్కృతీ పుత్రుడు ఆలంబాయనీ పుత్రున్నుంచి, ఆలంబాయనీ పుత్రుడు ఆలంబీ పుత్రున్నుంచి, ఆలంబీ పుత్రుడు జాయంతీ పుత్రున్నుంచి, జాయంతీ పుత్రుడు మాండూకాయనీ పుత్రున్నుంచి, మాండూకాయనీ పుత్రుడు మాండూకీ పుత్రున్నుంచి, మాండూకీ పుత్రుడు శాండిలీ పుత్రున్నుంచి, శాండిలీ పుత్రుడు రాథీతరీ పుత్రున్నుంచి, రాథీతరీ పుత్రుడు భాలుకీ పుత్రున్నుంచి, భాలుకీ పుత్రుడు క్రౌంచికీ పుత్రులిద్దరినుంచి, క్రౌంచికీ పుత్రులిద్దరు వైదభృతీ పుత్రున్నుంచి, వైదభృతీ పుత్రుడు కార్శకేయీ పుత్రున్నుంచి, కార్శకేయీ పుత్రుడు ప్రాచీనయోగీ పుత్రున్నుంచి, ప్రాచీనయోగీ పుత్రుడు సాంజీవీ పుత్రున్నుంచి, సాంజీవీ పుత్రుడు ఆసురిలో ఉండే ప్రాశ్నీ పుత్రున్నుంచి, ప్రాశ్నీ పుత్రుడు ఆసురాయణునినుంచి, ఆసురాయణుడు ఆసురినుంచి, ఆసురి యాజ్ఞవల్క్యున్నుంచి, యాజ్ఞవల్క్యుడు ఉద్దాలకున్నుంచి, ఉద్దాలకుడు అరుణున్నుంచి, అరుణుడు ఉపవేశినుంచి, ఉపవేశి కుశ్రినుంచి, కుశ్రి వాజశ్రవసున్నుంచి, వాజశ్రవసుడు బధ్యోగుని పుత్రుడైన జిహ్వావంతున్నుంచి, బధ్యోగపుత్రుడైన జిహ్వావంతుడు వర్షగణుని పుత్రుడైన అసితున్నుంచి, వర్షగణుని పుత్రుడైన అసితుడు హరితకశ్యపున్నుంచి, హరిత కశ్యపుడు శిల్ప కశ్యపున్నుంచి, నిధ్రువుని పుత్రుడైన కశ్యపుడు వాక్కు అనే స్త్రీనుంచి, వాక్కు అంభిణీ అనే స్త్రీనుంచి, అంభిణీ ఆదిత్యునినుంచి ఈ జ్ఞానాన్ని పొందారు.

**ఆదిత్యానీమాని శుక్లాని యజూగ్ంసి వాజసనేయేన యాజ్ఞవల్క్యేనాఖ్యాయంతే** – ఆదిత్యునినుంచి ఉపదేశం పొందిన ఈ శుక్లయజుర్వేదమంత్రాలను వాజసనేయ శాఖాధ్యాయి అయిన యాజ్ఞవల్క్యుడు వ్యాఖ్యానించి ప్రసిద్ధం చేశాడు.

## మంత్రం 6.5.4

**సమానమా సాఞ్జీవీపుత్రాత్సాఞ్జీవీపుత్రో మాణ్డూకాయనేర్మాణ్డూకాయనిర్మాణ్డవ్యాన్మాణ్డవ్యః కౌత్సాత్కౌత్సో మాహిత్థేర్మాహిత్థిర్వామకక్షాయణాద్వామకక్షాయణశ్శాణ్డిల్యాచ్ఛాణ్డిల్యో వాత్స్యాద్వాత్స్యః కుశ్రేః కుశ్రిర్యజ్ఞవచసో రాజస్తమ్బాయనాద్యజ్ఞవచా రాజస్తమ్బాయనస్తురాత్కావషేయాత్తురః కావషేయః ప్రజాపతేః ప్రజాపతిర్బ్రహ్మణో బ్రహ్మ స్వయమ్భుబ్రహ్మణే నమః ॥**

సాంజీవీ పుత్రుని వరకు ఇది ఒకటే వంశం. సాంజీవీ పుత్రుడు మాండూకాయనినుంచి, మాండూకాయని మాండవ్యున్నుంచి, మాండవ్యుడు కౌత్సున్నుంచి, కౌత్స్యుడు మాహిత్థినుంచి, మాహిత్థి వామకక్షాయణున్నుంచి, వామకక్షాయనుడు శాండిల్యున్నుంచి, శాండిల్యుడు వాత్స్యున్నుంచి, వాత్స్యుడు కుశ్రినుంచి, కుశ్రి రాజస్తంబుని పుత్రుడైన యజ్ఞవచసున్నుంచి, రాజస్తంబుని పుత్రుడైన యజ్ఞవచసుడు కవషి పుత్రుడైన తురున్నుంచి, కవషి పుత్రుడైన తురుడు హిరణ్యగర్భునుంచి, హిరణ్యగర్భ పరబ్రహ్మనుంచి (ఈ విద్యను పొందారు). పరబ్రహ్మ స్వయంసిద్ధం. పరబ్రహ్మకు నమస్కారం.

ఈ ఋషి పరంపరను చెప్పటంలో ఆరు ఉద్దేశాలు ఉన్నాయి.

1. ఋషుల అనుగ్రహం పొందటానికి ఋషి పరంపరను పఠించటంవల్ల పుణ్యం వస్తుంది. ఇది ఒక విధమైన ఋషియజ్ఞం. దీనివల్ల చిత్తశుద్ధి కలుగుతుంది.

2. ఈ విద్య ఎంత ప్రాచీనమైనదో తెలుస్తుంది. పదికాలాలు నిలిచిన విద్య ఇది.

3. ఈ గురుపరంపరలో ఆదిగురువు సాక్షాత్తూ బ్రహ్మదేవుడే. ఆయన వేదరూప ప్రజాపతి. ఆయన అనాది. అందువల్ల ఆదిగురువు భగవంతుడు. ఈ విద్య అపౌరుషేయం కాబట్టి తిరుగులేని విద్య.

4. పుత్రుడు జన్మించి గుణవంతునిగా పెరగటంలో తల్లి పాత్ర ప్రధానమైనది అంటారు. అందువల్ల ఇక్కడ ఆచార్యుల పరంపరను కీర్తిస్తూ శ్రుతి వారిని, వారివారి తల్లుల పుత్రులుగా పరిచయం చేసింది.

5. సాంజీవీ పుత్రుని దాకా ఒకటే వంశం. తర్వాతనుంచి అది రెండుగా చీలి వ్యాప్తి చెందింది. మొదటిపేరు శిష్యునిపేరు, తర్వాత గురువుపేరు వస్తాయి. మళ్ళీ ఆ గురువు శిష్యునిగా ఎవరి దగ్గర నేర్చుకున్నాడో వస్తుంది.

ఉదాహరణకు సాంజీవీపుత్రో మాండూకాయనేర్మాండూకాయనిర్మాండవ్యా – సాంజీవీపుత్రుడు మాండూకాయని నుంచి, మాండూకాయని మాండవ్యునినుంచి నేర్చుకున్నారు.

6. మూడవ మంత్రంలో ఆదిత్యునినుంచి యాజ్ఞవల్క్యుడు నేర్చుకున్నాడని, అందువల్ల దీనిని వాజసనేయి సంహిత అంటారనీ చూశాము. ఇది యాజ్ఞవల్క్యునికి ఇంకో పేరు. అతని బోధను శుక్లయజుర్వేదం అంటారని ఉపనిషత్తే చెబుతున్నది. ఈ మంత్రాలు శుక్లములు అంటే దోషరహితాలు, అపూర్వాలు అని అర్థం.

దీనితో ఐదవ బ్రాహ్మణము అయిన వంశ బ్రాహ్మణము ముగిసింది; ఆరవ అధ్యాయము ముగిసింది, ఖిల కాండము ముగిసింది. బృహదారణ్యకము ముగిసింది.

ఇతి బృహదారణ్యకోపనిషది షష్ఠాధ్యాయే వంశ బ్రాహ్మణము సమాప్తమ్॥

షష్ఠోఽధ్యాయః సమాప్తః॥

ఇతి వాజసనేయ బృహదారణ్యకోపనిషత్ సమాప్తా॥

# అధ్యాయము 6 - సారాంశము

ఇందులో ఐదు బ్రాహ్మణములున్నాయి.

1. **ప్రాణ సంవాద బ్రాహ్మణము** – ఇందులో హిరణ్యగర్భ ఉపాసన చూశాము.

2. **కర్మవిపాక బ్రాహ్మణము** – పంచాగ్నివిద్య ముఖ్య అంశం. ఇది ముఖ్యం కాబట్టి ఛాందోగ్యోపనిషత్తులో కూడా చూస్తాము. ఇందులో 15, 16 మంత్రాలు ముఖ్యం. అవి శుక్లగతి, కృష్ణగతుల వివరాలను చెబుతాయి.

3. **శ్రీమంథ బ్రాహ్మణము** – శ్రీకోసం మంథం తినే ఒక యజ్ఞం. అది ప్రాణ ఉపాసకుడు మాత్రమే చెయ్యాలి.

4. **పుత్రమంథ బ్రాహ్మణము** – పుత్రునికోసం భార్యాభర్తలు మంథం తినే నియమాలు; పుత్రునికి తల్లిదండ్రులు చేసే సంస్కారాలు వస్తాయి. దీనిద్వారా ప్రాకృతకర్మను ఎలా సంస్కృతకర్మగా మలుచుకోవచ్చో తెలుస్తుంది. రాబోయే తరం ఉన్నతంగా, పునీతులుగా ఉండేలా చెయ్యటంలో తల్లిదండ్రుల బాధ్యత ఎంత ఉందో చూపించే, సామాజిక స్పృహ కలిగించే బ్రాహ్మణము.

5. **వంశ బ్రాహ్మణము** – గురుశిష్యుల పరంపరను సూచిస్తుంది. ఇవాళ ఈ ఉపనిషత్తును మనం అధ్యయనం చెయ్యగలిగామంటే అది ఈ వంశపరంపరవల్లనే. సాక్షాత్తూ భగవంతుడే మనకు వేదాలను ఇచ్చాడు. అందువల్ల బ్రహ్మకు, వేదమాతకు మన నమస్కారాలు అందజేస్తున్నాము. బ్రహ్మ వేదమాతను ఇచ్చినందుకే కాదు, మనం విజయవంతంగా ఈ వేదవిద్యను నేర్చుకోగలిగినందుకు కూడా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము.

**శాంతి పాఠం**

**ఓం పూర్ణమదః పూర్ణమిదం**
**పూర్ణాత్ పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ**
**పూర్ణమేవావశిష్యతే**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ముందు విఘ్నాలు లేకుండా చెయ్యమని కోరటానికి శాంతి పాఠం పఠిస్తే, ఇప్పుడు విఘ్నాలు లేకుండా బృహదారణ్యకోపనిషత్తు అధ్యయనం అనే బృహత్కార్యం విజయవంతంగా ముగిసినందుకు కృతజ్ఞతా పూర్వకంగా బ్రహ్మదేవునికి, వేదమాతకు, ఋషిపరంపరకు నమస్కారం చేస్తున్నాము.

**హరిః ఓమ్**

**ఓం తత్సత్। సర్వం శ్రీకృష్ణార్పణమస్తు॥**

శ్రీ సద్గురుచరణారవిందాభ్యాం నమః

అధునా సర్వత్ర జగతి ప్రసరతః జనానాం ప్రాణాపాయకరస్య కొరోనా–నామకస్య రోగవిశేషస్య నివారణార్థం, శృంగేరి జగద్గురు విరచిత శ్రీదుర్గా పరమేశ్వరీ స్తోత్రపారాయణం కరిష్యే॥

## శృంగేరీజగద్గురువిరచితమ్

## ॥శ్రీదుర్గాపరమేశ్వరీస్తోత్రమ్॥

**ఏతావంతం సమయం సర్వాపద్భ్యోఽపి రక్షణం కృత్వా।**
**దేశస్య పరమిదానీం తాటస్థ్యం కేన వహసి దుర్గాంబ॥ ॥ 1 ॥**

**అపరాధా బహుశః ఖలు పుత్రాణాం ప్రతిపదం భవంత్యేవ ॥**
**కో వా సహతే లోకే సర్వాంస్తాన్మాతరం విహాయైకాం ॥ ॥ 2 ॥**

**మా భజ మా భజ దుర్గే తాటస్థ్యం పుత్రకేషు దీనేషు।**
**కే వా గృహ్ణంతి సుతాన్ మాత్రా త్యక్తాన్వదాంబికే లోకే॥ ॥ 3 ॥**

**ఇతః పరం వా జగదంబ జాతు దేశస్య రోగప్రముఖాపదోఽస్య ॥**
**న స్యుస్తథాః కుర్వచలాం కృపామ్ ఇత్యభ్యర్థనాం మే సఫలీకురుష్వ॥ ॥ 4 ॥**

**పాపహీనజనతావనదక్షాః సంతి నిర్జరవరా న కియంతః॥**
**పాపపూర్ణజనరక్షణదక్షాం త్వాం వినా భువి పరాం న విలోకే॥ ॥ 5 ॥**

**సర్వే భవంతు సుఖినః। సర్వే సంతు నిరామయాః।**
**సర్వే భద్రాణి పశ్యంతు। మా కశ్చిత్ దుఃఖభాగ్భవేత్॥**

# ఆర్ష విద్యా తరంగిణి పుస్తక ప్రచురణలు

ప్రకరణ గ్రంథాలు

01. అద్వైతవేదాన్త పరిచయము

02. భజగోవిన్దమ్

03. దృగ్దృశ్య వివేకము

ఉపనిషత్ గ్రంథాలు

01. ముండకోపనిషత్

02. కఠోపనిషత్

03. తేలికగా తైత్తిరీయం

04. ప్రశ్నోపనిషత్

05. ఈశావాస్యోపనిషత్

06. ఐతరేయోపనిషత్

07. ఛాందోగ్యోపనిషత్

08. కేనోపనిషత్

09. కైవల్యోపనిషత్

10. బృహదారణ్యకోపనిషత్

స్మృతి గ్రంథము

01. భగవద్గీత మొదటి షట్కము

02. భగవద్గీత రెండవ షట్కము

03. భగవద్గీత మూడవ షట్కము

ఇతర గ్రంథము

01. వేదాన్త జీవన విధానము